చదువు
రూ॥ 180/-
పేజీలు: 210




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

మధ్య ఆసియాలో సరికొత్త 'గ్రేట్ గేమ్'

త్రిముఖ వ్యూహంతో ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం

భారత్‌తో పెట్టుకుంటే...

పాతాళంలో ఉన్నా వదలిపెట్టం

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 243 | ఆదివారం | 3-08-2025 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## రాష్ట్రానికి క్రీడావిధానం లేక
# యువత పెడదారి

- ఇప్పటివరకు రాష్ట్రానికి క్రీడావిధానమే లేదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ ఆవిష్కరణ
- క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించడానికి పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం
- ఇది కాగితం కాదు.. బంగారు రేకులతో రాసిన పత్రం అని వ్యాఖ్య

ప్రజాపక్షం/హైదరాబాద్




మాదాపూర్‌లోని హెచ్ఐసిసిలో జరిగిన క్రీడా సదస్సులో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ–2025'ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. హెచ్ఐసిసిలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్య దర్శి జయేశ్ రంజన్, ప్రముఖ జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు, అర్జున్ అవార్డ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీతలతో పాటు ఆయా క్రీడా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ క్రీడా విధానం కేవలం ఒక కాగితం కాదు.. బంగారు రేకులతో రాసిన పత్రం.. అని తెలిపారు.చాలా లోతుగా ఆలోచించి తెలంగాణ క్రీడా పాలసీ ని తీసుకువచ్చామని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి క్రీడా విధానం అంటూ ఏది లేదని,క్రీడా పాలసీ లేకపోవడం వల్ల యువత పెడదారి పడుతోందన్నారు. ఈ మధ్య కాలంలో తెలంగాణలో డ్రగ్స్, గంజాయి కేసులు బాగా పెరిగిపోయాయని, డ్రగ్స్, గంజాయి నియంత్రణకు తరువాయి 2లో



## పోలవరం, బనకచర్ల
# అక్రమ ప్రాజెక్టులు

- వాటికి రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకం
- ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తుందని, ఈ అక్రమ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతటి పోరాటానికై వెనకకుబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పోలవరం, బనకచర్ల లింక్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా వ్యతిరేకిస్తోందని, ఈ అంశానికి సంబంధించి స్వయంగా తన లెటర్ హెడ్‌తో కేంద్రానికి లేఖలు రాశానని చెప్పారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టును కేంద్ర పర్యావరణ శాఖతో పాటు గోదావరి నది మేనేజ్‌మెంట్ బోర్డు కూడా వ్యతిరేకించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. బనకచర్ల పై ప్రభుత్వ స్టాండ్ క్లియర్‌గా ఉందని, బిఆర్‌ఎస్ పబ్లిసిటీ కోసం నిరాధారమైన ఆరోపణలను చేస్తోందన్నారు. బిఆర్‌ఎస్‌వి అన్ని తరువాయి 2లో

# యూరియాపై తప్పుడు లెక్కలు

- పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం అబద్ధాలాడడం రాష్ట్ర రైతాంగాన్ని అయోమయానికి గురిచేయడమే
- రాష్ట్రానికి కేటాయించింది 9.80 లక్షల మెట్రిక్ టన్నులే
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని, ఇది రాష్ట్ర రైతులను అయోమయానికి గురిచేయడమేనని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పడం శోచనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్‌కు కేంద్ర రసాయనాలు, ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం లేఖ రాశారు. ఖరీఫ్ 2025 గాను రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించారని, ఇందులో నెలవారీగా ఏప్రిల్ నుండి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల తరువాయి 2లో



## 553 మంది పంచాయతీ కార్యదర్శుల
# ఫేక్ అటెండెన్స్

- 15 మందిపై సస్పెన్షన్ వేటు
- మిగతా వారికి షోకాజు నోటీసులు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన 47 మంది ఎంపిఒలపైనా చర్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్




పంచాయతీ కార్యదర్శుల ఫేక్ అటెండెన్స్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు పూనుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాల్లో ఎంత మంది ఫేక్ అటెండెన్స్ నమోదు చేస్తున్నారనే విషయమై గ్రామ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆరా తీస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా విచారణను ప్రారంభించగా, ఇప్పటి వరకు 553 మంది తరువాయి 12లో

## ప్రజ్వల్ రేవణ్ణకు
# యావజ్జీవం

అత్యాచారం కేసులో శిక్ష ఖరారు చేసిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు

రూ. 10 లక్షల జరిమానా

బాధితురాలికి రూ. 7 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశం



**బెంగళూరు :** ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఈ శిక్ష ఖరారు చేసింది. రూ.10లక్షల జరిమానాను విధించింది. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను తరువాయి 12లో

## ఆ ఇద్దరూ
# అబద్ధాలకోరులే

- పార్లమెంట్‌లో ప్రధాని మోదీ, అసెంబ్లీలో కెసిఆర్ చెప్పినవి, చెప్పేవన్నీ అబద్ధాలే
- ట్రంప్‌కు మోదీ బానిసత్వం దేశ ప్రజలందరికీ అవమానకరం
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్



అబద్ధాలను అందంగా, అవలీలగా చెప్పే వ్యక్తులు ఈ దేశంలో ఇద్దరే ఇద్దరు ఉన్నారని, వారిలో ఒక్కరు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మరొకరు మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్.కె.నారాయణ అన్నారు. పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అసెంబ్లీలో కెసిఆర్ చెప్పినవి, చెప్పేవన్నీ అబద్ధాలేనని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ మీడియాతో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షులు ట్రంప్‌కు ప్రధాని మోదీ బానిసత్వం చేయడం దేశ ప్రజలందరికీ అవమానకరమన్నారు. పహల్గామ్ ఉగ్రవాదులను పార్లమెంట్ సమావేశాలకు ఒక్కరోజు ముందుగా హతమార్చి, వారి శవాలను అడ్డం పెట్టుకుని సభలో తప్పించునేందుకు మోదీ ప్రయత్నించారన్నారు. కశ్మీర్‌లో 7.50 లక్షల భద్రతాసిబ్బందిని మోహరించినప్పటికీ ఉగ్రవాదులను పట్టుకోకుండా ఇంత కాలం ఏం చేశారని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మోదీ గ్రాఫ్ పడిపోవడంతో ఆర్‌ఎస్‌ఎస్ 75 ఏళ్ల వరకే పదవీ కాలం అనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిందని, అయితే ప్రధానిగా ఎవరు ఉన్నప్పటికీ, తమకు సంబంధం లేదని, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థ పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాలలో తరువాయి 12లో




## సిపిఐ రాష్ట్ర మహాసభల్లో
# భవిష్యత్ ఉద్యమాల రూపకల్పన

### రంగారెడ్డి జిల్లా మహాసభలో కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజుల రామారంలో ఆగస్టు 20 నుండి 22 వరకు జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజల ఆర్థిక స్థితిగతులపై సమగ్రమైన చర్చ జరుగుతుందని, భవిష్యత్తు ఉద్యమాలకు ఆ మహాసభ వేదిక కాబోతున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిజాన్ని, మార్క్సిజాన్ని అంతం చేయడం ఎవరి తరం కాదన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్ లో శనివారం సిపిఐ రంగారెడ్డి జిల్లా 17వ మహాసభ సిపిఐ జిల్లా నాయకులు పానుగంటి పర్వతాలు, ఎం.డి. ఫైమిదా బేగం, ఎం.ప్రభులింగంల అధ్యక్షతన జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిథులుగా కూనంనేని, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. మహాసభలో కూనంనేని ప్రసంగిస్తూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, అమిత్‌షా నాయకత్వంలోని కేంద్ర బలగాలను పెద్ద ఎత్తున మావోయిస్టులను ఏరివేసే లక్ష్యంతో ఎన్ కౌంటర్లు చేస్తున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టులు లేకపోతే భారతదేశానికే కాదు, ప్రపంచానికే భవిష్యత్తు ఉండదని ఆయన అన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి దేశంలో యువత, ప్రజాస్వామ్యవాదులు ఆలోచించి బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అనేక వాగ్దానాలలో పూర్తిగా అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి. నరసింహ్మ మాట్లాడుతూ భవిష్యత్తులో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని తరువాయి 12లో



## ఇద్దరు కేరళ నన్‌లకు
# షరతులతో బెయిల్

**న్యూఢిల్లీ :** మానవ అక్రమ రవాణాకు, బలవంతపు మత మార్పిడీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో గత వారం ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయిన ఇద్దరు కేరళ సన్యాసినిల కు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ)కు చెందిన ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అందుకు ఇద్దరు సన్యాసినులు వారి పాస్‌పోర్టులను సరెండర్ చేయాలని, ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున పూచీకత్తు పెట్టాలని, ఒక్కొక్కరికి ఇద్దరు వ్యక్తుల చొప్పున ష్యూరిటీ ఇవ్వాలని కోర్టు షరతులు విధించింది. కాగా కేరళకు చెందిన ఆ ఇద్దరు సన్యాసినులు ముగ్గురు గిరిజన బాలికలను మతమార్పిడీ చేయించేందుకు ప్రయత్నించారని బజరంగ్ దళ్, హిందూవాహిని సంఘాల ప్రతినిధులు పోలీసులకు తరువాయి 12లో

## 2024 లోక్‌సభ
# ఎన్నికల్లో రిగ్గింగ్

- మావద్ద పూర్తి ఆధారాలున్నాయ్
- 10 నుంచి 15 సీట్లు తక్కువ వచ్చి ఉంటే మోదీ ప్రధాని అయ్యేవారు కాదు
- దేశంలో ఎన్నికల వ్యవస్థ ఎప్పుడో చచ్చిపోయింది
- న్యాయ సదస్సులో విపక్షనేత రాహుల్‌గాంధీ
- దిగ్బంధనంలో రాజ్యాంగం : సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ పార్టీ మరోమారు మండిపడింది. ఇప్పటికే ప్రతిపక్షాలు బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టగా కాంగ్రెస్ తనదైన శైలిలో విరుచుకుపడింది. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఎప్పుడో చచ్చిపోయిందని, 2024 లోక్‌సభ ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతిలో ఎన్నికల కమిషన్ తోలుబొమ్మగా మారిందని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత ఆరోపించారు. శనివారం ఢిల్లీలో 'రాజ్యాంగ సవాళ్లు: దృక్పథాలు, మార్గాలు' అనే అంశంపై జరిగిన న్యాయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, ఖర్గే పాల్గొని ప్రసంగించారు. మోదీ స్వల్ప మెజారిటీతో ప్రధాని కుర్చీలో కూర్చున్నారని, కొన్ని సీట్ల తేడా ఉంటే ఆయన అక్కడ ఉండేవారు కాదని రాహుల్‌గాంధీ అన్నారు. కర్ణాటకలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ సేకరించిన డేటాను ఆయన ఉదహరించారు. అక్కడ పార్టీ ఓటర్ల ఫొటోలు, పేర్లను భౌతికంగా తనిఖీ చేయగా, మొత్తం 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు బోగస్ అని తేలిందన్నారు. తాము ఈ డేటాను విడుదల చేసినప్పుడు ఎన్నికల వ్యవస్థ ద్వారా వెళ్ళబోయే షాక్ వేవ్ ఎలా ఉంటుందో చూస్తారన్నారు. ఇది అక్షరాలా అణు బాంబు లాంటిది అని మరోసారు ఉద్ఘాటించారు. అయితే భారతం దేశంలో ఎన్నికల వ్యవస్థ ఏనాడో చచ్చిపోయిందన్నారు. భారత ప్రధానమంత్రికి చాలా తక్కువ మెజారిటీ ఉందన్నారు. 10–15 సీట్లలో రిగ్గింగ్ జరిగి వాస్తవ గణాంకాలు 70–80 నుండి 100 వరకు తరువాయి 2లో

## వచ్చే ఎన్నికల్లో
# బిజెపికి 150 మించవు

### మోదీని కుర్చీ నుంచి రాహుల్ దింపేస్తారు
### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాహుల్ గాంధీ నేతృత్వంలోనే పోరాటం చేస్తామని, వచ్చే ఎన్నికల్లో బిజెపికి 150 ఎంపి స్థానాలకు మించి ఒక్క సీటు రాబోదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లోఎఐసిసి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కానిస్టిట్యూషనల్ ఛాలెంజెస్ పర్స్పెక్టివ్స్‌అండ్ పాత్వేస్ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ మోదీ లేకుంటే బిజెపికి 150 సీట్లు కూడా రావని, ఆ పార్టీకి చెందిన ఎంపి నిశికాంత్ దూబే ప్రకటించారని, దూబే తన డైరీలో రాసి పెట్టుకోవాలని, వచ్చే ఎన్నికల్లో బిజెపికి 150 సీట్లకు మించి ఒక్క స్థానం కూడా ఎక్కువగా రాబోదని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్, వాజ్‌పేయ్‌లు మోదీని ప్రధాని సీటు నుంచి దింపలేకపోయారని, కానీ వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ మోదీని ప్రధాని కుర్చీ నుంచి తరువాయి 2లో

## అనారోగ్యంతో కాలేజీకి రాకపోతే
# పరీక్షలకు అనుమతించండి

### హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాపక్షం/హైదరాబాద్



అనారోగ్యం వల్ల ఎవరైనా విద్యార్థికి హాజరు శాతం తగ్గితే దానిని తీవ్రంగా పరిగణించొద్దని ఉన్నత విద్యా శాఖకు హైకోర్టు ఆదేశించింది. ఇంజనీరింగ్ పరీక్షలు రాసేందుకు పిటిషనర్‌ను అనుమతించాలంది. ఇంజనీరింగ్ మూడో ఏడాది (2024–25) సెకండ్ సెమిస్టర్ పరీక్షలు రాయకుండా కాలేజీ ఇచ్చిన సర్క్యులరును మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసరలోని గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ టెక్నాలజీ (అటానమస్) బీటెక్ విద్యార్థిని కొండపర్తి మాన్విత హైకోర్టును ఆశ్రయించారు. దీనిని జస్టిస్ కె.శరత్ విచారించి పై విధంగా ఉత్తర్వులు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## 39 మంది అక్రమ నివాసితులు అమెరికా నుండి బంగ్లాకు తరలింపు

**ఢాకా:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 39 మంది బంగ్లాదేశీ జాతీయులను ట్రంప్ ప్రభుత్వం ఢాకాకు తరలించింది. ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండా వీరంతా అక్రమంగా అమెరికాలో పనిచేస్తున్నారని పేర్కొంటూ 39 మందిని తిరిగి బంగ్లాదేశ్‌కు తరలించింది. వీరంతా శనివారం ఉదయం ఢాకాలోని హజ్రత్ షాజలాల్ విమానాశ్రయంలో దిగారు. ట్రంప్ ప్రభుత్వం గడచిన జనవరిలో అధికారం చేపట్టినప్పటినుండి ఎలాంటి అధికారిక పత్రాలు లేని వలస ప్రజలపై ఉక్కుపాదం మోపింది. లక్షలమందిని వివిధ దేశాలకు తరలించడంలో భాగంగా 39 మంది బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు.



# సమాచార యుద్ధంలో ఇజ్రాయెల్ ఓడిపోతోంది

బెంజిమన్ నెతన్యాహూ





ఇజ్రాయెల్ సాహిత్యవేత్త గ్రోస్‌మన్

**జెరూసలెం:** ఇజ్రాయెల్ ఏకకాలంలో ఎనిమిదివైపులా యుద్ధం చేస్తోందని ఆ దేశ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ చెప్పారు. జెరూసలెంలో ఎవాంజెలికల్ క్రిస్టియన్ ఆడియన్స్‌ను ఉద్దేశించి నెతన్యాహూ మాట్లాడుతూ, సమాచార యుద్ధంలో ఇజ్రాయెల్ ఓడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయస్థాయిలో ప్రధాన పత్రికలన్నీ ఇజ్రాయెల్‌ను ఒక దుర్మార్గదేశంగా చిత్రీకరిస్తున్నాయని, గాజాలో ఎముకలగూడుగా ఉన్న పిల్లల ఫోటోలను మొదటి పేజీల్లో ప్రచురిస్తున్నాయని, ప్రజలు ఆకలి చావులు ఛస్తున్నారని రాతలు రాస్తున్నాయని మండిపడ్డారు. గాజాలో తీసిన ఫొటోలను తమకు అనుకూలంగా కొద్దిగా మార్పులు చేర్పులు చేసి ప్రచురిస్తున్నారని ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌లు ఈ ఫోటోలు చూసి తమ ప్రభుత్వ మౌలిక విధానాలను మార్చుకుంటున్నారన్నారు. గతవారంలో 28 దేశాలు ఒక ఉమ్మడి ప్రకటన చేస్తూ, గాజాలో తక్షణం కాల్పుల విరమణ జరగాలని, ఐక్యరాజ్యసమితి భాగస్వామ్య సంస్థల నేతృత్వంలో ప్రజలకు ఆహార పంపిణీ జరిగేలా చూడాలని పిలుపు ఇచ్చాయి. ఒకవైపు ఇరాన్‌తో, మరోవైపు గాజాలోని హమాస్ ఉగ్రవాదులతో, లెబనాన్‌లోని హిజ్బుల్లా ఉగ్రవాదులతో, యెమెన్‌లోని హౌతీ ఉగ్రవాదులతో, వెస్ట్‌బ్యాంక్‌లోని హింసాత్మక ముఠాలతో, ఇంకోవైపు సిరియాతో, ఇరాక్‌తో కూడా బహుముఖాలుగా పోరాటం చేస్తోందని, ఈ ఏడు వైపుల పోరాటంతోపాటు కొత్తగా సత్యంకోసం ఎనిమిదో కోణంలో పోరాటం చేస్తోందని అన్నారు. అంతర్జాతీయ పత్రికలన్నీ ఇజ్రాయెల్ దేశాన్ని మానవత్వంలేని రాతిగుండెగల దేశంగా, గాజాను ఆక్రమించుకునే దేశంగా చిత్రీకరిస్తున్నాయని, ఈ సమాచార యుద్ధంలో ఇజ్రాయెల్ ప్రభుత్వం ఓడిపోతోందన్నారు.

**గాజాలో సామూహిక హత్యాకాండ**

గాజాలో కరువు పరిస్థితులు కొత్త దశకు చేరుకున్నాయని, ప్రజలు ఆహారం ఒకరికంటే మరొకరు ముందుగా సంపాదించుకోవడంకోసం పరస్పరం పోరాటం చేస్తున్నారని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఆకలి కేకలు పెట్టే అమాయక ప్రజలను ఆహార కేంద్రాలవద్ద అమానుషంగా తుపాకులతో కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ అమానుష హత్యలను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. అదేవిధంగా ఇటీవలికాలంలో యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా ఏకగళంతో గాజాలో పాలస్తీనా ప్రజలపట్ల సానుభూతి ప్రకటిస్తూ, పాలస్తీనా స్వయంప్రతిపత్తికోసం డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్‌కు చెందిన ప్రముఖసాహిత్యవేత్త, అనేక అవార్డుల గ్రహీత డేవిడ్ గ్రోస్‌మన్ కూడా గాజాలో సామూహిక హత్యాకాండ కొనసాగుతోందని ప్రకటించారు. గాజాలో పరిస్థితులతో తన హృదయం ముక్కలైపోయిందని ఆయన అన్నారు. తన హృదయం ముక్కలైపోయిందనే పదాన్ని ఉపయోగించేందుకు చాలా సంవత్సరాలుగా తాను ఇష్టపడలేదని, కానీ గాజా నుండి పత్రికల్లో వస్తున్న ఫోటోలను చూసిన తర్వాత ఈ పదాన్ని ఉపయోగించకతప్పడంలేదన్నారు. కాగా వాషింగ్టన్‌లో ట్రంప్ అధికారులు ఒక ప్రకటన చేస్తూ, రాజకీయ అధికారంకోసమే నెతన్యాహూ సుదీర్ఘ యుద్ధం చేస్తున్నారని తమ అధ్యక్షుడు నమ్ముతున్నారని శుక్రవారంనాడు పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెల నుండి గాజాలో ఆహార కేంద్రాలవద్ద వేచి ఉన్న ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం కాల్చిచంపడం ప్రారంభించింది. ఇలా ఇప్పటివరకు 1,783 మంది పిల్లలు,మహిళలు, ఇతర వయోజనులు మరణించారు. గాజాలో 22 నెలలుగా సాగుతున్న యుద్ధంలో ఇప్పటివరకు 60,400 మంది మరణించారు. హమాస్ వద్ద 50 మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారు. వీరిలో కేవలం 25 మంది లోపే సజీవులుగా ఉన్నారని అంచనా.

## ఐదో తేదీన బంగ్లాదేశ్‌లో అధికారికంగా 'జులై డిక్లరేషన్'

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ఈనెల ఐదో తేదీన మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం ''జులై డిక్లరేషన్'' చేయనున్నది. ప్రభుత్వం అన్నిపార్టీలతో చర్చించి 'జులై డిక్లరేషన్' ముసాయిదాను రూపొందించింది. దీనిపై వచ్చే మంగళవారం సాయంత్రం అధికారిక ప్రకటన చేయనున్నది. జాతీయ ఏకాభిప్రాయానికి అనుగుణంగా ఈ జులై డిక్లరేషన్ ప్రభుత్వం చేస్తుందనిఇ యూనుస్ ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. ఇంతకుముందు యూనుస్ ప్రెస్ ప్రతినిధి మహఫుజ్ అలమ్ గడచిన జనవరి తొమ్మిదోతేదీన ఒక ప్రకటన చేస్తూ, ఎస్ ఎ డి (స్టూడెంట్స్ ఎగెనెస్ట్ డిస్క్రిమినేషన్) ఉద్యమం జులై డిక్లరేషన్‌ను రూపొందించడంకోసం అన్ని రాజకీయపార్టీలమధ్య ఏకాభిప్రాయ సాధనకు ఒక చోదకశక్తిగా మాత్రమే ప్రభుత్వం పనిచేస్తుందని, దీనిని ప్రభుత్వం రూపొందించబోదని చెప్పారు. 2024 జులైలో బంగ్లాదేశ్‌లో ఉద్యోగాల్లో కోటాలో సంస్కరణల ఉద్యమంగా ప్రారంభమై నిరసనగా ప్రారంభమై చివరకు జులై తిరుగుబాటుగా, విద్యార్థుల ఉద్యమంగా రూపుదాల్చి ప్రభుత్వ పతనానికి దారితీసింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు,ప్రజలతోపాటు దీనితో సంబంధం ఉన్న అందరి సమక్షంలోనూ ప్రభుత్వం 'జులై డిక్లరేషన్' ప్రకటించనున్నది. జులై ఉద్యమం చివరిరోజుల్లో గత ఏడాది డిసెంబరులో ఎస్ఎడి (వివక్షను వ్యతిరేకించే విద్యార్థులు) చేసిన డిమాండ్ మేరకు ఈ ముసాయిదా ప్రకటనను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఎస్ ఎ డి–జతియా నాగరిక్ కమిటీ (జెఎన్‌సి)లు కలిసి నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్ సి పి)ని ఏర్పాటు చేశాయి. ఈ విధంగా బంగ్లాదేశ్ చరిత్రలో మొదటిసారి విద్యార్థులు, ప్రజల ఉద్యమం ద్వారా ఒక రాజకీయపార్టీ ఆవిర్భవించింది. ఈ రాజకీయపార్టీ కూడా మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వానికి అనుకూలమైన విద్యార్థి నాయకుడు నహిద్ ఇస్లాం కనుసన్నల్లో ఆవిర్భవించింది. వాస్తవానికి చెప్పాలంటే హసీనాకు వ్యతిరేకంగా ఈ ''జులై ఉద్యమం'' ప్రారంభించడానికి కీలక సూత్రధారి, హసీనా రాజీనామా చేసి దేశం వదిలివెళ్ళిపోవడానికి ప్రధాన కారకుడు నహిద్ ఇస్లాం ప్రారంభించిన ఉద్యమమే. అదేవిధంగా ఈ ఉద్యమ కాలంలో ఢాకాలోని రాయెర్ బజార్‌లోని ఇంటలెక్చువల్ గ్రేవ్ యార్డ్‌లో 114 మంది శవాలను పాతిపెట్టారు. ఉద్యమంలో మరణించిన ఈ త్యాగమూర్తులను గుర్తించే కార్యక్రమం కూడా ప్రారంభిస్తామని హోం వ్యవహారాల ఉన్నతాధికారి మహ్మద్ జహంగీర్ అలమ్ చౌధురి చెప్పారు.

### అమెరికాలో క్షీణించిన కొత్త ఉద్యోగాలు

# నిజం చెప్పినందుకు ఉన్నతాధికారిణిపై వేటు



**వాషింగ్టన్ :** ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల భారాలు మోపి అమెరికా వాణిజ్యలోటు భర్తీ యుద్ధం ప్రారంభించిన ట్రంప్, ఉద్యోగాల సృష్టికి సంబంధించిన నిజం మాట్లాడిన అమెరికా ఆర్థికరంగ వ్యవస్థలకు చెందిన మహిళా ప్రధానాధిపతిపై శనివారంనాడు వేటు వేశారు. టారిఫ్‌ల విధింపు కారణంగానే అమెరికా స్టాక్ మార్కెట్ పతనమైందని, జులైనెలలో ఉద్యోగాల డేటా కుదించుకుపోయిందని చెప్పిన బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ (బిఎల్ఎస్) కమిషనర్ ఎరికా లీ మెక్ ఎంటార్ఫర్‌ను పదవి నుండి తొలగించారు. 20 ఏళ్ళు పైగా ఆమె ప్రభుత్వంలో పనిచేస్తున్నారు. 2023లో బిఎల్ఎస్ బాధ్యతలకు సెనేట్ ఆమెను ఏకగ్రీవంగా నామినేట్ చేసింది. గతనెలలో అమెరికాలో 73,000 కొత్త ఉద్యోగాలు వచ్చాయని, అదేసమయంలో నిరుద్యోగం 4.1 శాతం నుండి 4.2శాతానికి పెరిగిందని గణాంకాల నివేదిక ఇచ్చారామె. మే నెలలో సవరించిన ఉద్యోగాల హైరింగ్ 1.44 లక్షల నుండి 19,000కు చేరిందని పేర్కొన్నారు. ఈ హైరింగ్ జూన్ నెలలో 1.47 లక్షల నుండి 14,000కు చేరిందని పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాలలో ఇదే అతి తక్కువ ఉద్యోగాల సృష్టి అని ఆమె నివేదికలో పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ న్యాయబద్ధంగా పనిచేయడంలేదని ఎరిక్ మెక్ ఎంటార్ఫర్ చెప్పారని ట్రంప్ విమర్శించారు. కొత్త టారిఫ్‌ల విధానంవల్ల ఈ ఏడాది ఆమెరికా ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పుంజుకుంటుందని, ఉద్యోగాలు విపరీతంగా పెరుగుతాయని ట్రంప్ భారీ ఎత్తున ప్రచారం చేస్తున్న దశలో టారిఫ్‌ల ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్నవేళ జాబ్ డేటా కుదించుకుపోవడం ట్రంప్‌కు ఆందోళన కలిగించింది. బిఎల్ఎస్ తీరు ఆయనకు ఆగ్రహం రప్పించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా ఎరికా ఎంటార్ఫర్ జాబ్ డేటాను తనకు అనుకూలంగా మార్చి అవిధేయమార్గంలో మోసపూరితంగా వ్యవహరించారని, తనను, రిపబ్లికన్లను ప్రజల్లో చెడ్డగా చూపించారని అందుకే ఆమెపై వేటు వేశానని సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టింగ్ చేశారు. వైట్‌హౌస్ తీసుకున్న అసాధారణ చర్యల కారణంగా స్టాక్‌మార్కెట్లు పడిపోవడంతో డేటాను రాజకీయం చేయడం ద్వారా ట్రంప్ ప్రజల విశ్వాసాన్ని నాశనం చేస్తున్నారని కొందరు ఆరోపించారు. బలహీనమైన గణాంకాలు నమోదు కావడంతో అధికారిణిపై వేటు వేసిన చెడ్డ నాయకుడు ట్రంప్ అని సెనేట్ మైనారిటీ నాయకుడు చెక్ షుమర్ విమర్శించారు. పీటర్‌సన్ ఇనిస్టిట్యూట్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ సీనియర్ ఫెలో జెడ్ కోల్కో స్పందిస్తూ, బిఎల్ఎస్ అధిపతి తొలగింపు చాలా తీవ్ర పరిణామాలకు దారితీస్తుందన్నారు. ఐతే ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ తన పోస్టింగ్‌ను నిర్ణయాన్ని సమర్థించేవారు ఎంతోమంది ఉన్నారన్నారు. అనేక దేశాలపై పది నుండి యాభైశాతం వరకూ ట్రంప్ టారిఫ్‌లు విధించడంతో ఈ డేటా వివాదం తలెత్తింది.

## ట్రంప్‌ను దెబ్బకు దెబ్బ తీస్తాం: బ్రెజిల్

**రియో డీ జనైరో:** ఎవ్వరిమీదా లేనంత భారీస్థాయిలో 50 శాతం సుంకాలు విధించిన డోనాల్డ్ ట్రంప్‌కు ఒక ఝలక్ ఇచ్చేందుకు బ్రెజిల్ సన్నద్ధమవుతోంది.ట్రంప్ అనేక దేశాలపై శుక్రవారం సుంకాలు విధించినప్పటికీ పొరుగు దేశం బ్రెజిల్‌పైనే దారుణంగా సుంకాలు విధించి భయపెట్టారు. ఆ దేశాధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో డసిల్వా శనివారం మాట్లాడుతూ, అమెరికాతో చర్చలకు తమదేశం ఎప్పుడూ సిద్ధంగా ఉందని, కానీ, ఇప్పుడు దెబ్బకు దెబ్బ తీస్తామని ప్రతిజ్ఞ చేశారు.చర్చల ద్వారా ఫలితాలు రాబట్టగలమని ఆశాభావంతో ఉన్నామన్నారు. కొన్ని వస్తువులపై అమలులోకి తెచ్చిన 50 శాతం సుంకాలపై దీటుగా సరైన స్పందన ఇచ్చేందుకు తమదేశం ప్రయత్నాలు చేస్తోందన్నారు. బ్రెజిల్ దేశ పౌరులు, వాణిజ్యసంస్థలు మాత్రమే అమెరికాతో మాకున్న సంబంధాలపై మార్గనిర్దేశం చేసే హక్కు కలిగి ఉన్నారన్నారు.

## ఎన్నికల్లో రిగ్గింగ్
(మొదటి పేజీ తరువాయి)

ఉంటే ఆయన దేశానికి ప్రధానమంత్రి అయ్యేవారు కాదని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో లోక్‌సభ ఎన్నికల్లో ఏవిధంగా రిగ్గింగ్ జరగబోతోంది, ఇప్పటికే జరిగిన రిగ్గింగ్‌ను కూడా ఎటువంటి సందేహం లేకుండా నిరూపించబోతున్నామన్నారు. రాజ్యాంగాన్ని రక్షించే, దానిని సమర్థించే సంస్థను తుడిచిపెట్టి స్వాధీనం చేసుకున్నారని చాలా స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఇంతకు ముందు తన వద్ద ఆధారాలు లేవని అందుకే గతంలో ఇలాంటి ప్రకటనలు చేయలేకపోయానని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. తన వద్ద 100 శాతం రుజువు ఉందని, వాటిని ఎవరికి చూపించానో వారు కుర్చీ నుంచి పడిపోయారని, అది ఎలా సాధ్యమవుతుందని అన్నారని, కానీ అది సాధ్యమే అక్షరాలా అది జరుగుతోందన్నారు. ఎన్నికల వ్యవస్థ గురించి తాను మాట్లాడుతున్నానని, ఏదో తప్పు జరిగిందనే అనుమానం తనకు ఎప్పుడూ ఉందన్నారు. '2014 నుండి ఏదో తప్పు జరుగుతోందని అనుమానం ఉంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలపైనా అనుమానం ఉంది. రాజస్థాన్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదు, మధ్యప్రదేశ్‌లో ఒక్క సీటు కూడా రాలేదు, గుజరాత్‌లో ఒక్క సీటు కూడా రాలేదు... ఇది నాకు ఆశ్చర్యం కలిగించింది' అని ఆయన అన్నారు.

**సమాజాన్ని విభజిస్తున్న మోదీ**

మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ప్రధాని మోదీ సమాజాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పవిత్రమైన శ్రావణ మాసంలో ముఖ్యమైన అంశాలపై 'మౌన వ్రతం' (మౌన ప్రతిజ్ఞ) చేయాలని ఎంచుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ, బిజెపి పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, దానిని రక్షించడం ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త విధి అని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం కాదని, మన ప్రజాస్వామ్యానికి ఆత్మ అని మనందరికీ తెలుసని ఇది ప్రతి భారతీయుడికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం హక్కును ఇస్తుందన్నారు. 'కానీ నేడు రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. అధికారంలో ఉన్న నాయకులు రాజ్యాంగాన్ని మార్చడం గురించి మాట్లాడుతున్నారు. 2024 ఎన్నికల్లో బిజెపి 400 సీట్లు గెలిచి ఉంటే, వారు రాజ్యాంగాన్ని మార్చి ఉండేవారు. కానీ ఇది దేశ ప్రజల బలం, '400 పార్' అని అంటున్న వారి ముఖం మీద గట్టి దెబ్బ కొట్టారు' అని ఖర్గే అన్నారు. ఇది కాంగ్రెస్ సాధించిన ఘనత అని ఆయన అన్నారు. ఈ ఘనత రాహుల్ గాంధీకి దక్కుతుందని, ఆయన రాజ్యాంగాన్ని విడిచిపెట్టకుండా దానిని కాపాడటానికి ప్రచారం ప్రారంభించారని ఖర్గే పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కింద బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును కోల్పోతున్నారని పేర్కొంటూ ఇసి పేదలు, అణగారిన వర్గాలు, మైనారిటీల ఓటు హక్కులను లాక్కోవాలని చూస్తోందని, లేకపోతే వారు బిజెపి పాలనతో విసిగిపోయి కాంగ్రెస్‌కు ఓటు వేస్తారని భయపడుతుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలలో ఓటర్లను మార్చారని ఆరోపిస్తూ, కర్ణాటకలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లను ఎలా మార్చారో రాహుల్ గాంధీ వివరించినందున కాంగ్రెస్ వద్ద ఇప్పుడు 'రుజువు' ఉందని ఆయన అన్నారు. 'ఒక చిన్న గదిలో తొమ్మిది మంది ఓటర్లు, మహారాష్ట్రలోని ఒకే హాస్టల్‌లో తొమ్మిది వేల మంది ఓటర్లు ఎలా ఉంటారు? దీన్ని అర్థం చేసుకోవాలి. ఎన్నికల కమిషన్ మోదీ జీ కీలుబొమ్మనా అని ప్రశ్నించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలు, దళితులపై వివక్ష ఒక సాధారణ అలవాటుగా మారిందని ఖర్గే ఆరోపించారు. ప్రధాని మోడీ ఎన్నికల సమయంలో తన ప్రకటనలతో సమాజాన్ని ధ్రువీకరించడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ ఆరోపించారు. 'ఎన్నికల్లో ఆయన ఎప్పుడూ కోడి, మొఘలులు, మంగళసూత్రాల గురించి మాట్లాడుతారు. సమాజాన్ని విభజించడం గురించి ఎప్పుడూ మాట్లాడుతారు. దేశ ప్రజలు ఆయనను ఎన్నుకుని రాజ్యాంగాన్ని రక్షించడానికి ఎన్నుకున్నారు, కానీ ఆయన దానిని అణిచివేయడానికి పనిచేస్తున్నారు. రాజ్యాంగాన్ని ఎవరైనా అణిచివేస్తున్నారంటే అది ప్రధాన మంత్రి, బిజెపి అని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ ప్రవేశిక నుండి 'సోషలిస్ట్, సెక్యులర్' అనే పదాలను తొలగించాలని బిజెపికి చెందిన వ్యక్తులు చెప్పారని, కానీ బిజెపి 'సోషలిస్ట్, సెక్యులర్' అనే పదాలను పార్టీ రాజ్యాంగంలో ఉంచిందని కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. బిజెపి–ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తులు సోషలిస్ట్ మరియు సెక్యులర్ అనే పదాలను తొలగించలేరు, ఎందుకంటే వారికి ఈ దేశ ప్రజలకు ఉన్నంత అధికారం లేదు అని ఆయన అన్నారు.

**నేను రాజును కాదు : రాహుల్**

కాగా, రాహుల్ గాంధీ ప్రసంగిస్తుండగా ఆయన మద్దతుదారులు నినదించారు. 'ఇస్ దేశ్ కా రాజా కైసా హో.. రాహుల్ గాంధీ జైసా హో' అని పలువురు నినదించగా దానికి రాహుల్ గాంధీ స్పందిస్తూ.. తాను రాజును కాదని.. కావాలని అనుకోవడం లేదన్నారు. అయినా పలువురు అలాగే నినాదాలు చేశారు. తాను రాజుగా మారాలని కూడా కోరుకోవడం లేదని.. రాజును వ్యతిరేకిస్తున్నానని.. తాను ఆ భావనకు కూడా వ్యతిరేకినన్నారు. రాహుల్ గాంధీ గతంలో ప్రధానిని ఉద్దేశించి 'రాజు'గా అభివర్ణిస్తూ ప్రజల గొంతుక వినడం లేదంటూ ఆరోపించారు.

### దిగ్బంధంలో రాజ్యాంగం : సోనియాగాంధీ

భారత రాజ్యాంగం దిగ్బంధించబడిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పేర్కొన్నారు. మన ప్రజాస్వామ్య గణతంత్రాన్ని శక్తివంతమైన కొద్దిమందికి సేవ చేసే దైవపరిపాలనా కార్పొరేట్ రాజ్యంతో భర్తీ చేయడం ద్వారా బిజెపి 'సైద్ధాంతిక తిరుగుబాటు' తీసుకురావాలని చూస్తోందని ఆమె ఆరోపించారు. 'రాజ్యాంగ సవాళ్లు –దృక్పథాలు, మార్గాలు' అనే అంశంపై రోజంతా జరిగిన జాతీయ న్యాయ సమావేశం సందర్భంగా ఆమె తన సందేశాన్ని పంపారు. పార్లమెంటులో, కోర్టులలో, వీధుల్లో రాజ్యాంగాన్ని అణగదొక్కే ప్రతి ప్రయత్నాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని, ప్రతి భారతీయుడి గౌరవాన్ని కాపాడటానికి ఇది కేవలం రాజకీయంగానే కాకుండా సైద్ధాంతిక నిబద్ధత అని నొక్కి చెప్పారు. 'నేడు, రాజ్యాం గం ముట్టడిలో ఉంది. స్వేచ్ఛ కోసం ఎప్పుడూ పోరాడని లేదా సమానత్వాన్ని సమర్థించని బిజెపి–ఆర్ఎస్ఎస్, ఇప్పుడు చాలా కాలంగా వ్యతిరేకిస్తూ వస్తున్న చట్రాన్ని కూల్చివేయడానికి తన శక్తిని ఉపయోగిస్తుంది' అని ఆమె అన్నారు. 'వారి సైద్ధాంతిక పూర్వీకులు మనుస్మృతిని కీర్తించారు, త్రివర్ణ పతాకాన్ని తిరస్కరించారు. అధికారంలో ఉన్నప్పుడు, వారు సంస్థలను నిర్వీర్యం చేశారు. అసమ్మతిని నేరంగా పరిగణించారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నారు. దళితులు, ఆదివాసీలు, ఒబిసిలు, శ్రామిక పేదలకు ద్రోహం చేశారు. ఇప్పుడు వారు అంబేద్కర్ సమాన పౌరసత్వ దృక్పథానికి మూల స్థంభాలు అయిన సోషలిజం, లౌకికవాదాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది సంస్కరణ కాదు, కానీ శక్తివంతమైన కొద్దిమందికి సేవ చేసే దైవపరిపాలనా కార్పొరేట్ రాజ్యంతో మన ప్రజాస్వామ్య గణతంత్రాన్ని భర్తీ చేసే సైద్ధాంతిక తిరుగుబాటు' అని మాజీ కాంగ్రెస్ చీఫ్ ఆరోపించారు. భారత జాతీయ కాంగ్రెస్ త్యాగాలు, దార్శనికత ద్వారా రాజ్యాంగం రూపొందించబడిందని ఆమె పేర్కొంటూ, స్వాతంత్ర్యానికి ముందే, కాంగ్రెస్ 'భారతీయులతో, భారతీయుల కోసం' రాజ్యాంగాన్ని ఊహించిందని ఆమె అన్నా రు. సామాజిక, ఆర్థిక న్యాయం లేకుండా, రాజకీయ ప్రజాస్వామ్యం కేవలం ఒక అలంకరణ మాత్రమే అవుతుందని తాను హెచ్చరించానని ఆమె చెప్పారు.

## చెరువులు, కుంటల పరిరక్షణకు నీటి నిర్వహణ కమిటీల ఏర్పాటు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో రైతు కమిషన్ భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు నీటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ విజ్ఞప్తి చేసింది. సచివాలయంలో శనివారం ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీరెడ్డిలు భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు రైతు కమిషన్ నిర్వహించిన కార్యక్రమాలను వివరించడంతో పాటు రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను మంత్రికి కమిషన్ కమిషన్ చైర్మన్ సూచనలు చేశారు. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు వున్న అంశాన్ని గుర్తుచేశారు. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమై చెరువులను కాపాడుకునే వారని, ఐతే గత 10 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వివరించారు. కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లే ఔట్లు వేయడం, వాటర్ బాడీస్ కు వచ్చే క్యాచ్ మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని తెలిపారు. ఐతే ప్రధానంగా చెరువులు కుచించుకపోవడం, భూగర్భ జలాల నీటి మట్టాలు పడిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో చెరువులు కాపాడుకుపడానికి సమగ్రమైన పాలసీ ఉండాలని రైతు కమిషన్ మంత్రికి వివరించింది.. ఆ పాలసీని కమిషన్ రూపొందిస్తోందన్నారు. నిపుణులతో పాలసీకి సంబంధించి ప్రజెంటేషన్ మీటింగ్ త్వరలో కమిషన్ ఏర్పాటు చేయనుందని ఆ సమావేశానికి హాజరు కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డినికోరారు.

## యువత పెడదారి
(మొదటి పేజీ తరువాయి)

ఈగల్ ఫోర్స్ ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. దేశంలో క్రీడలను ప్రోత్సహించకపోవడంవల్ల యువత డ్రగ్స్ కు అలవాటు పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ చైతన్యవంతమైన గడ్డ.. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడారు.. అలాంటి యువత ఇప్పుడు వ్యసనాల బారిన పడుతున్నారని అన్నారు. క్రీడల్లో తెలంగాణ ప్రపంచంతోనే పోటీ పడేలా క్రీడా పాలసీ ని తీసుకు వస్తున్నామని స్పష్టం చేశారు. క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించడానికి పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో క్రీడా పాలసీ ఉంటుందన్నారు. క్రీడలతో పాటు వివిధ రంగాల్లో విజయవంతమైన వారితో బోర్డు ఏర్పాటు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో పరిమితమైన పాత్ర పోషిస్తుందన్నారు. 1956లో జరిగిన ఒలంపిక్స్ లో నాలుగో స్థానం సాధించిన ఫుట్‌బాల్ జట్టులో హైదరాబాద్ కు చెందిన వారు 9 మంది ఉన్నారని, అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మ ణ్, రవికాంత్ రెడ్డి, సిరాజ్, నిక్కత్ జరీన్, దీప్తి లాంటి అనేక మంది క్రీడాకారులు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. సిరాజ్, నిక్కత్ జరీన్‌కు గ్రూప్ వన్ ఉద్యోగంతో పాటు హైదరాబాద్‌లో ఇంటి స్థలం ఇచ్చి ప్రోత్సహించామన్నారు. పారా ఒలంపిక్స్‌లో రాణించిన దీప్తికి కోటి రూపాయల నగదు బహుమతితో పాటు ఇంటి స్థలం ఇచ్చామని, చదువులోనే కాదు క్రీడల్లో రాణించినా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుందనే సందేశం ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల క్రీడా మైదానాలు ఫంక్షన్‌హాల్స్‌గా మారిపోయాయని, సన్బర్న్‌లాంటి ఈవెంట్స్‌కు వేదికగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశానికి ఒలంపిక్స్ లో ఒక్క గోల్డ్ మెడల్ రాకపోవడం దేశానికే అవమానం కాదా అని ప్రశ్నించారు. ఒలంపిక్స్‌లో దేశానికి 71వ స్థానం రావడం అందరూ ఆలోచించాల్సిన విషయమని అన్నారు. దక్షిణకొరియా లో ఒక్క స్పోర్ట్స్ యూనివర్సిటీ కి 16 బంగారు పతకాలు వచ్చాయి.. ఒక్క అమ్మాయికి 3 పతకాలు గెలుచుకుంది అని తెలియజేశారు. క్రీడలకు తెలంగాణను వేదిక చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని ఇందులో భాగంగానే విజన్ డాక్యుమెంట్ 2047 లో స్పోర్ట్స్ పాలసీకి ఒక ఛాప్టర్ కేటాయించామన్నారు. నేషనల్ గేమ్స్, కామన్వెల్త్‌గేమ్స్, వరల్డ్ మిలటరీ గేమ్స్‌ను నిర్వహించిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందన్నారు. వచ్చే ఒలంపిక్స్ నిర్వహణకు సిద్ధమని మనం ప్రకటించాం.. కాని అందులో ఒక్క పతకం కూడా రాకపోతే మన మొహంఎక్కడ పెట్టుకుంటాం.గంజాయి, డ్రగ్స్ తీసుకునే వారు ఎంతటి పెద్దవారైనా ఈగల్ ఫోర్స్ వదిలిపెట్టదన్నారు. గంజాయి, డ్రగ్స్ తీసుకోవాలంటే భయం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2026లో ఖేల్ ఇండియా నిర్వహణకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామని తెలిపారు. అంతేకాకుండ ఒలంపిక్స్‌లో రెండు విభాగాల నిర్వహణకు సిద్ధమని కేంద్రానికి తెలిపామన్నారు. క్రీడలకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షం లో ప్రముఖ క్రీడాకారులు గగన్ నారంగ్, అభినవ్ బింద్రా, పలు స్పోర్ట్స్ అకాడమీలు పలు ఒప్పందాలు చేసుకున్నాయి. వివిధ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు సిఎం నగదు బహుమతి అందజేశారు.

## బిజెపికి 150 మించవు
(మొదటి పేజీ తరువాయి)

దింపేస్తారని సిఎం ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని ఓడించేందుకు,ఆయనను కుర్చీ నుంచి దింపేందుకు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ శ్రేణులన్నీ పోరాడతాయన్నారు. రెండు నెలల క్రితం ఆర్ఎస్ఎస్, సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ 75 ఏళ్ల నిండిన వారు కుర్చీ వదలాలని సూచించినప్పటికీ మోదీ తన ప్రధాని సీటును వదులుకునేందుకు సిద్ధంగా లేరని, అద్వాని, మురళీ మనోహర్ జోషికి వర్తించే నిబంధనలు మోదీకి వర్తించవా అని సిఎం ప్రశ్నించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే కుల గణన చేపడుతామని రాహుల్ గాంధీ హామీనిచ్చారని, ఆ హామీ మేరకే తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టి, దేశానికి తెలంగాణ మోడల్ ఇచ్చామని సిఎం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని పదే పదే బిజెపి నాయకులు ప్రశ్నిస్తున్నారని, ఈ దేశం కోసం గాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగాలు చేశారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# యూరియాపై తప్పుడు లెక్కలు
(మొదటి పేజీ తరువాయి)

మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఉ. రేవంత్ రెడ్డి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకు లేఖలు కూడా రాశారన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలో కూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బ తీయడమేనని మంత్రి లేఖలో పేర్కొన్నారు., జులై నెల వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల లేఖలో కోరారు.

# అక్రమ ప్రాజెక్టులు
(మొదటి పేజీ తరువాయి)

గాలి మాటలేనని వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

**కేంద్ర బిజెపితో పొత్తు ఉందని లోకేష్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే కుదరదు**

పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై ఎపిమంత్రి లోకేష్ వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టు. అక్రమమని, కేంద్ర బిజెపితో టిడిపి పొత్తు ఉందని లోకేష్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇది సరైందికాదని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశమని, పొత్తు ఉంది కదా అని మాట్లాడితే కుదురదన్నారు.

**కాళేశ్వరం నివేదిక పై 4వతేదీన మంత్రివర్గంలో చర్చ :**

కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలకు సంబంధించి 650 పేజీల తో కూడిన జ్యుడిషియల్ కమిషన్ నివేదిక అందిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం కమిషన్ రిపోర్ట్ అధ్యయన కమిటీతో సమావేశం కానున్నట్లు ఆయనవెల్లడించారు. 4వ తేదీన సోమవారం జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలను ఈ సమావేశంలో చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

# అనుమతించండి
(మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. పిటిషనర్ న్యాయవాది శ్రీకాంత్‌రెడ్డి వాదిస్తూ.. పరీక్ష రుసుము పిటిషనర్ చెల్లించారని, అనారోగ్య కారణంగా కాలేజీకి హాజరు కాకపోవడంతో మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించినప్పటికీ దానిని పరిగణలోకి తీసుకోలేదని చెప్పారు. వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. హాజరీ 65 శాతం లేదని, 49.33 శాతమే ఉందంటూ సర్క్యులర్ జారీ చేశారన్నారు. వాదనల తర్వాత హైకోర్టు.. కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇండ్ల నిర్మాణానికి కేంద్రంపై ఆధారపడలేదు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇండ్ల నిర్మాణానికి తాము కేంద్ర ప్రభుత్వంపైన ఆధారపడలేదని, కేంద్రం అనేక నిబంధనలతో కొర్రీలు పెడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒక్కో ఇంటికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.52 లక్షలను కేంద్రం ఇస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షలు వరకు ఇస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తనను కలిసిన కొందరు జర్నలిస్టులతో ఆయన శనివారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళల'పై పుస్తకావిష్కరణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిఎ, డిప్యూటీ తహశీల్దార్ డాక్టర్ పైళ్ల నవీన్ రెడ్డి రచించిన తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళలు,సాహిత్యం ఐదవ ఎడిషన్‌ను మంత్రి పొంగులేటి శనివారం ఆవిష్కరించారు.



## ట్రంప్ కు మోదీ భయపడుతుండు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/రంగారెడ్డి:అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్రమోదీ భయ పడుతున్నాడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మొయినాబాద్ మండల కేంద్రంలో జరిగిన సిపిఐ రంగారెడ్డి జిల్లా మహాసభలో జరిగిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ భారతదేశ ఎకానమీ బ్యాడ్ ఎకానమీ అన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దానికి దీటుగా సమాధానం చెప్పే స్థితిలో మన ప్రధాని నరేంద్ర మోదీ లేడని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

**సిఎం రమేష్ వ్యాఖ్యలపై కెసిఆర్ మాట్లాడాలి :** బిజెపిలో బిఆర్‌ఎస్ పార్టీ విలీనం చేస్తామన్న విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సిఎం రమేష్ చేసిన వ్యాఖ్యలపై బిఆర్‌ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్పష్టం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు అన్నారు. బ్రిటిష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం 10 గంటలకు పెంచడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కొన్ని అమలు చేయడం జరుగుతుందని, మిగతా వాటిని కూడా అమలు చేయాలని ఆయన గుర్తు చేశారు.అదేవిధంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులతో పాటు ఇతర బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు.

**కేంద్రాన్ని బిజెపి నాయకులు ఒప్పించాలి**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినప్పటికీ సుప్రీంకోర్టులో పక్కన పెట్టించిన బిసి బిల్లును కేంద్ర ప్రభుత్వంను రాష్ట్ర బిజెపి నాయకులు ఒప్పించాలని కూనంనేని సాంబశివరావు తెలిపారు. బిసి రిజర్వేషన్లలో ముస్లింలకు పది శాతం ఇచ్చారని చెబుతున్నారని, హిందువుల మాదిరిగానే ముస్లింలలోనూ వెనుకబడిన కుటుంబాలు ఉన్నాయని గుర్తు చేశారు.

**ఆపరేషన్ కగార్‌లో తెలంగాణ పోలీసులు :** దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను కాల్చివేస్తున్న కేంద్ర బలగాలకు తెలంగాణ రాష్ట్ర పోలీసుల సహకారం అందించడానికి ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. పాక్ ఉగ్రవాదులతో పోరాడి పిఒటి ని స్వాధీనం చేసుకోవాల్సిన కేంద్రప్రభుత్వం ఆ విషయాన్ని పక్కన పెట్టి, దేశానికి సంబంధించిన మావోయిస్టులను మాత్రం గడువుపెట్టి చంపేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్ ఖమ్మం పరిసర ప్రాంతాలలో తెలంగాణ పోలీసులు పాల్గొంటున్నారని,అట్టి ఆపరేషన్‌లో తెలంగాణ పోలీసులు పాల్గొనకుండా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చూడాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు మారగోని ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.






## ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యంపై దాడే!

### ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్

ప్రజాపక్షం/ సంగారెడ్డి : బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎన్‌ఆర్‌ఐ)లో భారీ ఎత్తున అమాయకుల ఓట్లను తొలగిస్తుందని ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ విధమైన చర్యలకు పూనుకోవడం శోచనీయమని ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ విమర్శించారు. జనహిత పాదయాత్రలో భాగంగా సంగుపేటలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీహార్‌లో ఈ ఏడాది ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో సుమారు 65 లక్షల మంది అమాయకుల ఓట్లను తొలగించారని ఆమె తెలిపారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమీషన్ బిజెపి కనుసన్నల్లో నడుచుకుంటుదని ఆమె ఆరోపించారు. కేవలం ఎన్నికల కమీషనే కాకుండా సిబిఐ,ఇడి, లాంటి సంస్థలను బిజెపి తన చెప్పు చేతుల్లో పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుందని విమర్శించారు. అయితే తమ నేత రాహుల్ గాంధీ దీనిని అడ్డుకుంటున్నారని, అమాయకులకు అండగా నిలుస్తున్నారని, తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చేలా బిహార్‌లో మిగితా పార్టీలతో కలసి ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో తీసుకువచ్చిన 42 శాతం బిసి రిజర్వేషన్లను దేశవ్యాప్తంగా తీసుకురావాలన్నదే తమ అధినేత రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు.

**పథకాలను ప్రచారం చేస్తేనే ఎన్నికల్లో అనుకూల ఫలితాలు**

పథకాలను ప్రచారం చేస్తేనే ఎన్నికల్లో అనుకూల ఫలితాలు వస్తాయని, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో గ్రూపులుంటేనే మంచిదని పోటీతత్వం పెరుగుతుందని అయితే అవి తమ పరిధిని దాటొద్దని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సంగుపేటలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా పార్టీలో గ్రూపులను అందరూ వ్యతిరేకిస్తారని తాను అలా కాదని గ్రూపులున్న అవి పార్టీకి నష్టం చేయకుండా నడుచుకుంటే అది పార్టీకి లాభం చేకూరుస్తుందన్నారు. గత పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో తెలంగాణను పూర్తిగా నాశనం చేశారని మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారని విమర్శించారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లోను తమ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అందుకని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థు లు విజయఢంకా మోగించేలా కార్యకర్తలు మరింత కష్టపడాలని ఆయన సూచించారు.

**పథకాలు అమలు చేయడమే కాదు.. విస్తృతంగా ప్రచారం చేసుకోవాలి : మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అయితే వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని అపుడే మనం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని సాధించగలుగుతామని మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా అన్నారు. ఇటీవలే తీసుకువచ్చిన 42 శాతం బిసి రిజర్వేషన్లను విస్తృతంగా ప్రచారం చేయాలని ఈ విషయమై జిల్లా స్థాయిలో ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని ఆయన సూచించారు.

**జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రమదానం**

జనహిత కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు ఉదయం ఎడున్నర గంటల నుంచి జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల్లో ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు కాసేపు ముచ్చటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో ఎం.పి సురేష్ కుమార్ శెట్కర్, ఎమ్మెల్యే, సంజీవ రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి, కాట శ్రీనివాస్ గౌడ్, త్రిషా రాజనర్సింహ, చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఉజ్వలరెడ్డి, ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, పిసిసి ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.




## ఎర్రజెండానే పేదలకు అండ... ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి

### సిపిఐ జాతీయసమితి సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/కల్వకుర్తి : దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న అసమానతలు, కార్మికులపైదాడులు, రైతులకు అన్యాయం, విద్యార్థుల, నిరుద్యోగుల భవితవ్యం వంటి సమస్యల క్రమంలో ప్రజలపక్షంలో నిలబడి ఉద్యమించే పార్టీలు ప్రజాపక్షశక్తులు మరింత బలపడాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు చాడవెంకట్‌రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ(సిపిఐ) జిల్లా మూడో మహాసభలు శనివారం స్థానిక శుభంగార్డెన్‌లో కొనసాగిన రెండోరోజు ప్రతినిధుల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతినిధుల సభకు వార్ల వెంకటయ్య, బి.శ్రీనివాస్, వెంకటమ్మలు అధ్యక్షవర్గంగా నడిపించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రజెండా పేదలకు అండ, దేశంలో సొత్తు కొందరిదే, శ్రమవందలకోట్లమందిదే. ఈ అన్యాయాన్ని ఎదుర్కోవాలంటే ప్రజలందరూ పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. వామపక్ష శక్తులుగా, సామాజిక న్యాయంకోసం నిరంతరం పోరాటం సాగించే పార్టీగా సిపిఐ ముందడుగు వేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ్మ ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాప్రజల వ్యవసాయానికి జీవనాధారమైన మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని శ్రీశైలం ప్రాజెక్టుబ్యాక్ వాటర్‌పైన చేపట్టాలని డిమాండ్ చేస్తూ కొల్లాపూర్ నుండి మహబూబ్‌నగర్ వరకు పాదయాత్రచేసి కలెక్టర్ కార్యాలయం ముట్టడించడం ధర్నాలు, రాస్తారోకోలు అప్పటి జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాలలో అనేక దపాలుగా ఆందోళనలు నిర్వహించి, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని సాధించడంలో ముందువరుసలో నిలిచిన పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. వంద సంవత్సరాలుగా ప్రజలకోసం అనేక బలిదానాలు త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సభ్యులు హెచ్.ఆనంద్, ఫయాజ్, కేశవులుగౌడ్, డిహెచ్‌పిఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కొమ్ము భరత్, జిల్లాకార్యవర్గసభ్యులు నర్సింహ్మా, విజయుడు, ఇందిరమ్మ, ఈర్ల చంద్రమౌళి, పరుషరాములు, డాక్టర్ శ్రీనివాసు లు పాల్గొన్నారు.

### సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శిగా ఎస్ఎండి ఫయాజ్

ప్రజాపక్షం/కల్వకుర్తి: సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శిగా ఎస్ఎండి ఫయాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కల్వకుర్తి పట్టణంలోని శుభంఫంక్షన్ హాలులో ఆగస్టు 1,2తేదిలలో నిర్వహించిన జిల్లా తృతీయ మహాసభలలో నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని 30మంది సభ్యులతో ఎన్నుకున్నారు.



## ముస్లిం రిజర్వేషన్‌లను అంగీకరించేదిలేదు

### కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ముస్లిం రిజర్వేషన్‌లను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేదిలేదని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బిజెపిపై బట్టకాల్చి మీద వేయాలని చూస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద శనివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని, కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇది బిసి రిజర్వేషన్ల కోసం కాదని, ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లను 32 శాతానికి కుదించారన్నారు. ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కెసిఆర్ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. 20 శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు. ఎస్‌సి, ఎస్‌టిలలో జనాభా పెరిగిందని, బిసిల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారన్నారు. 42 శాతం పూర్తిగా బిసిలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కింద ముస్లిం, క్రిస్టియన్‌లకు రిజర్వేషన్‌లు కల్పిస్తోందని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అన్ని బిసి సంఘాలు పోరాటం చేయాలని కోరారు. బిసిల హక్కులను కాంగ్రెస్ కాలరాస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు.



ఈటల రాజేందర్ మాట్లాడుతూ రిజర్వేషన్‌ల విషయంలో తమిళనాడు రాష్ట్రం ఆదర్శమన్నారు. ఆ రాష్ట్రం 21 మంది ఐఎఎస్ అధికారులతో కమిషన్ ఏర్పాటు చేసి, ఆర్టికల్ 340 ప్రకారం కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ 1952 ప్రకారం లెక్కలు తీసి, షెడ్యూల్9లో చేర్చిందన్నారు.

## కడుపులో కత్తులు పెట్టుకొని.. బిసి రిజర్వేషన్‌లు అడ్డుకునేందుకు రాజకీయాలు!

### బిజెపి నేతల ధర్నాపై మండిపడిన మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్: కడుపులో కత్తులు పెట్టుకొని బిసి రిజర్వేషన్‌లను అడ్డుకునేందుకు బిజెపి నేతలు రాష్ట్రంలో రాజకీయాలు చేస్తున్నారని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బిసి రిజర్వేషన్‌లపై ధర్నా చేస్తున్న బిజెపి నేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రపతి ఆమోదం పొందాల్సిన ఈ బిల్లుపై బిజెపి కడుపులో కత్తులు పెట్టుకొని అమలును అడ్డుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. 'ముస్లింల పేరు చెప్పి రిజర్వేషన్‌లు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బిజెపి నేతలు ధర్నా చేయాల్సింది హైదరాబాద్‌లో కాదు ఢిల్లీలో అన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రధాన మంత్రికి ఒక్క మాట చెప్పితే తెలంగాణలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి కులగణన, బిసిలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టంచేసి గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతి పంపేవరకు తాము మా చిత్తశుద్ధి నిరూపించుకున్నామన్నారు.



ఈనెల 4న అందరం ఢిల్లీ వెళ్లుదాం రండి, మన రిజర్వేషన్లు సాధించుకుందామన్నారు. బిసి సంఘాలు, మేధావులు కదలాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉండి బిజెపి నేతలు ధర్నా చేస్తే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు సాధించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. శాసన సభలో బిసిలకు రిజర్వేషన్లపై మద్దతు ఇచ్చి ముస్లింల పేరుమీద అడ్డుకుంటున్నారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పక్కా బిసిల వ్యతిరేకి అని మంత్రి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తప్పులు ఉంటే సవరించి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమోదింపజేయాలన్నారు. బలహీన వర్గా ల వ్యతిరేకి రాంచందర్ రావు చేసే ధర్నాలు మీరు పాల్గొని, మీరు కూడా బలహీన వర్గాల వ్యతిరేకిగా మారుతున్నారని విమర్శించారు.

## రిజర్వేషన్ల అమలుకు కేంద్రమే అడ్డు


### మంత్రి శ్రీధర్ బాబు సంచలన వ్యాఖ్యలు

ప్రజాపక్షం/ముత్తారం: రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్న కేంద్ర ప్రభుత్వం మాత్రం అడ్డుపడుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శనివారం మంథని నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. వెనుక బడిన తరగతుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తుందని కొనియాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబిసి లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపించినప్పటికీ ఇప్పటి వరకు ఆమోదం లభించలేదని అన్నారు. అదేవిధంగా బిసి రిజర్వేషన్ కోసం కేబినెట్ లో నిర్ణయించి ఆర్డినెన్స్ తెచ్చినప్పటికీ ఇంకా గవర్నర్ ఆమోదం లభించలేదని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఏపీ, ఎమ్మెల్యేలకు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ బిల్లును 9వ షెడ్యూల్ లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బిసి బిల్లు, ఆర్డినెన్స్ ఆమోదంలో జాప్యానికి నిరసనగా 5వతేది,6వ.7 తేదీలలో ముఖ్యమంత్రి అధ్యక్షతన దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించామని, గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ అప్పుడు బిసి రిజర్వేషన్ చట్టం చేయకుండా ఇవాళ మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయ లబ్ధి కోసమే నిందలు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారికి బిసి రిజర్వేషన్‌ల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో జరిగే ధర్నాలో పాల్గొని బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం తమతో కలిసి రావాలని డిమాండ్ చేశారు. తాడిచెర్ల గ్రామానికి చెందిన దళిత సోదరుడు దండు రమేష్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ ఆర్ ఈ జి ఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా నియమించడం దళితులకు దక్కిన గౌరవం అన్నారు.ఈ సందర్భంగా దండు రమేష్ ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.



## చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడిన డాక్టర్ నమ్రత

ప్రజాపక్షం/హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో విస్తుపోయే విషయాలు మరిన్ని వెలుగులోకి వస్తున్నాయి. గోపాలపురం పోలీస్‌ల కస్టడీ విచారణలో డాక్టర్ నమ్రత చేసిన నేరాలు బయటపడుతున్నాయి. సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించినట్టు తెలిసింది. పేదింటి ఆడబిడ్డలకు ఉచితంగా ఫెర్టిలిటీ సేవలు అందిస్తామని మాయమాటలు చెప్పి నమ్మించినట్టు సమాచారం. పేద మహిళల ఆర్థిక అవసరాలను గుర్తించి, ఏజెంట్ ద్వారా వారిని ట్రాప్‌లో పడేసేవారని విచారణలో తేలినట్టు సమాచారం. ఒక ప్లాన్ ప్రకారం డెలివరీ సమయానికి ఏజెంట్లు దగ్గరుండి వారిని విశాఖపట్నం, విజయవాడ కేంద్రంగా డెలివరీలు చేయించేవారని తెలిసింది. డెలివరీ అయిన తర్వాత నవజాత శిశువును డబ్బులకు ఇచ్చేవారని, అలా నవజాత శిశువులను తీసుకొచ్చి చైల్డ్ ట్రాఫికింగ్ పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణ లో తెలింది. అక్రమంగా సంపాదించిన డబ్బులతో హైదరాబాద్, ఎపిలో ఫామ్ హౌస్, భవన సముదాయాలు నమ్రత కొనుగోలు చేసిందని, మియాపూర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, యూసఫ్ గూడతో పాటు చాలా ప్రాంతాల్లో భవనాలు కొనుగోలు చేసిందని విచారణ లో బయట పడింది.




### శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము
గూడెం గ్రామము, దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.

Rc.No.SSSD/132/2025, e-ప్రొక్యూర్మెంట్, సీల్డ్ టెండర్ & బహిరంగ వేలం ప్రకటన తేది: 02.08.2025

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము ఆవరణములో **తేది: 01.09.2025 నుండి తేది: 14.06.2026 వరకు** 9 నెలల 14రోజులు **వివిధ లైసెన్స్ హక్కుల కొరకై** టెండర్ దారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలముల ద్వారా టెండర్లు కోరనైనది. ఆసక్తి గల వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పూర్తి వివరములకు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. ఇతర వివరములకు కొరకై దేవస్థాన కార్యాలయము నందు కాని సెల్ నెం. 7893052502 ద్వారా కాని సంప్రదించగలరు.

DIPR R.O. No. : 5927-PP/CL/ADVT/1/2025-26, Date: 02-08-2025 సం/- కార్యనిర్వహణాధికారి



### వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయము, హైదరాబాద్.

నెం.వ్య.మా.క./హై/Tenders/2025-26, టెండర్ నోటీసు తేది: 02.08.2025

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ పరిధిలో గల మహబూబ్ మాన్షన్ కాంప్లెక్స్, మలక్‌పేట్ మార్కెట్ కార్యాలయమునకు సంబంధించి అవసరమగు ప్రింటింగ్ అఫ్ తక్ పట్టి పుస్తకములు సరఫరా చేయుట మరియు మలక్ పేట్ మార్కెట్ యార్డు నందు వాహనముల ట్రాఫిక్ నియంత్రణ కొరకు ఒక సంవత్సరం కాలం పాటు కాంట్రాక్టు కొరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్రమ సంఖ్య | టెండరు పేరు | ధరావత్తు (EMD) రూ. | టెండరు షెడ్యూలు సరఫరా చేయు తేది మరియు సమయము | టెండరు షెడ్యూలు దాఖలు చేయు చివరి తేది మరియు సమయము | టెండరు తెరువబడు తేది మరియు సమయము |
|---|---|---|---|---|---|
| 1 | ప్రింటింగ్ అఫ్ తక్ పట్టి పుస్తకములు, సరఫరా చేయుటకు | Rs. 20,000/- | 06-08-2025 నుండి 07-08-2025 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4.00గంటల వరకు | 12-08-2025 రోజున మధ్యాహ్నం 12.00 గంటల వరకు | 12-08-2025 రోజున మధ్యాహ్నం 1.00 గంటలకు |
| 2 | మలక్‌పేట్ మార్కెట్ యార్డు నందు వాహనముల ట్రాఫిక్ నియంత్రణ కొరకు ఒక సంవత్సరం కాలం పాటు కాంట్రాక్టు కొరకు | Rs. 50,000/- | | | |

నిబంధనలు:-
1. టెండర్ షెడ్యూలు కొరకు లిఖితపూర్వ దరఖాస్తుతో పాటు, టెండర్ ఫారం ధర రూ. 3,000/- (రూపాయలు మూడు వేయిలు మాత్రమే) మరియు టెండర్ వారిగా ధరావత్తు (EMD) బాపతు రూపాయలను డి.డి.ల రూపేనా Selection Grade Secretary, Agril. Market Committee, Hyderabad గారి పేరున తీసిన వారికి మాత్రమే టెండర్ షెడ్యూల్ ఫారం ఇవ్వబడును. DD ల పై టెండర్ వేయువారి పేరున మాత్రమే ఉండవలెను, చెక్కులను తిరస్కరించబడును.
2. GST రిజిస్ట్రేషన్ మరియు ల్యాబ్ లేబర్ లైసెన్స్ ఉన్న కాంట్రాక్టర్లు లిఖితపూర్వక ధరఖాస్తుతో టెండర్ ఫారం పొందగలరు.
3. ఏదేని ప్రభుత్వ సంస్థలో కనీసం (03) సంవత్సరములు పని చేసిన అనుభవం వుండాలి (అట్టి ధృవీకరణ పత్రములు జతచేయవలెను).

అసంపూర్తిగా మరియు అభ్యంతరములు ఉన్న టెండర్లు గాని చెక్కులు సమర్పించిన టెండర్ గాని, టెండర్‌దారు పేరున DD లేని వాటిని తిరస్కరించబడును మరియు ఎలాంటి కారణము చూపకుండా టెండర్ రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు. ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు దినములలో ఉదయము 10.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ నందు సంప్రదించవచ్చును.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్.

DIPR R.O. No. : 5946-PP/CL/ADVT/1/2025-26, Date: 02-08-2025


## ప్రజలకు సౌకర్యంగా ఒకేచోట సేవలు

### కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజలకు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించేందుకు వీలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించడంతో (రీఆర్గనైజేషన్) పాటు కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో హైదరాబాద్ జిల్లాలో రెండు, రంగారెడ్డి జిల్లాలో మూడు, మేడ్చల్ జిల్లాలో మూడు చోట్ల, సంగారెడ్డిలోని పఠాన్‌చెరుతో కలిపి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. నూతన కార్యాలయాల కోసం ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్‌ల నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులకు సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండ గా వాటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయని, మిగిలినవి అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలని యోచిస్తున్నామని వివరించారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకే చోట ఇంటిగ్రేటెడ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పని తీరు మెరుగుపర్చడంతో పాటు పర్యవేక్షణ సులభమవుతుందని, అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండడంతో పాటు దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందని మంత్రి పొంగులేటి అన్నారు.



మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మిస్తున్నామన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఒక రోల్ మోడల్ గా ఉంటుందని చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డితో చర్చించి, బిల్డింగ్ నమూనాలకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరితగతిన ఈ భవనానికి శంకుస్థాపన చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

## రాజీవ్ యువ వికాసం లోన్లు ఇవ్వాలి

**ప్రజాపక్షం/డిండి:** రాజీవ్ యువ వికాసం లోన్లు నిరుద్యోగ యువతకు ఇవ్వాలని ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గోనకల్ గ్రామంలో ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని అన్నారు. అనంతరం ఎఐవైఎఫ్ గోనకల్ నూతన కమిటి అధ్యక్షులుగా నూనె భూపాల్, కార్యదర్శిగా కాంపల్లి శ్రీకాంత్, కోశాధికారి కర్ణాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి మహేష్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి లవన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు విన య్‌కుమార్, ప్రవీణ్, అరవింద్, రాజు, శంకర్, వెంకటయ్య పాల్గొన్నారు.



## త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని ములకలపల్లి గ్రామంలో లబ్ధిదారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హనుమంతరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి గృహప్రవేశాలు జరిగేలా చూడాలని కోరారు. తుర్కపల్లి మండలం చోక్ల తండా, బబ్లు నాయక్ తండా, రుస్తాపూర్ గ్రామాల్లో శనివారం జిల్లా పంచాయతీ అధికారి సునంద పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నర్సరీలు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, హౌసింగ్ ఏఈ నరేష్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.






## పేదలకు మెరుగైన వైద్యసేవలు

### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పోరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 10 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో 26 కోట్ల రూపాయలతో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే 3కోట్ల 66 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సిటి స్కాన్ యంత్రం అందుబాటులోకి వస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటిసారిగా కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక డాక్టర్,ముగ్గురు స్టాఫ్ నర్సులతో కలిపి జాతీయ రాబిస్ కంట్రోల్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడంతో పాటు పట్టుకతో బరువు తక్కువ ఉన్న పిల్లలందరికి రిహబిటేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో జరుగుతున్నపనుల్లో వేగం పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యానారాయణ, డిసిహెచ్ఎస్ ఎస్.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ దశరధ, కమిషనర్ రమాదేవి, వైద్యులు అభిరామ్, వైష్ణవి, నర్సింహా పాల్గొన్నారు.

## ముగిసిన ఆపరేషన్ ముస్కాన్

### జిల్లాలో 143 మంది బాల కార్మికులు గుర్తింపు

### 65 కేసులు నమోదు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** వెట్టిచాకిరికి, నిరాదరణకు గురైన బాలబాలికలను, తప్పిపోయిన బాలలను గుర్తించి సంరక్షించడంలో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే అపరేషన్ స్మైల్, జూలై నెలలో నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ ముగిసింది. జిల్లాలో 143 మంది బాలకార్మికులను గుర్తించి 65 కేసులను అధికారులు నమోదు చేశారు. వెట్టిచాకిరికి గురైన బాలలను తల్లిదండ్రులకు, సంరక్షకులకు క్షేమంగా అధికారులు అప్పగించారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 76 మంది బాలలుండగా, వీరిలో 7బాలికలు, 69 మంది బాలురు ఉన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 67 మంది బాలలుండగా, 50 మంది బాలురు, 17 మంది బాలికలున్నారు. ఆపరేషన్ ముస్కాన్ ముగిసిన బాలల రక్షణ కోసం నిరంతరం తనిఖీలు చేస్తామని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా తెలిపారు. బాలలను వెట్టిచాకిరికి గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. బాలల వికాసానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆపరేషన్ ముస్కాన్‌లో పాల్గొన్న తన పోలీస్ సిబ్బందిని ఆయన శనివారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు లున్నారు.

## సిమెంట్ అక్రమ విక్రయదారుల అరెస్టు



**ప్రజాపక్షం/చివ్వెంల:** సిమెంట్ అక్రమంగా విక్రయిస్తున్న నలుగురు నిందితులను చివ్వెంల పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎ1 నిందితుడు నర్సాపురానికి చెందిన కాంపాటి రాజు, ఎ2 నిందితుడు సూర్యాపేట మండలం ఇమాంపేటకు పోలోజు ఉపేంద్రచారి, ఎ3 నిందితుడు మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన ఎస్‌కె బాబుతో కలిసి కుట్రపురీతంగా వివిధ కంపెనీలకు చెందిన సిమెంట్ బస్తాలను సేకరించి నకిలీ సిమెంట్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నకిలీ బ్రాండ్ సంచులను సరఫరా చేసే బండి వెంకటరమణ నార్కెట్‌పల్లి ఎ4 నిందితుడని తెలిపారు. అతని నుండి అల్ట్రాటెక్, రామ్‌కో, కెసిపి, ఎంసిఎల్ వంటి అసలు బ్రాండ్ పోలిన నకిలీ ఖాళీ సంచులను తీసుకుని అందులో సిమెంట్ నింపి విక్రయిస్తున్నట్లు తెలిపారు. దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఓ గోదాములో నిల్వ ఉంచిన 940 బస్తాల సిమెంట్, 30 ఖాళీ బ్రాండ్ సంచులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ మహేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కీచక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

### మహిళా కానిస్టేబుల్‌పై వేధింపులు

### జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసిన బాధితురాలు

### డిఐజి కార్యాలయానికి అటాచ్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** తుంగతుర్తి సర్కిల్ పరిధిలోని నూతన్‌కల్ ఎస్ఐ వాస ప్రవీణ్‌కుమార్ అదే స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ మహిళ కానిస్టేబుల్‌ను గతకొన్ని రోజులుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో సదరు మహిళ కానిస్టేబుల్ జిల్లా ఎస్‌పి కె.నర్సింహాకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ గతంలో పనిచేసిన ప్రతిచోట మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు అనేక అరోపణలు ఉన్నాయి. గతంలో గద్వాలలో ఎస్ఐగా పనిచేసినప్పుడు, నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన సమయంలో వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళలను లైంగిక వేధింపులకు గురిచేశారనే అరోపణలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో పనిచేసిన సమయంలో కొంతమంది మహిళల ఫోన్ నెంబర్లు తీసుకుని అసభ్యకరమైన మెసేజ్‌లు పంపినట్లు గత ఫిబ్రవరి నెలలో జరిగిన శ్రీలింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర సమయంలో నూతనంగా విధుల్లో చేరిన ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లతో చట్టపట్టాలు వేసుకుని తిరిగినట్లు అరోపణలు లేకపోలేదు. గతంలో తోటి మహిళ ఉద్యోగులను అనేక మార్లు లైంగిక వేధింపులకు గురిచేయడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నూతన్‌కల్ పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు గురైన మహిళ కానిస్టేబుల్ జిల్లాకు చెందిన మంత్రికి దగ్గర బంధువు కావడంతో ఈ విషయం ఆయన వద్దకు కూడా చేరినట్లు సమాచారం. దీనిపై జిల్లా ఎస్‌పి కె.నర్సింహా సమగ్ర విచారణ చేశారు. ఇది వాస్తవం అని తెలడంతో డిఐజి కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఇయన స్థానంలో నూతన ఎస్ఐగా నాగరాజుకు పోస్టింగ్ ఇచ్చారు.

## సాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

### 8 గేట్లు మూసివేత, 18 గేట్ల ద్వారా నీటి విడుదల



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి వచ్చే వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది గత కొన్ని రోజులుగా ప్రాజెక్ట్ అధికారులు వరద ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యగా ప్రాజెక్టు నీటిమట్టాన్ని గరిష్ట మట్టం 590 అడుగులకు ఐదు అడుగుల తక్కువ అంటే 585 అడుగులను కొనసాగిస్తూ నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం శ్రీశైలం నుంచి వరద ప్రవాహం తగ్గడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవాలనే ఉద్దేశంతో 8 గేట్లు మూసివేసి 18 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి 136656 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గే ట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు శనివారం సాయంత్రానికి 585.30 అడుగులతో ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు గాను 298.3005 టిఎంసీలుగా ఉన్నది. కుడి, ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తూ, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. అయితే నాగార్జునసాగర్ కు శ్రీశైలం నుంచి ఇన్ ఫ్లో గా 210499 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతూ ఉండగా 183786 క్యూసెక్కుల నీరు మొత్తం అవుట్ ఫ్లోగా దిగువకు విడుదలవుతుంది.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

### డాక్టర్లు, సిబ్బంది విధులకు గైర్హాజరుపై కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆగ్రహం

### ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఒపి రిజిస్టర్, డాక్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్, బయోమెట్రిక్ రిజిస్టర్‌ను ఆయన క్షుణంగా పరిశీలించారు. ఈ తనిఖీలో పలువురు డాక్టర్లు, సిబ్బంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. మరి కొంతమంది సమయపాలన కూడా పాటించడంలేదని తనిఖీలో తేలడంతో ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అనతరం ఆయన ఆసుపత్రిలోని జనరల్ వార్డు, జనరల్ మెడిషన్ వార్డు, సర్జరి వార్డు, ఎమర్జెన్సీవార్డు, సైక్రాటిక్ వార్డులను కలియతిరిగి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర చికిత్స విభాగంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రోగితో ఆయన మాట్లాడి ఆరోగ్యం ఎలా ఉందని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించి ఎన్ని యూనిట్ల రక్తం నిల్వ ఉన్నదో ఆరా తీశారు. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన సువిన్ అనే బాలుడు ఆసుపత్రికి రాగా అతనితో కూడా కలెక్టర్ మాట్లాడి ఎందుకు ఆసుపత్రికి వచ్చావ్ అని అడిగారు. అందుకు బదులుగా జ్వరం కారణంగా చికిత్స కోసం వచ్చినట్లు చెప్పారు. ఆసుపత్రి సూపరిండెంట్ శ్రావణ్‌కుమార్‌ను ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో పనిచేస్తు విధులకు హాజరుకాని వారి వివరాలతో కూడిన నివేదికను తనకు అందించాలని అదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌తో ఆర్‌ఎంవో విజయ్‌కుమార్, డాక్టర్లు విజయానంద్, లక్ష్మ ణ్ లు ఉన్నారు.

### నీట్ పిజి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

### పరీక్షకు హాజరుకానున్న 230 మంది అభ్యర్థులు

(నేడు) ఆదివారం నిర్వహించనున్న నీట్ పిజి ప్రవేశ పరీక్షకు అవసరమైన అన్నిఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో 230 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానుండగా సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో, కోదాడలోని సన ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సూర్యాపేటలో 180 మంది, కోదాడలో 50 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష జరగనుంది. ఉదయం 7 గంటల నుండి 8:30 లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలలోకి అనుమతి ఉంటుందని అధికారులు సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పిజి ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షకు హాజరుకావాలని కోరారు. ఒరిజినల్ అడ్మిట్‌కార్డు (ప్రింటెడ్ ఫోటోతో కూడినది), ఒరిజనల్ ఫోటో ఐడెంటికార్డు (ఓటర్‌ఐడి పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసన్స్, ఆధార్ లేదా ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన ఫోటో గుర్తింపుకార్డు) లలో ఎదైన ఒకటి తప్పని సరిగా తీసుకరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జయలత, తహసిల్దార్ కృష్ణయ్య ఉన్నారు.





## అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

### ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు, శనివారం మండల కేంద్రంలో శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన 12814 పాత కార్డులు ఉండగా కొత్తగా 1207 మందికి కొత్త రేషన్ కార్డులను జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ లతో కలసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అనేక రకాల హామీలు ఇచ్చి అభివృద్ధి ఏమి చేసింది లేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డులను అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగ రెడ్డి, హాలియ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, గడ్డం సాగర్ రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్ , మండల పార్టీ అధ్యక్షులు క్రిష్ణ నాయక్ , వల్లభ రెడ్డి , లాలూ నాయక్ ,రాఘవ రెడ్డి , పాండు నాయక్, ముని నాయక్ పాల్గొన్నారు.

## పోలీస్ వాలీబాల్ క్రీడామైదానం ప్రారంభం

### సిబ్బందితో కలిసి ఉల్లాసంగా వాలీబాల్ ఆడిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నందు నూతనంగా నిర్మించిన వాలీబాల్ కోర్టును శనివారం జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ శ్రమిస్తున్నారని అన్నారు. నిరంతరం విధుల నిర్వహణ వల్ల సిబ్బంది వత్తిడికి లోనవద్దన్నారు. పోలీస్ సిబ్బంది శారీరక దృడత్వం ముఖ్యమని అన్నారు. సమయం ఉన్నప్పుడు వ్యాయమం చేయడం ఆటలు ఆడటం మంచిదన్నారు. క్రీడలు శారీరక దృడత్వానికి మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. జిల్లా ఎస్‌పి కె.నర్సింహా మాట్లాడుతూ క్రీడల వల్ల ఒత్తిడిని దూరం చేయడం, ఫిటెనెస్ కాపాడటం కోసం సిబ్బంది సంక్షేమంలో భాగంగా క్రీడామైదానం నిర్మించినట్లు తెలిపారు. సిబ్బంది క్రీడామైదానాలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి లు ఉల్లాసంగా వాలీబాల్ ఆడి సిబ్బందిలో ఉత్సాహం నింపారు. కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన ఆర్ఎస్ఐలనపు, సిబ్బందిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి, సిఐల వెంకటయ్య, రాజశేఖర్, ఆర్ఐ నారాయణరాజు, ఆర్ఎస్ఐ సురేష్, రాజశేఖర్, కె.అశోక్, ఎం. అశోక్, మహేష్, సాయిరాం, అన్వర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ లు, ఎఆర్ సిబ్బంది ఉన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పెంచాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/హాలియా(పెద్దవూర):** ఇందిరమ్మ ఇండ్ల పురోగతి తక్కువగా ఉన్న మండలాలలో ఈ నెల 10 నాటికి 50 పురోగతి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.శనివారం ఆమె పెద్దఊర ఎంపిడివో కార్యాలయంలో నాగార్జున సాగర్ నియోజక వర్గ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పై ఎంపిడివోలు,ఏఈ, ఏపిఎం, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.ఇల్లు మంజూరై నిర్మించుకోనెందుకు ఆర్థిక స్థితి లేని లబ్ధిదారుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణ సహాయం అందించి ఇల్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఏ పి ఎం లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పూర్తిగా అర్హులే ఉండాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. అంతేకాక పాఠశాల ఆవరణ, వంటగది, స్టొర్ రూమ్ ను, పరిసరాలను, పరిశీలించారు. విద్యార్థులకు సరైన భోజనం విద్యను అందించాలన్నారు. ఆ తర్వాత ప్రాథమిక వైద్య ఆరోగ కేంద్రాన్ని సందర్శించి ఓపి రిజిస్టర్, ఏఎన్ సి, మందు ల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్ ఉన్నారు.

## ముందుకు సాగని డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదర్ కాంట్రాక్టర్

### పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు మండల కేంద్రాన్ని అన్ని రకాల అంగులతో అభివృద్ధి చేయడానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 25 కోట్ల నిధులతోమునుగోడు చండూరు,మునుగోడుచౌటుప్పల్ ఈ రెండు రోడ్లను 66 ఫీట్ల వెడల్పుతో డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఫుట్ పాత్ నిర్మించేందుకు సంవత్సరం కిందట శంకుస్థాపన చేశారు. అధికారులు రోడ్డును మధ్య నుంచి అటు 33ఫీట్లు, ఇటు 33 ఫీట్లలతో మార్కింగ్ చేశారు. మార్క్ చేసిన వరకు మునుగోడు చండూరు,మునుగోడు చౌటుప్పల్ రోడ్‌లో ఉన్న దుకాణ యజమానులు స్వచ్ఛందంగా మార్కింగ్ చేసిన వరకు సొంత ఖర్చులతో తొలగించారు. గత ఐదు నెలల క్రితం పనులు ప్రారంభించిన సదర్ కాంట్రాక్టర్ మునుగోడుచౌటుప్పల్ రోడ్ లో ఇరువైపులా కొంతమేరకు మురికి కాలువలు నిర్మించి మునుగోడు చండూరు రోడ్‌లో ఇరువైపులా పనులను మొదలుపెట్టి మురికి కాలువలతో పాటు రెండు వైపులా కొత్త రోడ్డు ను వేసేందుకు ఇరువైపులా పాత మట్టిని తవ్వి ఒకవైపు మాత్రమే కొంతమేరకు కంకర పరిచారు మరోవైపు రోడ్డుని నిర్మించకుండా మూడు ఫీట్ల లోతులో వదిలివేయడంతో అటుగా వెళుతున్న ప్రయాణికులు ఇబ్బందులకు గురై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత శాఖ అధికారులు నిద్రమత్తుని వీడి రోడ్డు నిర్మాణ పనులు త్వరతగతిన చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మునుగోడు పట్టణ ప్రజలు కోరుతున్నారు.


## ద్విచక్ర వాహనాల అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** నకిలీ తాళం చెవిలతో మోటర్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ డివిజన్ డిఎస్‌పి కె శివరాం రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జర్గుతున్న బైక్ దొంగతనాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘాతో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో యన్నారం గ్రామానికి చెందిన మట్టిపల్లి శ్రీకాంత్ , మట్టిపల్లి వెంకన్న, మట్టిపల్లి అనిల్ నిందితులను అదుపులోకి తీసుకుని విచారించి 7 కేసుల్లో సుమారు 16 లక్షల విలువ గల 12 మోటర్ సైకిళ్లను స్వాదీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. బైక్‌లు పోయినవని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ ఐ క్రాంతి కుమార్ తన సిబ్బందితో పట్టణంలోని అమ్మనబోలు రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా సరియైన పత్రాలు లేనటువంటి బైక్ , అనుమానస్పదంగా తిరుగుతుండడంతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించడంతో జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు ఒపుకున్నారు. ఇట్టి దొంగతనాలు తెలంగాణ లోనే కాకుండ ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా చేయడంతో వీరిపై కేసులు రెండు రాష్ట్రాలలో నమోదైనట్లు ఆయన వివరించారు. నార్కట్‌పల్లి సిఐ కె నాగరాజు ఆధ్వర్యంలో పట్టుబడి చేసిన నార్కట్‌పల్లి ఎస్ ఐ డి క్రాంతికుమార్‌ను డిఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి రాము, జవహర్, రమేష్, సత్యనారాయణ, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, శ్రీకృష్ణ , శివ, తిరుమల్ లను జిల్లా ఎస్పీ అభినందించి నగదు ప్రకటించినట్లు తెలిపారు.

## వన మహోత్సవంలో జిల్లా జడ్జి



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** అల్లంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లంపూర్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో శనివారం నాడు జోగులాంబ గద్వాల జిల్లా జడ్జి ప్రేమలత వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్ తేజ ఆధ్వర్యంలో విరివిరిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కాళీ ప్రదేశాల్లోని మొక్కలు నాటేందుకు సీనియర్ న్యాయవాదులు ఫారెస్ట్ అధికారులు సిబ్బంది విద్యాశాఖ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## విపక్షాలను బెదిరించడం నా తండ్రి నైజం కాదు : రోహన్ జైట్లీ

**న్యూఢిల్లీ:** సాగు చట్టాలకు వ్యతిరేకంగా నిరసన చేపడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్ర మాజీ మంత్రి దివంగత అరుణ్ జైట్లీ తనను బెదిరించినట్లు రాహుల్ గాంధీ అన్నారు. శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ వార్షిక లీగల్ సదస్సులో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీన్ని అరుణ్ జైట్లీ కుమారుడు రోహన్ జైట్లీ ఖండించారు. రోహన్ తన ఆన్‌లైన్ అకౌంట్‌లో స్పందిస్తూ... సాగు చట్టాలను 2020లో ప్రవేశపెట్టారని, కానీ రైతు ఉద్యమం వల్ల ఆ మూడు చట్టాలను రద్దు చేసినట్లు గుర్తు చేశారు. తన తండ్రి అరుణ్ జైట్లీ... ఆ చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి ముందే మరణించినట్లు రోహన్ తెలిపారు. విపక్షాలను బెదిరించడం తన తండ్రి నైజం కాదని, ఆయన బహిరంగ చర్చలకు ఇష్టపడేవారన్నారు. తన తండ్రి 2019లో చనిపోయారని, కానీ సాగు చట్టాలను 2020లో ప్రవేశపెట్టారన్నారు. దివంగత నేతల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# భారత్‌తో పెట్టుకుంటే... పాతాళంలో ఉన్నా వదలిపెట్టం






- వారణాసి బహిరంగసభలో ప్రధాని మోదీ
- ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ రుద్రరూపాన్ని యావత్ ప్రపంచం చూసింది
- కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ సిందూర్‌ను 'ఒక తమాషా' అనడం సిగ్గుచేటని ధ్వజం

**వారణాసి :** ఉగ్రవాదంపై భారతదేశం తీసుకున్న దృఢ సంకల్ప చర్యను వివరించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శివుని రుద్రరూపాన్ని (ఉగ్ర రూపం) ప్రస్తావిస్తూ ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి దేశ బలాన్ని ప్రదర్శించిందన్నారు. భారతదేశంపై దాడిచేయడానికి సాహసం చేసే ఎవరినైనా పాతాళలోకంలో ఉన్నాకూడా వదిలిపెట్టబోమని ఆపరేషన్ సిందూర్ ద్వారా రుజువుచేశామని ప్రధాని మోదీ ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. 'పహల్గామ్ ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన 26మంది పట్ల నా హృదయం దు:ఖంతో నిండిపోయింది' అని ప్రధాని మోదీ తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో శనివారం నాడు జరిగిన ఒక బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 'నా కూతుళ్ల సిందూర్‌కు ప్రతీకారం తీర్చుకుంటానని నేను చేసిన వాగ్దానం మహాదేవ్ ఆశీర్వాదంతో నెరవేరింది' అని మోదీ చెప్పారు.'ఆపరేషన్ విజయాన్ని మహాదేవ్ పాదాలకు అంకితం చేస్తున్నాను' అని ప్రకటించారు. 140 కోట్ల మంది దేశవాసుల ఐక్యత ఆపరేషన సిందూర్‌కు బలంగా మారిందని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. శివుడు అంటే సంక్షేమం కానీ ఉగ్రవాదం వికృతరూపం తీసుకున్నప్పుడు మహాదేవ్ తన 'రుద్రరూప్'ను తీసుకుంటాడు అని , ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ విషయంలో 'యావత్ ప్రపంచం భారతదేశం రుద్రరూపానికి సాక్షిగా నిలుచున్నది' అని ప్రధానమంత్రి చెప్పారు. ప్రతిపక్షాల ధోరణిపై మోదీ విమర్శలతో విరుచుకుపడుతూ ఒక పక్క దేశ ం ఆపరేషన్ సిందూర్ సక్సెస్ సంబరాలు చేసుకుంటుంటే, మరోపక్క మన దేశానికి చెందిన కొంతమంది దీని వల్ల ఇబ్బంది పడ్డారని నిప్పులు చెరిగారు. పాకిస్థాన్ లోపల ఉగ్రవాద స్థావరాలను భారత్ కూల్చివేసిందనే నిజాన్ని కాంగ్రెస్ సహా దాని మిత్రపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఆయన చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ మీకు గర్వకారణంగా లేదా ? పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను కూల్చివేయడం మీరు గర్వపడటం లేదా ?' అని ప్రధాని మోదీ బహిరంగసభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు. మన డ్రోన్లు, క్షిపణులు ఉగ్రవాద శిబిరాలపై ఏవిధంగా ఖచ్చితంగా దాడిచేసి, శిథిలాలుగా మార్చి ఉగ్రవాద హెడ్‌క్వార్టర్స్‌ను ఏవిధంగా తగ్గించాయనే దృశ్యాలను మీరు చూసే ఉంటారని ప్రధాని అన్నారు. చాలా వరకు పాకిస్థాన్ వైమానిక స్థావరాలు నేటికీ ఇంకా ఐసియులోనే ఉన్నట్లుగా ఆ దేశ పరిస్థితి కనిపిస్తోందన్నారు.దిగ్భ్రాంతికరమైన విషయమమేమిటంటే కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ కూడా పాకిస్థాన్‌పై దాడి విషయాన్ని తట్టుకోలేకపోతున్నాయని ప్రధాని మోదీ విస్మయం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ సాయుధ దళాల పరాక్రమాన్ని పదేపదే అవమానిస్తోందని, ఆపరేషన్‌సిందూర్‌ను తమాషా (వినోదం) అని కూడా అభివర్ణిస్తోందని, కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ సిందూర్‌ను ఒక తమాషా అనడం సిగ్గుచేటు అని ప్రధాని మోదీ నిప్పులుచెరిగారు. 'సిందూర్ ఎప్పుడైనా ఒక జోక్ అవుతుందా ? .వారు మన సోదరీమణుల పవిత్రచిహ్నామైన సిందూర్‌ను, సైనికుల పరాక్రమాన్ని అవమానించడానికి ధైర్యం చేశారు' అని మోదీ మండిపడ్డారు. సైనిక దాడుల సమయాన్ని ప్రశ్నించిన సమాజ్‌వాదీ పార్టీపై కూడా మోదీ విరుచుకుపడ్డారు. 'వారి నాయకులలో ఒకరు పార్లమెంట్‌లో పహల్గామ్ దాడి నిందితులను ఇప్పుడు ఎందుకు చంపారు? అని అడిగారు. నేను సమాజ్‌వాదీ పార్టీని పిలిచి ఇప్పుడే దాడి చేయలా? లేదా తర్వాత దాడి చేయాలా? అని వారిని అడగాలా? మనం వేచివుండి ఉగ్రవాదులు తప్పించుకుని పోయేలా చూడాలా?' అని మోదీ అడిగారు. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి స్వదేశీ రక్షణ సామర్థ్యాలను ప్రదర్శించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధానమంత్రి వరుసగా మూడవ సారి లోక్‌సభ సభ్యుడిగా ఉన్న వారణాసి పర్యటన సందర్భంగా రూ.2,000కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేయడం సహా దేశవ్యాప్తంగా 9.70 కోట్లమ ందికి పైగా ఉన్న అర్హులైన రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడతగారూ.20,500 కోట్ల నగదును పంపిణీ చేశారు.

# రాజ్యాంగ తిరుగుబాటు అనుమతించం

- దేశాన్ని ఒకే గొంతు... ఒకే పార్టీ... ఒకే సిద్ధాంతంగా మారనివ్వం
- మోదీ పాలనపై కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ సింఘ్వీ ధ్వజం



**న్యూఢిల్లీ :** భారతదేశం ఒకే గొంతు, ఒకే పార్టీ, ఒకే సిద్ధాంతం కలిగిన దేశంగా మారనివ్వమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ సింఘ్వీ స్పష్టం చేశారు. బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఆధిపత్యంగా, దాని బహుళత్వాన్ని ధ్రువణతగా మారుస్తోందని విమర్శించా రు. 'రాజ్యాంగ సవాళ్లుదక్పథాలు మార్గా లు' అనే అంశంపై ఆదివారం ఇక్కడ ఒక రోజు పాటు జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగి స్తూ, 'రాజ్యాంగం కేవలం విస్మరించడమే కాదు... దానిని ఆధిపత్య సాధనంగా వక్రీకరిస్తున్నారు. మనకు ప్రజాస్వామ్య శ్వాస, స్వేచ్ఛ, సోదరభావం, సమానత్వం, న్యాయం ఇచ్చిన వి లువలు ఇప్పుడు గాలిలో కలిసిపోతున్నాయి' అని సింఘ్వీ అన్నారు. 'ట్యాంకులు పేలినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం చనిపోదు. సంస్థలు కూలిపోయినప్పుడు కూడా చనిపోతుంది. రాజ్యాంగ కార్యకర్తలు పక్షపాత కీలుబొమ్మలుగా మారినప్ప డు మీడియా అద్దం కాకుండా మెగాఫోన్‌గా మారినప్పుడు, కోర్టులు ఆలస్యం చేయడం ప్రారంభించినప్పుడు వారు తిరస్కరించడానికి ధైర్యం చేయరు. అసమ్మతి దేశద్రోహం, నిరసన రెచ్చగొట్టడం, ప్రతి ప్రశ్నను 'జాతి వ్యతిరేకం' అని ముద్ర వేసినప్పుడు ప్రజాస్వామ్యం వెంటిలేటర్‌పై ఉందని మీకు తెలుస్తుంది' అని ఆయన అన్నారు. భారతదేశాన్ని ప్ర జాస్వామ్యంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని, అది రూపంలోనే కాదు, స్ఫూర్తిలోనూ ఉందని, ఆ రాజ్యాంగం ఆత్మను రక్షించడానికి, సంరక్షించడానికి, అవసరమైతే పునరుద్ధరించడానికి కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావాలని తెలిపారు. సవాలు కేవలం చెడు పాలన లేదా పేలవమైన ఆర్థిక వ్యవస్థ కాదని అన్నారు. కానీ ఇది 'లోతైన, మరింత కృత్రిమ సంక్షోభం... ఎన్నికల మెజారిటీ ముసుగులో రాజ్యాంగ విలువలను ఉద్దేశపూర్వకంగా కూల్చివేయడం' అని ఆయన అన్నారు. 'రాజ్యాంగంలో తనిఖీలు, సమతుల్యత ఉంది. వాటి స్థానంలో తనిఖీలు, బుల్‌డోజర్‌లు వస్తున్నాయి. రాజ్యాంగంలో హక్కులు, పరిష్కారాలు ఉన్నాయి. అవి దాడులు, వాక్చాతుర్యాన్ని అందిస్తాయి. ఇది స్వేచ్ఛ గురించి మాట్లాడుతుంది. అవి విధేయతను ఆయుధంగా మారుస్తాయి. ఇది పాలన కాదు... ఇది గణతంత్రాన్ని మంటల్లో పెట్టడం' అని ఆయన పేర్కొన్నారు. ముందుకు సాగే మార్గంలో ఇది రాజకీయ ధైర్యం, రాజ్యాంగ స్పష్టతతో ప్రారంభం కావాలని ఆయన అన్నారు. 'మనం పార్లమెంటును కాగితపు బిల్లులకు స్థలంగా కాకుండా నిజమైన చర్చల వేదికగా తిరిగి పొందాలి. మన న్యాయవ్యవస్థ నుంచి కేవలం వివరణ మాత్రమే కాకుండా జోక్యం కూడా కోరాలి. మనం మీడియాను నియంత్రించడం ద్వారా కాకుండా భయం, అనుకూలత నుంచి విముక్తి చేయడం ద్వారా రక్షించాలి. అన్నింటికంటే మించి రాజ్యాంగాన్ని సామాన్యుడితో తిరిగి అనుసంధానం చేయాలి' అని ఆయన నొక్కి చెప్పారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి కోహిమా వరకు ప్రతి భారతీయుడు రాజ్యాంగ ప్రవేశిక నాడిని అనుభవించేలా చూసుకోవడం కాంగ్రెస్ విధి అని పేర్కొంటూ, రాజ్యాంగాన్ని రక్షించే పోరాటం చట్టపరమైన పోరాటం మాత్రమే కాదని, అది నైతిక పోరాటం అని ఆయన అన్నారు. 'మనం జాగ్రత్తగా కాకుండా దఢ నిశ్చయంతో పోరాడాల్సిన సమయం ఇది. డ్రాయింగ్ రూమ్‌లలో గుసగుసలతో కాదు... వీధుల్లో గర్జనలతో. ప్రకటనల ద్వారా మాత్రమే కాదు, నిరంతర సత్యాగ్రహం ద్వారా. ఇది విలపించాల్సిన క్షణం కాదు. నాయకత్వం వహించాల్సిన క్షణం. ఈ సంఘటన నుంచి మన సందేశాన్ని బిగ్గరగా, స్పష్టంగా చెప్పనివ్వండి. రాజ్యాంగ తిరుగుబాటు విజయవంతం కావడానికి మేము అనుమతించము' అని సింఘ్వీ తెలిపారు. 'భారతదేశం ఒకే స్వరం, ఒకే పార్టీ, ఒకే భావజాలం కలిగిన దేశంగా మారడానికి మేము అనుమతించము. భారతదేశం మోనోక్రోమ్‌లో ఉన్న పెయింటింగ్ కాదు. ఇది అనేక మిలియన్ల చిత్రాలతో కూడిన కుడ్యచిత్రం. ఒక రంగును చెరిపివేస్తే కాన్వాస్‌కు పగుళ్లు ఏర్పడతాయి' అని అన్నారు. 'మేము రాజ్యాంగాన్ని, దాని వాగ్దానాన్ని నమ్ముతాము. మన ప్రతి శ్వాసతో దానిని రక్షించుకునే సామర్థ్యాన్ని విశ్వసిస్తాము' అని తెలిపారు. 'సంప్రదింపులు లేకుండా పథకాలు ప్రారంభిస్తారు. రాజకీయ పక్షపాతంతో నిధులు నిలిపివేస్తారు. ఎన్నికయిన ప్రభుత్వాలను డబ్బు, బలం, తారుమారు ద్వారా పడగొట్టారు. ఇది సహకార సమాఖ్యవాదం కాదు. ఇది ప్రచారంలో చుట్టబడిన బలవంతపు సమాఖ్యవాదం' అని సింఘ్వీ మండిపడ్డారు. ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా, ప్రతిపక్షంగా కాకుండా అసలు దార్శనికతగా ప్రజలు ఉద్యమించాలని సింఘ్వీ పిలుపునిచ్చారు. 'చర్చలను గెలవడానికి మాత్రమే కాదు. దేశాన్ని తిరిగి గెలవడానికి మాట్లాడదాం. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు. రాజ్యాంగ విముక్తి కోసం మనం పని చేద్దాం. చరిత్ర చరిత్రలో చెప్పుకుందాం. రాజ్యాంగం దాని కన్నీళ్లను తుడిచింది కాంగ్రెస్. ప్రజాస్వామ్యం రక్తం కారినప్పుడు దాని గాయాలకు కట్టుకట్టింది కాంగ్రెస్. గణతంత్రం వణికినప్పుడు కాంగ్రెస్ ఒక శిలలా దృఢంగా నిలబడింది' అని అన్నారు.

## హాస్టల్ టెర్రస్ పైనుంచి దూకి.. ఐఐటి బాంబే విద్యార్థి ఆత్మహత్య

**మంబయి :** మహారాష్ట్రలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటి బాంబేకు చెందిన విద్యార్థి హాస్టల్ టెర్రస్ పైనుంచి దూకి మరణించాడు. ఈ నేపథ్యంలో అతడి ఆత్మహత్యపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో మరో విద్యార్థి అక్కడ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఢిల్లీకి చెందిన 26 ఏళ్ల రోహిత్ సిన్హా ఐఐటి బాంబేలో చదువుతున్నాడు. మెటలర్జికల్ ఇంజినీరింగ్, మెటీరియల్స్ సైన్స్ కోర్సు నాల్గవ సంవత్సరంలో ఉన్నాడు. కాగా, శనివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో హాస్టల్ భవనం టెర్రస్‌పై నుంచి రోహిత్ సిన్హా కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. అయితే అతడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోహిత్ ఆత్మహత్యపై కేసు నమోదు చేశారు. అతడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. అయితే రోహిత్ టెర్రస్‌పై నుంచి కిందకు దూకిన సమయంలో ఆ హాస్టల్‌లో ఉంటున్న మరో విద్యార్థి ఫోన్‌లో మాట్లాడుతూ అక్కడ ఉన్నట్లు తమకు తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఓటరు జాబితాలో నా పేరు ఏదీ?
### ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్



**పాట్నా :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఎన్నికల కమిషన్ ప్రచురించిన 'ముసాయిదా ఓటర్ల జాబితా'లో తన పేరు లేదని ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ శనివారం పేర్కొన్నారు. అయి తే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సీనియర్ బిజెపి నాయకుడు సామ్రాట్ చౌదరి ఆ వాదనను తోసిపుచ్చారు. యాదవ్ వివరాలు, ఫోటోతో పాటు, చూడగలిగే ముసాయిదా ఓటర్ల జాబితా స్క్రీన్‌షాట్‌ను పంచుకున్నారు. మీడియా సమావేశంలో తేజస్వీ తన ఫోన్‌ను పెద్ద స్క్రీన్‌కు కనెక్ట్ చేసి, సొంత ఇపిఐసి నంబర్‌ను శోధించడానికి ప్రయత్నించగా, అది 'రికార్డులు కనుగొనబడలేదు' అనే జవాబిచ్చింది. 'ఇప్పుడు చూడండి! నేను ఓటరుగా నమోదు కాలేదు. ఇది నన్ను ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుని చేస్తుంది. బహుశా, నన్ను పౌరుడిగా పరిగణించకపోవడంతో ఈ సభలో ఉండే హక్కును కోల్పోవచ్చు' అని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న యాదవ్, గణన ఫారమ్‌తో తన స్థానానికి వచ్చిన బూత్‌స్థాయి అధికారి తనకు ఎటువంటి రసీదు ఇవ్వలేదని కూడా పేర్కొన్నారు. తాను సంతకం చేసి, సరిగ్గా నింపిన ఫారమ్‌ను అందజేస్తున్నప్పుడు ఫోటో తీశాను అని అన్నారు. శనివారం ఇసి అన్ని రాజకీయ పార్టీలకు అందించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రింటవుట్‌ను చూడమని కొంతమంది జర్నలిస్టులు తేజస్వీకి సూచించారు. దీనికి ఆయన స్పందిస్తూ ఆన్‌లైన్ పద్ధతి అంటే ఎక్కువ మందికి అందుబాటులో ఉంటుందని, బిహార్ వెలుపల నివసించే ఎవరైనా ఓటర్ల జాబితాలో తన పేరును చూసుకోవడానికి వస్తారని మీరు ఆశిస్తారా? అని ప్రశ్నించారు. నా ఉద్దేశం ఏమిటంటే మనలాంటి వ్యక్తులు రిసీవర్ ఎండ్‌లో ఉన్నప్పుడు, సామాన్య ప్రజల గురించి ఏమి చెప్పాలన్నారు. ఒక ఐఎఎస్ అధికారి దంపతుల పేర్లు తప్పిపోయినట్లు తాను విన్నానన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా పాలక ఎన్‌డిఎకు ఇసి సహాయం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ రానున్న ఎన్నికలను బహిష్కరిస్తానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముసాయిదా జాబితాలో బిజెపి నాయకుడి పేరు తప్పిపోయిందో లేదో చూడాలనుకుంటున్నాను వ్యాఖ్యానించారు.

**అంతా అబద్ధం : ఇసి**

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) తర్వాత విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో తన పేరు లేదని, తాను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలని ఆర్‌జెడి అగ్రనేత తేజస్వియాదవ్ ప్రశ్నించడం పై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఓటర్ల జాబితాలో తన పేరు లేదని తేజస్వీ యాదవ్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అబద్ధమని, జాబితాలో ఆయన పే రు ఉన్నదని తెలిపింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో సీరియల్ నెంబర్ 416 తో తేజస్వీయాదవ్ ఓటు ఉన్నదని ఇసి వెల్లడించింది. కాబట్టి ఓటర్ల జాబితాలో తన పేరు లేదని తేజస్వియాదవ్ చేస్తున్న ప్రచారమంతా శుద్ధ అబద్ధమని పేర్కొంది.

## బాత్రూమ్‌లో జారిపడ్డ జార్ఖండ్ మంత్రి..
### బ్రెయిన్ ఇంజూరీతో ఆస్పత్రిలో చేరిక.. పరిస్థితి విషమం

**రాంచి :** జార్ఖండ్ మంత్రి ఒకరు ప్రమాదవశాత్తూ బాత్రూమ్‌లో జారి పడ్డా రు. దీంతో బ్రెయిన్ ఇంజూరీతో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం మంత్రి పరిస్థితి విషమంగా ఉంది. జార్ఖండ్ విద్యాశాఖ మంత్రి రాందాస్ సోరెన్ శనివా రం ఉదయం తన ఇంట్లోని బాత్రూమ్‌లో జారిపడ్డారు. దీంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు మంత్రిని హుటాహుటిన జంషెడ్‌పూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంత్రి మెదడులో రక్తం గట్టకట్టినట్లు వైద్యు లు గుర్తించారు. ఈ మేరకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన్ని ఢిల్లీ ఆస్పత్రికి తరలించినట్లు జార్ఖండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ తెలిపారు. మరోవై పు రాందాస్ సోరెన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని బిజెపి సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. సోరెన్‌ను హె లికాప్టర్ ద్వారా ఢిల్లీ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఢిల్లీ అపోలో డైరెక్టర్ తో మాట్లాడినట్లు తెలిపారు. మంత్రి ఆస్పత్రికి చేరుకున్న వెంటనే చికిత్స ప్రారంభిస్తారని జంషెడ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

# 'ఆ అణుబాంబును' వెంటనే పేల్చాలి

- రాహుల్‌గాంధీ ఆరోపణలపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కౌంటర్
- పేలేటప్పుడు హాని కలగకుండా చూసుకోవాలని ఎద్దేవా
- పాట్నాలో జరిగిన ఒక 'మీడియా హౌస్ కార్యక్రమం'లో బిజెపి మాజీ చీఫ్ రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగం



**పాట్నా :** త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పట్టుసాధించేందుకు పదునైన విమర్శనాస్త్రాలతో కేంద్రంలోని అధికార బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు అక్కడ ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. బిహార్‌లో ఓట్ల చౌర్యానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్న ఎన్నికల సంఘం (ఇసి), భారతీయ జనతాపార్టీ అవకతవకలను రుజువుచేసే 'ఆటంబాంబు సాక్ష్యం' తన వద్ద ఉందని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ఆరోపించడంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. రాహుల్‌గాంధీ ఆయన వద్ద ఉన్న అణు బాంబును పేల్చనివ్వండి అని ఎద్దేవా చేశారు. 'భారత ఎన్నికల సంఘం గురించి మేం సొంతంగాదర్యాప్తు జరిపి ఆటంబాంబు లాంటి ఆధారాలను గుర్తించాం. ఆ ఆటంబాంబు పేలినరోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి అవకాశమే ఉండదు' అని ఇటీవల లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తొలగింపు విషయమై తీవ్రస్థాయిలో ఆరోసణలు చేసిన విషయం తెలిసిందే. రాహుల్ ఆరోపణలకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బిహార్ నుంచే కౌంటర్ ఇచ్చారు. ఆదివారం నాడు బిహార్ రాజధాని పాట్నాలో ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. బిహార్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను 'ఒక క్రాస్‌రోడ్డు' అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఒక మార్గం (ఎన్‌డిఏ కింద ) బిహార్ ప్రగతికి దారితీయనుందని, మరొక మార్గం (ఇండియా కూటమి కింద) బిహార్‌ను పాత చట్ట విరుద్ధత , కుల కలహాల యుగానికి తిరిగి వెనక్కి తీసుకెళుతుందని రక్షణ మంత్రి విపులీకరించారు. 'రాహుల్‌గాంధీ ఆయన వద్ద అణుబాంబు ఉందని చెబుతున్నారు. అయితే ఆయన దానిని వెంటనే పేల్చాలి. ఆయనకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా తప్పించుకునేలా చూసుకోవాలి' అని రాజ్‌నాథ్ సింగ్ ఎద్దేవాచేశారు. రాహుల్ గత వాక్చాతుర్యాన్ని కూడా దేశం గుర్తుచేసుకుంటున్నదని అన్నారు. 'పార్లమెంట్‌కు భూకంపం వస్తుంది' అని గతంలో రాహుల్‌గాంధీ బెదిరించాడు. కానీ ఆయన ఎప్పుడైతే మాట్లాడారో అప్పుడు అది తడిసపనిగా (తుస్సుమని) మారిపోయిందన్నారు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఒక సంస్థగా తిరుగులేని స మగ్రతకు ఖ్యాతిని కలిగి ఉందని మంత్రి రాజ్‌నా థ్ సింగ్ కితాబిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిపేందుకు ఎన్నికల సంఘం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. 'రాజ్యాంగ విరుద్ధమైన సంస్థ అని ప్రకటనలు చేయడం ప్రతిపక్షనేత హోదాలో ఉన్న ఆయన నైజం అని బిజెపి నేత రాజ్‌నాథ్ సింగ్ రాహుల్‌గాంధీని తూర్పారబట్టారు. 1975లో ఎమర్జెన్సీ పీరియెడ్‌లో ప్రజాస్వామ్యాన్ని హత్యచేయడానికి ప్రయత్నించిన తన సొంతపార్టీ కూడా ఇదే బా టలో నడిచిందని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీకి రాజ్‌నాథ్‌సింగ్ పరోక్షంగా గుర్తుచేశారు. 20ఏళ్ల పాలనలో బిహార్ రాష్ట్రాన్ని ప్రగతిపథం దిశగా మలుపుతిప్పిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల భాగస్వామి నితీశ్‌కుమార్‌ను ఆయన ప్రశంసల్లో ముంచెత్తారు. 11సంవత్సరాల క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిహార్ రాష్ట్ర ప్రగతి ఊపందుకుందన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం బిహార్‌కు రూ.9లక్షల కోట్ల సహాయాన్ని అందించిందన్నారు. అంతకుముందు బిహార్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వం ఒక దశాబ్దకాలంలో కేవలం రూ.2క్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని ఎత్తిచూపారు.

## మోదీ, యోగి పేరు చెప్పాలని ఒత్తిడి
### మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ ఆరోపణ



**న్యూఢిల్లీ:** మాలెగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా బయటపడిన మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 'బిజెపి సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ సహా పలువురి పేర్లు చెప్పాలని నాపై ఒత్తిడి తెచ్చారు. నన్ను హింసించారు. నన్ను ఆసుపత్రిలో అక్రమంగా నిర్బంధించారు. నేను గుజరాత్‌లో నివసించడం వల్ల మోదీ పేరు కూడా చెప్పించాలని చూశారు. నేను అబద్ధాలు చెప్పాలని వారు ప్రయత్నించారు. అవి అబద్ధాలు కావడంతో నేను ఎవరి పేరు చెప్పలేదు' అని ప్రజ్ఞ శనివారం మీడియాకు చెప్పారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు విచారణ బందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన సంగతి తెలిసిందే. మోహన్ భగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని ఆయన తెలిపారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని ఎన్ఐఏ కోర్టు తెలిపింది. 'ఈ పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్... మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు' అని తీర్పు వెలువరించింది.

# రష్యా, అమెరికా మధ్య ఉక్రేన్ మంట



**మాస్కో:** ఉక్రేన్‌తో పది రోజుల్లో కాల్పుల విరమణ ఒప్పందానికి సిద్ధం కావాలని పుతిన్‌ను బెదిరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా అంతర్జాతీయ జలాల్లోని కీలకమైన ప్రాంతాలలో రెండు అణు జలాంతర్గాములు మోహరించాలని నౌకా దళానికి ఆదేశించారు. ఉక్రేన్ విషయంలో తన మధ్యవర్తిత్వానికి తలొగ్గడంలేదని, పుతిన్ తన మాట లెక్కచేయడంలేదని ఆగ్రహించిన ట్రంప్ రష్యాను రోజుకో రీతిన బ్లాక్‌మెయిల చేస్తున్నారు. ఉక్రేన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలని కోరుతూ జులై 28 వ తేదీన ట్రంప్ ఏకపక్షంగా విధించిన 10–12 రోజుల గడువుపై రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్ తీవ్రంగా స్పందించారు. సోవియట్ యూనియన్ కాలంనాటి అణువ్యవస్థలు మహాసముద్రాలలో తమకు చాలా ఉన్నాయని వ్యాఖ్యానించడంతో ట్రంప్ ఆగ్రహించారు. రష్యాతో ట్రంప్ హెచ్చరికల గేమ్ ఆడుతున్నారని మెద్వెదేవ్ విమర్శించారు. "ట్రంప్ రెండు విషయాలు గుర్తుపెట్టుకోవాలి, రష్యా అంటే ఇజ్రాయెల్‌లో, ఇరాన్ దేశమో కాదు, ఇక రెండో విషయం ఆయన చేసే ప్రతి హెచ్చరికా ఒక బెదిరింపే, ఇది యుద్ధానికి చేరువ చేసే బెదిరింపే, అది రష్యా–ఉక్రేన్ మధ్య కాదు, ఆయన సొంత దేశంతో యుద్ధం దిశగా బెదిరింపు'' అని మెద్వెదేవ్ అనడంతో ట్రంప్ ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నారు. మెద్వెదేవ్ ఏ వ్యాఖ్యలు చేయడంవల్ల ఇంత తీవ్ర నిర్ణయం తీసుకున్నరన్న విషయంపై ట్రంప్ తనకు తానుగా పూర్తి వివరణ ఇవ్వలేదు. మెద్వెదేవ్ చాలా రెచ్చగొట్టే ప్రకటనలు చేశారని మాత్రం ట్రంప్ అన్నారు. ఈ జలాంతర్గాములను రోజువారీ సాధారణ పర్యవేక్షణకోసం మోహరించారా? లేక ప్రత్యేక కారణాలతో మోహరించారా? అనే అంశంపై కూడా స్పష్టత లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి ఘటనలైనా జరిగే అవకాశం ఉన్నందువల్ల ముందస్తు జాగ్రత్త పాటించాలని నౌకాదళానికి ఆదేశించినట్లు ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. రష్యాకు ఇచ్చిన గడువు వచ్చేవారంతో ముగిసిపోతూ ఉండటంతో ఈ విషయంపై చర్చలు జరిపేందుకు తమ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ రష్యాకు పయనమవుతున్నారని కూడా ట్రంప్ చెప్పారు. ఉక్రేన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం గురించి పుతిన్‌పై ఒత్తిడి చేసేందుకు ఆయన వెళుతున్నారు. ఈసారి కాల్పుల విరమణకోసం చర్చల బల్ల వద్దకు రాకపోతే అతి తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధిస్తామని ట్రంప్ ఇప్పటికే రష్యాకు హెచ్చరిక చేశారు. మొదట ఆయన పుతిన్‌కు ఉక్రేన్ విషయంలో 50 రోజులు గడువు ఇచ్చారు. తర్వాత ఈ గడువును 12 లేదా పది రోజులకు తగ్గించారు.పుతిన్ వైఖరితో తాను విసిగిపోయానని ట్రంప్ ఇటీవల పదే పదే అన్నారు.

**రష్యాపై ఉక్రేన్ డ్రోన్ల దాడి, ముగ్గురు పౌరులు మృతి**

పశ్చిమ రష్యాలో ఉక్రేన్ చేసిన దాడుల్లో ఒక మహిళ సహా ముగ్గురు పౌరులు మరణించారు. శనివారం తెల్లవారకముందుగానే ఈ దాడులు జరిగాయి. రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ఈ విషయం ప్రకటించింది. 12 డ్రోన్లను రష్యా దళాలు ధ్వంసం చేశాయని పేర్కొంది. రష్యాలోని ఎనిమిది ప్రాంతాలలో ఈ దాడులు జరిగాయి. రష్యా ఆక్రమణలో ఉన్న క్రిమియా ద్వీపకల్పంలోనూ ఉక్రేన్ డ్రోన్ల దాడులు చేసింది. సరిహద్దుల్లో ఉన్న రష్యా ప్రాంతం రోస్టోవ్‌పై డ్రోన్ల దాడి జరిగిందని ఆ ప్రాంత గవర్నర్ యూరీ స్లూసార్ చెప్పారు. రష్యా తమపై 53 డ్రోన్లతో దాడి చేసిందనీ, 45 డ్రోన్లను జామర్ల ద్వారా కూల్చివేశామని ఉక్రేన్ ప్రకటించింది. ఖార్కీవ్ ప్రాంతంలో జరిగిన దాడిలో 11 మంది గాయపడినట్లు తెలిపింది.

## కీలక జలాల్లో అణు జలాంతర్గాముల మోహరింపు






## మక్కికి మక్కీ..





కొన్ని సంఘటనలు జనాలకు నవ్వు, బాధితులకు కోపం తెప్పిస్తాయి. భారత రాజధాని న్యూఢిల్లీలో ఇటీవల ఓ కేక్‌పై రాసిన సందేశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన తల్లి పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకోవడానికి ఓ వ్యక్తి బేకరీలో కేక్ ఆర్డర్ చేశాడు. 'హ్యాపీ బర్త్ డే మమ్మీ' అని రాసి, 'కేక్‌పై ఈ సందేశం ఉండేలా చూడండి' అంటూ నోట్ పెట్టాడు. ఆర్డర్ చేసినట్టే కేక్ వచ్చింది. అయితే, దానిని చూసిన అతనికి మూర్ఛ వచ్చినంత పనైంది. కేక్‌పై చక్కగా 'హ్యాపీ బర్త్ డే మమ్మీ' అని రాసి ఉంది. కానీ, కింద భాగంలో 'కేక్‌పై ఈ సందేశం ఉండేలా చూడండి' అంటూ వారికి చేసిన సూచనను కూడా కేక్‌పై కనిపించింది. సోషల్ మీడియాలో అతను ఉంచిన ఈ పోస్ట్‌పై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం విశేషం. కేక్ తయారీదారుల నిర్లక్ష్యాన్ని క్షమించకూడదని కొంత మంది భావిస్తే, మరికొంత మంది కేక్‌కు చెల్లించిన డబ్బు వాపసు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేయాలని సూచించారు. కొంత మంది దీనిని 'మానవ తప్పిదం'గా చూడాలంటే, మరికొందరు 'ఇంగ్లీషు చదవడం రాని వాళ్లు ఈ కేక్‌ను తయారు చేసి ఉండవచ్చు. చూసీచూడనట్టు వెళ్లాలి. అయినా మీకు కేక్ ముఖ్యంగానీ, దానిపై ఏం రాసి ఉందో కాదుకదా? ఎలాగూ కేక్‌ను కట్ చేస్తారు కాబట్టి సమస్య ఉండదు' అంటూ హితవు పలికారు. ఏదిఏమైనా ముద్రా రాక్షసాలు కేవలం వార్తా పత్రికల్లో లేదా పుస్తకాల్లోనే కాదు... కేక్‌లపై కూడా ఉంటాయని ఈ ఘటన రుజువు చేస్తున్నది.

## ఆడడానికి కాదు.. చూడడానికే!




న్యూయార్క్ సిటీలోని ఎంఎల్‌బి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌కు చేరుకున్న బేస్‌బాల్ అందరినీ ఆకట్టుకుంటున్నది. అయితే, ఇది కేవలం చూడడానికి మాత్రమే పరిమితం. ఆడడానికి కాదు. ఎందుకంటే దీని వ్యాసం ఏకంగా 8 అడుగులు. ఇంత భారీ బేస్‌బాల్‌పై 6,750 సంతకాలు ఉన్నాయి. ఇన్ని సంతకాలతో కూడిన బంతిగా ఈ భారీ బేస్‌బాల్ గిన్నిస్ పుస్తకంలోనూ చోటు సంపాదించింది. గత ఏడాది కేంబ్రిడ్జి యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ 2,146 మంది సంతకాలతో కూడిన బంతిని ప్రదర్శించి, గిన్నిస్ రికార్డు నెలకొల్పితే, తాజా బేస్‌బాల్ ఆ రికార్డును బద్దలు కొట్టింది.

## అభిమానుల డిమాండ్..



సాధారణంగా క్రీడాకారుల అభిమానులు వారిని చూసేందుకు ఎగబడతారు. వీలుంటే కరచాలనం చేయడానికి, అవకాశం కుదిరితే సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ, అమెరికా ప్రఖ్యాత స్విమ్మర్ మైఖేల్ ఫెల్ప్స్ అభిమానులు అందుకు భిన్నంగా ప్రవర్తించారు. బాల్టిమోర్ రావెన్స్ అమెరికన్ ఫుట్‌బాల్ (రగ్బీ) జట్టు అంటే ఫెల్ప్ ఇష్టపడతాడు. ఆ జట్టులో అత్యధిక శాతం మంది ఆటగాళ్లకు ఈత రాదు. ఫిట్నెస్ కోసం స్విమ్మింగ్ బాగా ఉపయోగపడుతుందని నమ్మిన మేరీలాండ్‌లోని వందలాది మంది ఫెల్ప్స్ అభిమానులు రోడ్డుమీదకు వచ్చి, ప్రదర్శనలు నిర్వహించారు. బాల్టిమోర్ సభ్యులకు ఈత నేర్పించాలని అతనిని డిమాండ్ చేశారు. ఈ ఫొటోను బాల్టిమోర్ జట్టు కార్నర్‌బ్యాక్ స్పెషలిస్ట్ మార్లొన్ హంఫ్రె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. 23 ఒలింపిక్ పతకాలతో ప్రపంచ రికార్డు సృష్టించిన తిరుగులేని స్విమ్మర్ ఫెల్ప్స్ కూడా అభిమానుల డిమాండ్‌కు సానుకూలంగా స్పందించడం విశేషం. ఈత నేర్పిస్తానని హామీ ఇచ్చి, అభిమానులకు ఊరట కలిగించాడు.

## అరుదైన రికార్డులు..



'పెన్నీ ఫార్తింగ్'లో కెనడాకు చెందిన లిజాన్నే విల్మోట్ రెండు అరుదైన ప్రపంచ రికార్డులు సృష్టించింది. విక్టోరియన్ కాలంనాటి నమూనాలో ఉండే పెద్ద చక్రంతో కూడిన బైసికిల్‌ను నడిపించడాన్ని 'పెన్నీ ఫార్తింగ్'గా పేర్కొంటారు. అత్యంత కష్టమైన ఈ విభాగంలో విల్మోట్ ఒక కిలోమీటర్ దూరాన్ని 52.75 సెకన్లలో చేరి, కొత్త రికార్డు నెలకొల్పింది. ఆ క్రమంలోనే, ఒక దశలో గంటకు 25.92 మైళ్ల వేగాన్ని అందుకొని, మరో రికార్డును సొంతం చేసుకుంది. ఈ రెండు రికార్డులతో గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించింది.

– బిఎస్ఎస్ మైత్రేయి

# జిఎస్‌టి సంస్కరణ ఆవశ్యకత

ప్రజాపక్షం
03-08-2025, ఆదివారం

జిఎస్‌టి 2025 జులై ఆదాయ సంఖ్యలు వెలువడ్డాయి. గత సంవత్సరం ఇదే నెల ఆదాయంతో పోల్చితే అది ఈ నెలలో 7.5 శాతం పెరిగి రూ.1.95 లక్షల కోట్లకు చేరింది. ఇది ప్రభుత్వానికి ఎంతో సంతోషం కలిగించే సమాచారం. కానీ తరచి చూస్తే లోపాలు బయటపడతాయి. దేశ అంతర్గత వినిమయంపై పన్ను వసూళ్ల వృద్ధి తక్కువ స్థాయిలో ఉండగా, దిగుమతులపై వృద్ధి పెరిగింది. రిఫండ్‌లు భారీగా పెరిగాయి, ప్రాంతీయ అసమానతలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. 'ఒకే దేశం–ఒకే పన్ను' ప్రచారార్భాటంతో ఈ 'వస్తువులు–సేవల పన్ను' విధింపును పార్లమెంటు ప్రాంగణం నుంచి 'రెండవ స్వాతంత్రం' అన్నంత అట్టహాసంగా అర్ధరాత్రి ప్రకటించి 8 సంవత్సరాలు అవుతోంది. దీనివల్ల రాష్ట్రాల పన్ను విధింపు–వసూలు అధికారం కేంద్రీకృతమై, నిధుల విడుదలకు రాష్ట్రాలు కేంద్రం వైపు ఎదురుచూసే పరిస్థితిలో రాష్ట్రాల ద్రవ్య సార్వభౌమాధికారం కోతకు గురైంది. ఏ రాయి అయితేనేం పళ్ళు రాలగొట్టుకోవడానికి అన్నట్లుగా పన్ను పేరు ఏదైనా సామాన్య ప్రజలకు వనగూరిన మేలేమీ లేదు–మరింతగా పరోక్ష పన్నుల పీడన పెరగడం తప్ప. జిఎస్‌టిలో పన్ను శ్లాబులు అసమంజసంగా ఉన్నాయని, అసలే అధిక ధరలతో సతమతమవుతున్న ప్రజలకు ఉపశమనం నిమిత్తం అనేక నిత్యజీవితావసర సరుకులను కనీస శ్లాబులోకి తగ్గించాలనే ఘోష కేంద్ర ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. జిఎస్‌టి కౌన్సిల్‌ది నిర్ణయాధికారమంటూ తప్పించుకునే ప్రయత్నమే కొనసాగుతున్నది. జిఎస్‌టి పన్ను ఎగవేతలను అరికడుతుందని, ముడి సరుకు నుంచి వస్తువు విక్రయించే చివరి పాయింట్ వరకు అంతా కంప్యూటరే చూసుకుంటుందని భావించినప్పటికీ, తాడిని తన్నేవాడు ఒకడుంటే వాడి తలదన్నేవాడు మరొకడుంటాడని అన్నట్లు వందలు వేల కోట్లలో పన్ను ఎగవేతలు బయటపడుతున్నాయి. అయినా ఆర్థిక మంత్రిగారు తమ ఘనతగా చాటుకోవడానికి పెరుగుతున్న పన్ను వసూళ్ల సంఖ్యలను ఘనంగా ప్రస్తావిస్తుంటారు.

జులై నెల రెవెన్యూ పెరుగుదలను విశ్లేషిస్తే, ఇబ్బందికరమైన అసమతౌల్యాలు వెల్లడవుతాయి. దిగుమతుల నుంచి జిఎస్‌టి వసూలు 9.7 శాతం పెరిగింది. కాగా దేశీయ లావాదేవీల నుంచి వృద్ధి 6.7 శాతమే. దేశీయంగా వస్తూత్పత్తి పెంపు చేయడం, స్వావలంబన, సరఫరాల రవాణా చెయిన్ బలంగా ఉండటం, వగైరా ప్రభుత్వ ప్రకటిత లక్ష్యాల వైఫల్యాన్ని ఈ సంఖ్యలు సూచిస్తున్నాయి. దేశీయ మార్కెట్‌కన్నా దిగుమతుల ఆర్థిక వ్యవస్థ మీదే ఎక్కువగా ఆధారపడుతున్నాం. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ (స్వావలంబన) భారత్ నినాదాలు ఏమైనట్లు? మన దేశం సరుకులనే కాదు, వృద్ధిని కూడా భారీగా దిగుమతి చేసుకుంటున్నదన్న మాట!

జులై సంఖ్యలో మరో ఆందోళనకరమైన అంశం కూడా ఉంది. కోవిడ్ మహమ్మారి తర్వాత తొలిసారి జిఎస్‌టి దేశీయ నికర రెవెన్యూ సంవత్సరం/సంవత్సరం ప్రాతిపదికన తగ్గింది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుదలను సూచిస్తున్న ఈ లక్షణం జిఎస్‌టి సమర్థతకు కొలబద్ధ కాబోదు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు మాసాల్లో (ఏప్రిల్–జులై) దిగుమతులపై పన్ను ఆదాయం 16శాతం పెరగ్గా, దేశీయంగా పెరుగుదల 9 శాతం మాత్రమే. అంత వ్యత్యాసం ఆర్థిక వ్యవస్థకు మంచిది కాదు.

జులై డేటాలో మరో ముఖ్యాంశం జిఎస్‌టి రిఫండ్స్‌లో 66.8 శాతం పెరుగుదల. గత సంవత్సరం ఇదే నెలతో పోల్చుకుంటే దేశీయ రిఫండ్‌లు 117.6 శాతం పెరిగాయి. జిఎస్‌టి వ్యవస్థ లోపల ఉన్న లోతైన లోపాలకు ఇది నిదర్శనం. మరో ఆందోళనకరమైన అంశం–రాష్ట్ర స్థాయి ఆర్థిక కార్యకలాపాల్లో వ్యత్యాసాలు. పారిశ్రామికంగా, ఆర్థికంగా ప్రాముఖ్యత గల రాష్ట్రాలలో పన్ను వసూళ్లలో వృద్ధి తక్కువగా ఉంది. ఉదాహరణకు ఢిల్లీ (2 శాతం), గుజరాత్ (3), రాజస్థాన్ (4), మహారాష్ట్ర (6), కర్ణాటక (7), తమిళనాడు (8) శాతం. ఇది ఆర్థికవ్యవస్థలో మందకొడితనాన్ని సూచిస్తున్నది.

అందువల్ల, ఆర్థికమంత్రి స్థూల సంఖ్యలతో సంబరపడక, లోతైన విశ్లేషణతో లోపాలను సరిదిద్దుకోవాలి. పన్ను ఆదాయం కాలక్రమంలో గణనీయంగా పెరుగుతున్నందున పేదలు, ఇతర సామాన్య ప్రజలకు ఉపశమనం చేకూర్చే విధంగా నిత్య జీవితావసర వినిమయ వస్తువులపై పన్ను మినహాయించాలి లేదా కనీస స్లాబ్‌లోకి మార్చాలి. రానున్న జిఎస్‌టి కౌన్సిల్ సమావేశానికి కేంద్రం ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పిస్తే కాదనే రాష్ట్రం ఉండదు.

# మధ్య ఆసియాలో సరికొత్త 'గ్రేట్ గేమ్'

పొయ్‌టర్ ఒపలిన్‌స్కీ
(అంతర్జాతీయ సంబంధాల కేంద్రం, పోలెండ్)

అపారమైన ప్రకృతి వనరులు, ఖనిజ సంపదతో విరాజిల్లే మధ్య ఆసియాపై ఆధిపత్య పోరాటం కొత్త రూపాన్ని దాల్చుకుంటున్నది. ఈ ప్రాంతం ఒక శతాబ్దానికిపైగా బాహ్య శక్తుల మధ్య ఆధిపత్య పోరాటాలకు వేదికగా నిలిచింది. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో, నాటి సోవియట్ యూనియన్ (యుఎస్ఎస్ఆర్), అమెరికా మధ్య నలిగిపోయింది. అయితే, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో, మధ్య ఆసియా తన సొంత వ్యూహాత్మక ఎజెండాను రూపొందిస్తున్నది. బహు ముఖంగా విస్తరిస్తున్నది. చైనా, అమెరికా, రష్యా, భారత్, యూరోపియన్ యూనియన్ (ఇయు)తోపాటు, ఈ ప్రాంతంలోని టర్కీ, ఇరాన్, పాకిస్తాన్, గల్ఫ్ దేశాలను కూడగట్టుకొని, నాటి 'గ్రేట్ గేమ్'కు కొత్త రూపాన్ని ఇస్తున్నది. నేడు మధ్య ఆసియా దేశాలు అనుసరిస్తున్న విధానాలు, నిన్నమొన్నటి వరకూ చోటు చేసుకున్న పరిణామాలను సమతుల్యం చేస్తున్నాయి. సమకాలీన 'గ్రేట్ గేమ్' ఒకప్పటి మాదిరిగా ముడి పదార్థాలు, వాణిజ్య రవాణా మార్గాల కోసం మాత్రమేగాక, సాంకేతిక, డిజిటల్, సంస్థాగత ఆధిపత్యం వంటి అంశాల్లో పోటీగా కూడా మారింది. సామర్థ్యం, వ్యవస్థాగత స్థితిస్థాపకత, రాజకీయ షరతులు లేకుండా పరస్పర సహకారం, వివిధ యంత్రాంగాల ప్రత్యామ్నాయ నమూనాలు ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. ఒకప్పుడు పరాధీనంగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు స్వయం ప్రతిపత్తి సంతరించుకుంటున్నది. కొత్త యూరో–ఏషియన్ వ్యవస్థ ఆవిర్భావానికి కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నది. గతంలో ఆధిపత్యం చెలాయించిన దేశాలు ఇప్పుడు మధ్య ఆసియా దేశాలు కొత్త రూపురేఖలు సంతరించుకోవడానికి సహకరించే పరిస్థితి నెలకొంది. 2023 మే మాసంలో, జియాన్ వేదికగా చైనా, మధ్య ఆసియా దేశాల నాయకుల మధ్య మొదటి శిఖరాగ్ర సమావేశం (సి+సి5 ఫార్మాట్)లో పరస్పర సహకారానికి శాశ్వత వేదిక ఏర్పాటైంది. ఇందులో రాజకీయ, మౌలిక సదుపాయాలు, శక్తి, ఇత్యాది రంగాల్లో సహకారానికి సంబంధించిన మొత్తం 19 అంశాలు ఉన్నాయి. మధ్య ఆసియాతో తమ సంబంధాల్లో కొత్త స్వర్ణయుగం ఆరంభమైందని చైనా వ్యాఖ్యానించింది. డిజిటల్, పర్యావరణ వస్తువులను అందించేందుకు రాచబాట ఏర్పడుతుందని పేర్కొంది. ఇంధనం, విద్య, సాంకేతికాది రంగాల్లో సహకారం, ప్రాంతీ య అభివృద్ధికి ప్రత్యేక పెట్టుబడుల కోసం నిధులు ఏర్పాటు తదితర ప్రతిపాదనలు చేసింది. అస్తానాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన రెండవ శిఖరాగ్ర సమావేశంలో, సి+సి5 ఫార్మాట్ కోసం శాశ్వత సచివాలయాన్ని కజకిస్తాన్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి డాటా సెంటర్, కొత్త టెక్నాలజీ మార్పిడి వేదిక 'చైనా–మధ్య ఆసియా డిజిటల్ హబ్' నిర్మాణం తదితర ప్రణాళికలను ఆమోదించారు. ఈ విధంగా, రష్యా, పశ్చిమ దేశాల ప్రభావాన్ని పరిమితం చేస్తూ, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) ఫ్రేమ్‌వర్క్ వెలుపల మధ్య ఆసియాలో తన ఉనికిని సంస్థాగతీకరించడానికి చైనా ప్రయత్నిస్తున్నది. సి+సి5 ఫార్మాట్ ఈ ప్రాంత రిపబ్లిక్‌లకు మరింత ఆకర్షణీయంగా మారుతోంది, వేగవంతమైన పెట్టుబడి, రాజకీయ షరతులు లేకపోవడంతో సహకార మార్గాలు వైవిధ్యాన్ని సంతరించుకోనున్నాయి. ఈ నమూనా మధ్య ఆసియాలో భౌగోళిక రాజకీయ శక్తి సమతుల్యతను గణనీయంగా మారుస్తుంది. ఈ ప్రాంతం బీజింగ్‌పై ఆధారపడటాన్ని పెంచుతుంది. దాని వ్యూహాత్మక స్థానాన్ని బలోపేతం చేస్తుంది.

అదే విధంగా, మధ్య ఆసియా దేశాలతో భారత్ నిరంతరం భాగస్వామ్యాలను అభివృద్ధి చేస్తోంది. కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్ వంటి దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ఆర్థిక, సాంకేతిక, విద్యా సంబంధాలను బలపరచుకుంటున్నది. 'ఇండియా–సెంట్రల్ ఆసియా డైలాగ్' 2019 నుండి అమలులో ఉంది. 2022 జనవరిలో జరిగిన 'వర్చువల్ లీడర్స్ సమ్మిట్' ద్వారా దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది. 2025 మే మాసంలో, నరేంద్ర మోదీ ప్రభుత్వం సమగ్ర 'ఇండో–యురేషియన్ కనెక్ట్ 2025' వ్యూహాన్ని ప్రకటించింది. రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధి (చబహార్ పోర్ట్, నార్త్‌సౌత్ కారిడార్), సాంకేతిక సహకారం (ఐటి, సైబర్ సెక్యూరిటీ, ప్రెసిషన్ అగ్రికల్చర్), విద్య, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్‌లలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)ను ఏర్పా టు చేయడం కూడా ఈ ప్రణాళిక లక్ష్యాల్లో ఒకటి. మధ్య ఆసియాలో పరస్పర సహకారం, భాగస్వామ్య ఆధారిత అభివృద్ధిలో కీలకంగా మారడానికి సాంకేతిక దౌత్యం, విద్యా సహకారం వంటి మృదువైన శక్తి సాధనాలను భారత్ ఉపయోగిస్తున్నది. చైనా, పాకిస్తాన్ ప్రభావాన్ని సమతుల్యం చేయడానికి, తన యురేషియన్ విదేశాంగ విధానాన్ని విస్తరించడానికి మధ్య ఆసియాను ఒక కీలకమైన ప్రాంతంగా భారత్ భావిస్తున్నది.

సామూహిక భద్రతా ఒప్పంద సంస్థ (సిఎస్‌టిఒ), యురేషియన్ ఆర్థిక సంఘం (ఇఎఇయు), ఎస్‌సిఒలలో రష్యా కీలక పాత్ర పోషిస్తున్నది. తద్వారా, మధ్య ఆసియా ప్రాంతంలో తన రాజకీయ, సైనిక ప్రభావాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నది. అయితే, మాస్కోపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అంతేగాక, రష్యా తదితర దేశాలతో తమ సంబంధాలను మరింత సమాన స్థాయిలో పునర్నిర్వచించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. తత్ఫలితంగా రష్యాకు మధ్య ఆసియాలో ప్రతిఘటనలు తప్పకపోవచ్చు. ఇక, ఇయు సి5 ఫ్రేమ్‌వర్క్ ద్వారా మధ్య ఆసియా దేశాలతో సహకారాన్ని యూరోపియన్ యూనియన్ (ఇయు) పెంపొందించుకుంటున్నది. రాజకీయ చర్చలు, అభివృద్ధి అవకాశాలను బలోపేతం చేస్తోంది. 2025 ఏప్రిల్‌లో జరిగిన సమర్‌కండ్ సమ్మిట్‌లో, గ్లోబల్ గేట్‌వే వ్యూహంలో భాగంగా 12 బిలియన్ యూరోల పెట్టుబడి ప్యాకేజీని ప్రకటించారు. ఈ నిధులను ఇంధనం (6.4 బిలియన్), రవాణా (3 బిలియన్), కీలకమైన ముడి పదార్థాలు, డిజిటలైజేషన్ (2.5 బిలియన్) తదితర రంగాలకు కేటాయిస్తారు. మొత్తం మీద మధ్య ఆసియాలో చైనా లేదా రష్యాతో ఇయు నేరుగా పోటీపడడం లేదు. కానీ పారదర్శకత, స్థిరమైన అభివృద్ధి, అధిక పర్యావరణ ప్రమాణాలు, కార్మిక నిబంధనల ఆధారంగా సహకారానికి ప్రత్యామ్నాయ నమూనాను ప్రతిపాదించడం ద్వారా పరోక్షంగా పోటీలో ఉంది.

భద్రత, ఇంధనం, విద్య, ప్రాంతీయ సార్వభౌమత్వానికి మద్దతు వంటి రంగాలలో సహకారానికి వేదికగా 2015లో ప్రారంభమైన సి5+1 ఫార్మాట్‌లో మధ్య ఆసియా దేశాలతో అమెరికా చర్చలు, సంప్రదింపులు నిర్వహిస్తోంది. ఈనెలలో, ఉజ్బెక్ విదేశాంగ మంత్రిని కలిసిన అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పలు కీలక రంగాలలో నిరంతర సహకారాన్ని ధ్రువీకరించారు. ఇంధన పరివర్తన, డిజిటలైజేషన్, సరఫరా గొలుసు భద్రతతోపాటుగా, ప్రాంతీయ వాణిజ్య నిర్మాణంలో ఆఫ్ఘనిస్తాన్ పాత్రను పెంచేందుకు పరస్పర సహకారాన్ని ప్రకటించారు. ఆర్థిక సహకారం, లాజిస్టిక్స్, ఇ–కామర్స్, పునరుత్పాదక ఇంధన వనరులు, పర్యాటకంపై దృష్టి సారించిన బి5+1 (వ్యాపారం 5+1) చొరవ ద్వారా, మధ్య ఆసియాలో అమెరికా రాజకీయ ముఖ చిత్రానికి ఒక రూపాన్నిచ్చారు. ఇదే సమయంలో, మధ్య ఆసియా దేశాలు ఎక్కువగా సమతుల్య వ్యూహాన్ని అవలంభిస్తున్నాయి. అన్నివైపుల నుంచి వస్తున్న సహకారాన్ని ఉపయోగించుకుంటున్నాయి. అయితే, ఏ ఒక్క వర్గం లేదా కూటమికి కట్టుబడి ఉండకుండా సంయమనం పాటిస్తున్నాయి. అందుబాటులో ఉన్న ఆర్థిక సహకారంతో, మౌలిక సదుపాయాల కల్పనకు బహుముఖ విస్తరణ విధానం ఆచరణాత్మమని గుర్తించి, అదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇంధన పరివర్తన, భద్రతా విధానాల్లో యురేనియం, లిథియం వంటి ముడి పదార్థాలు కీలకపాత్ర పోషిస్తాయి. ఇవి పుష్కలంగా ఉన్న మధ్య ఆసియా సహజంగానే ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పోటీకి కీలకమైన ప్రాంతంగా మారింది. యురేనియం ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ దేశాల పట్ల చైనా, రష్యా, ఫ్రాన్స్ దేశాలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. అక్కడి నిక్షేపాలను పొందడం మాత్రమేగాక, ప్రాసెసింగ్, లాజిస్టిక్స్, అణు సాంకేతిక పరిజ్ఞానంపై నియంత్రణకు కూడా ఈ దేశాలు పోటీపడుతున్నాయి. కాగా, మధ్య ఆసియాను తన కీలకమైన ముడి పదార్థాల సరఫరాను వైవిధ్యభరితం చేయడానికి ఒక అవకాశంగా ఇయు భావిస్తోంది. 'క్రిటికల్ రా మెటీరియల్స్ యాక్ట్ ప్రోగ్రామ్' కింద, ఇఎస్‌జి ప్రమాణాలకు అనుగుణంగా పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నది. తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ వంటి దేశాల నుంచి ముడిసరుకుల నిరంతర సరఫరా ఒప్పందం కుదిరితే, ఆయా దేశాలకు యూరోపియన్ మార్కెట్‌లో ప్రాధాన్యతను కల్పించే అవకాశాలను కూడా ఇయు పరిశీలిస్తున్నది. మధ్య ఆసియా తెల్లబంగారంగా పేర్కొనే లిథియం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నది. ఆసక్తి కనబరుస్తున్న దేశాలతో చర్చించి, తమకు అనుకూలమైన ఒప్పందాలను కుదుర్చుకునే స్థాయికి మధ్య ఆసియా దేశాలను చేర్చింది. అరుదైన ముడిపదార్థాలను వెలికితీయడానికి లేదా సరఫరా చేయడానికి మధ్య ఆసియా దేశాలు సాంప్రదాయ విధానాలకు క్రమంగా వీడ్కో లు చెప్తున్నాయి. డేటా, డిజిటల్ ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించే ప్రయ త్నం చేస్తున్నాయి. కజికిస్తాన్ ఇప్పుడు ఎక్కువగా ఐటి, అణుశక్తి అభివృద్ధి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నది. ఉజ్బెకిస్తాన్ ఇ–గవర్నెన్స్‌ను అమలు చేస్తున్నది. చైనా అందిస్తున్న సాంకేతిక సహకారంతో తుర్క్‌మెనిస్తాన్ పలు ఆధునిక వైజ్ఞానిక ప్రయోగాలు చేస్తున్నది. 5జి మౌలిక సదుపాయాల ఏర్పాటు, డేటా కేంద్రాల అభివృద్ధి, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ రంగాల్లో ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న వ్యూహాత్మక పోటీ, ఇప్పుడు మధ్య ఆసియా దేశాల రంగ ప్రవేశంతో కొత్త ఒరవడిని సంతరించుకుంటున్నది. పశ్చిమ దేశాలతో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, చైనా అధికారిక డిజిటల్ మోడల్‌వైపు మధ్య ఆసియా దేశాలు మొగ్గు చూపుతున్నాయి. పారదర్శకత, డేటా రక్షణ, సాంకేతిక సంస్థల నియంత్రణ తదితర రంగాల్లో పాశ్చాత్య దేశాలకు ప్రత్యామ్నాయంగా చైనా టెక్నాలజీని భావిస్తున్నాయి. మొత్తం మీద, ముడిసరుకుల ఎగుమతుల నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం వరకూ అనేకానేక రంగాల్లో మధ్య ఆసియా దేశాలు బహుళ విస్తరణ విధానాన్ని అవలంభిస్తున్నాయి. ఒకే అధికార కేంద్రానికి లోబడి ఉండడాన్ని వ్యూహాత్మకంగా నివారిస్తున్నాయి. టర్కీతో కజకిస్తాన్ సన్నిహిత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేస్తోంది. ఇయుతో ఉజ్బెకిస్తాన్ సంప్రదింపులు నెరపుతోంది. పరస్పర సహకార చర్చలను తీవ్రతరం చేస్తోంది. కాగా, తుర్క్మెనిస్తాన్ స్వయంప్రతిపత్తి ఇంధన సంబంధాలలో పెట్టుబడి పెడుతోంది. ప్రపంచ దేశాలు పోటీపడడానికి ఒక కేంద్రంలా కాకుండా, మధ్య ఆసియా దేశాలు ఇప్పుడు స్థిరత్వం, వైవిధ్యం, అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నాయి. ఆ దిశగానే అంతర్జాతీయ సంబంధాలను పెంచుకుంటున్నాయి. ఏ ఒక్క బలమైన కూటమి లేదా కేంద్రం ఆధిపత్యం కిందకు వెళ్లకుండా, సమతుల్య నెట్‌వర్క్‌ను రూపొందించుకోవాలని, స్వతంత్రంగా ఎదగాలని చూస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఈ దేశాలు ఎంత వరకూ సఫలమవుతాయో చూడాలి. సొంత ప్రయోజనాల కోసం బాహ్య శక్తుల బలమైన పోటీమధ్య సంతుల్యతను కొనసాగించడం అనుకున్నంత సులభం కాదు. అదే విధంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడం, ఉద్యోగాల రూపంలో అదనపు విలువలను కాపాడుకోవడం, పెరుగుతున్న ఒత్తిడిని తట్టుకొని స్వయంప్రతిపత్తిని రక్షించుకుంటూ నిర్ణయాలు తీసుకోవడం కూడా సవాళ్లతో కూడిన పయనమే. అయినప్పటికీ, ఈ అడ్డంకులను ఎదుర్కొంటూ, ఒత్తిళ్లను తట్టుకుంటూ, స్వతంత్ర వ్యూహాత్మక వాతావరణాన్ని రూపొందించుకుంటూ ముందుకు వెళుతున్న క్రమంలో 'గ్రేట్ గేమ్' కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నది.

# త్రిముఖ వ్యూహంతో ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం




భవిష్యత్తు ఎన్నికల్లో ఓటు బ్యాంకును స్థిరపరుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తెలంగాణ రాజకీయ రణక్షేత్రంలో మూడు పార్టీలు ప్రధానంగా కనపడుతున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బిఆర్ఎస్, అధికారం కోసం పోటీ పడుతున్న బిజెపి పార్టీలు కీలకంగా ఉన్నాయి. కాంగ్రెస్‌కు స్థిరమైన ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ, అది ప్రత్యర్థి ఓటు బ్యాంకును, చెదిరిపోయిన పాత ఓటు బ్యాంకును దరి చేసుకునేందుకు ప్రణాళికబద్ధంగా సాగుతున్నది. ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీలకు అడ్డుకట్ట వేసేందుకు త్రిముఖవ్యూహం రచించింది. అందులో భాగంగానే బిసి రిజర్వేషన్‌ల అంశం, దళితుల వర్గీకరణ, గత ప్రభుత్వ అవినీతిపై విచారణ కమిషన్‌లు, సంక్షేమ పథకాలను అస్త్రంగా చేసుకుంటోంది.

కాంగ్రెస్ పార్టీకి గతంలో అండగా నిలిచిన ముస్లిం మైనారిటీ వర్గం బిఆర్ఎస్ వైపు వెళ్ళింది. ఆ తరువాత మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థిగా బిజెపి అవతరించడంతో పాటు, మైనారిటీలలో పట్టున్న ఎంఐఎం కూడా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంతో తెలంగాణలో ప్రతి నియోజకవర్గంలో గణనీయసంఖ్యలో ఉన్న ఈ వర్గం తిరిగి కాంగ్రెస్‌కు చేరువవుతోంది. అలాగే దాదాపు పది శాతం ఉన్న ముస్లిం చేతి వృత్తుల కులాలు బిసిలలోభాగంగా ఉన్నాయి. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ పెంచుతూ రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదింపచేసుకొని, కేంద్రానికి పంపింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇది కేంద్రం ఆమోదం లభిస్తే ముస్లింలోని చేతి వృత్తుల వర్గాలకు కూడా లబ్ధి చేకూరనుంది. స్థానిక సంస్థల రిజర్వేషన్‌లలో కూడా వర్తించి రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతున్నది. సుప్రీం కోర్టు తీర్పుతో దళితుల వర్గీకరణకు బాటలు పడ్డాయి. వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న ఎంఆర్‌పిఎస్ బిజెపికి మద్దతుగా నిలుస్తుండడంతో, వారిని చెదరకుండా చేసుకునేందుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ కూడా పూర్తి చేసి అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేసింది. దళితుల్లో మరో ప్రధాన సామాజిక వర్గానికి కూడా సమప్రాధాన్యం ఇస్తూ, ఇరు కులాలకు మంత్రివర్గంలో చెరో రెండు చొప్పున మంత్రి పదవులను కట్టబెట్టింది.

వచ్చేసారి అధికారం మాదేనని రాష్ట్రంలో అడుగులు వేస్తున్న బిజెపిని అడ్డుకునేందుకు బిసి అస్త్రం రెండు విధాలుగా ఉపయోగించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. అటు బిసి రిజర్వేషన్‌ల బిల్లును పెంచుతూ తొమ్మిదవ షెడ్యూలులో రక్షణ కల్పించేందుకు కేంద్రానికి పంపింది. అక్కడ జాప్యం జరుగుతుండడంతో అందుకు కారణం కేంద్రంలో బిజెపి ప్రభుత్వమేనని బోనులో నిలబెట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ సక్సెస్ అయింది. ఇటు స్థానిక సంస్థల ఎన్నికలు అనివార్యమవడంతో, ఆ బిల్లులు అలా ఉండగానే ఇప్పటికే ఉన్న పంచాయతీరాజ్ చట్టం–2018ని స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్‌ల పెంపునకు వెసులుబాటు కల్పించే విధంగా ఆర్డినెన్స్ ఆమోదానికి గవర్నర్ వద్దకు పంపింది. రాజ్‌భవన్‌కు చేరిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ కేంద్రం సలహా తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో అటూ ఇటూ చేరి కాంగ్రెస్ బిసి రిజర్వేషన్‌లు పెంచినా, అమలు కాకపోవడానికి కారణం బిజెపియేనని ప్రజల్లో బలంగా వెళ్ళింది. ఈ పరిస్థితుల్లో బిసి రిజర్వేషన్‌ల పెంపు సాధ్యం కాదనే రీతిలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడి నుంచి వ్యాఖ్యలు వస్తుండడంతో కాంగ్రెస్‌కు కలిసివస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే బిసి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రచారం చేసిన బిజెపి, కనీసం శాసనసభాపక్ష నాయకత్వాన్ని, రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవిని బిసిలకు కాకుండా అగ్రకులాలకు కట్టబెట్టడంపై ఆ పార్టీలోనే బిసిలు కుతకుతలాడుతున్నారు. మరోవైపు రాష్ట్రానికి నిధులపై కూడా బిజెపిని కాంగ్రెస్ పదే పదే ఇరుకునపెడుతోంది. బిజెపి ఇరుకున పెట్టేందుకు ఇప్పటికే ఢిల్లీలో ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

ఇక బిఆర్ఎస్‌కు అడ్డకట్ట వేసేందుకు గత ప్రభుత్వ హయాంలో అవినీతి అక్రమాలపై వేసిన విచారణ కమిషన్‌లు, దర్యాప్తులు కొలిక్కి వస్తున్నాయి. ఇప్పటికే విద్యుత్ అక్రమాలపై వేసిన కమిషన్ నివేదిక సమర్పించగా, తాజాగా కాళేశ్వరం బ్యారేజీ కుంగుబాటుపై వేసిన కమిషన్ నివేదికను సమర్పించింది. వీటిని ఈ నెలలో జరిగే శాసనసభ వానాకాల సమావేశాలలో సభ ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అలాగే ఫార్ములా ఈ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసులు కూడా ఆగస్టు మాసంలోనే తుది రూపం తీసుకోనున్నాయి. ఈ కేసులలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, కీలక నేత టి.హరీశ్‌రావుల వైపే అన్ని వేళ్ళు చూపుతున్నట్లు భావిస్తున్నారు. బిఆర్ఎస్‌ను ప్రధానంగా అవినీతి అస్త్రంతోనే దెబ్బతీయాలని కాంగ్రెస్ యోచిస్తోంది.

వీటికి తోడు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చినప్పటికీ, గత ప్రభుత్వ వారసత్వంగా వచ్చిన అప్పుల కారణంగా కొన్నింటినే అమలు చేస్తోంది. అందులో ముఖ్యంగా మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం, 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్‌కు తోడు ఈ ఏడాది ప్రవేశపెట్టిన రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు పథకం ఇప్పుడిప్పుడే ప్రభావాన్ని చూపుతున్నాయి. వీటికి తోడు రుణమాఫీ, పెంచిన రైతు భరోసా ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో పేద, మధ్యతరగతి, గ్రామీణ కటుంబాలలో వెసులుబాటు లభిస్తున్నదని వివిధ సర్వేలు వెల్లడిస్తున్నాయి. మహిళలకు ఉచిత బస్సు పథకం ఫలితాలు చూపిస్తున్నదని తేలింది. తెలంగాణలో 2023–24లో కుటంబ ఖర్చుల్లో అత్యధికంగా 36 శాతం నుంచి 47 శాతం ఆహార ఖర్చుకే పోతున్నదని హౌజ్ హోల్డ్ కన్సంప్షన్ ఎక్స్‌పెండీచర్ సర్వే (కుటుంబ వినిమయ వ్యయ సర్వే –హెచ్‌సిఇఎస్)లో వెల్లడి అయింది. మిగత ఆహారేతర ఖర్చులో 20 శాతం బస్సు, రవాణా ఖర్చేనని నిర్ధారణ అయ్యింది. అయితే, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తెలంగాణలో కుటుంబ రవాణా వ్యయం 20 నుంచి 29 శాతం తగ్గినట్లు ఈ సర్వేలో తేలింది. ఇక ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకం కూడా 47 శాతంగా ఉన్న కుటుంబ వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది అత్యధిక కుటుంబాలలో కనిపించనుంది. ఎందుకంటే సన్నబియ్యం పథకం ద్వారా 3 కోట్ల మంది లబ్ధి పొందుతారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.

అందుకే ఈ మూడు అంశాల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినా, ఖైరతాబాద్ సహా పది అనర్హత పిటిషన్‌లకు సంబంధించి భవిష్యత్తులో ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ ఆలోచన. అందుకే దానిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు పిసిసి అధ్వర్యంలో కాంగ్రెస్ జన హిత పేరుతో పాదయాత్రను చేపట్టింది. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో పాదయాత్ర సాగుతుండడాన్ని ప్రత్యర్థి పార్టీలు విమర్శిస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి యాత్రలు ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నడవడం కొత్తేమి కాదు. 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలందరినీ వెంటబెట్టుకొని నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి గులాం నబీ ఆజాద్ రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా బస్సు యాత్ర చేసిన సంప్రదాయం ఉంది.

## జగిత్యాలలో గంజాయి విక్రేతల అరెస్ట్



ప్రజాపక్షం/కొడిమ్యాల: జగిత్యాల , కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో పరిధిలో దాదాపు లక్ష 50 వేల విలువ గల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొడిమ్యాల మండలం పూడుర్ గ్రామానికి చెందిన ప్రశాంత్ చలిగల్‌కు చెందిన నవీన్, గంగాధ ర్‌కు చెందిన వంశీలు నాగపూర్ నుండి గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్నారు. వీరితో పాటు జగిత్యాలకు చెందిన రణధీర్, అమర్‌నాథ్, మల్లిఖార్జున్ అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. విలేఖరుల సమావేశంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొడిమ్యాల సబ్ ఇన్స్‌ఫెక్టార్ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/ముత్తారం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముత్తారం పి.హెచ్.సి ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ లో జరుగుతున్న వైద్య పరీక్షల వివరాలను, స్టాఫ్ అటెండెన్స్ పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో ఎంత మంది ఔట్ పేషెంట్ వస్తున్నారో ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఔట్ పేషంట్ లలో వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని, ముందస్తుగా వ్యాధి నిర్ధారణ జరిగితే మెరుగైన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.ఆసుపత్రి సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని,సమయ పాలన పాటించాలని అన్నారు. ఈ పర్యటనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అమరేందర్ తో పాటు సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## సైన్ లాంగ్వేజీలో విన్నపాలు అర్థం చేసుకుని పరిష్కరించాలి



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: దివ్యాంగుల సమస్యలను, భావాన్ని సైన్ లాంగ్వేజీ ద్వారా అర్దం చేసుకుని వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. డాక్టర్ చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రం పరిధిలోని కలెక్టరేట్‌లో గల ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ప్రభుత్వ అధికారులకు బేసిక్ ఇండియన్ సైన్ లాంగ్వేజీ శిక్షణ ముగింపు కార్యక్రమానికి శనివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సంధర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను, వారి భావాన్ని సరిగ్గా అర్దం చేసుకునేందుకు అధికారులకు సైన్ లాంగ్వేజీ శిక్షణ ఇచ్చామని తెలిపారు. 7 రోజుల పాటు సాగిన ఈ శిక్షణలో సైన్ లాంగ్వేజీ బేసిక్స్ నేర్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ప్రాంతీయ శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ రాంబాబు, ఇతర అధికారులున్నారు.

## పకడ్బందీగా ప్రపంచ తల్లి పాల వారోత్సవాల నిర్వహణ

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల: ప్రస్తుతం తల్లి దండ్రులు తమ బిడ్డకు అత్యుత్తమ సంరక్షణకు అందించడంలో అనేక సవాళ్లను ఎదుర్కోంటున్నారని ప్రసవం, అలాగే ప్రసవానంతర కాలంలో పిల్లల కోసం కొనసాగుతున్న సంరక్షణ కూడా చాలా ముఖ్యమైనదని, బిడ్డ ఆరోగ్య భవిష్యత్ కు తల్లి పాలు పునాది వంటిదని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. శనివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో తల్లి పాల వారోత్సవాలలో సందర్భంగా జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ ఎస్సీ మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుట్టిన మొదటి గంటలోపు బిడ్డకు తల్లి పాలు తాగించాలన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల వరకు కేవలం తల్లి పాల మీదనే పెంచాలని, ఎలాంటి ద్రువపదార్థాలు కానీ ఇతర పదార్థాలు కానీ ఇవ్వకూడదని సూచించారు. బిడ్డకు, తల్లి ఆరోగ్యంగా ఉండడానికి తోడ్పడుతుందన్నారు. ప్రస్తుతం సమాజంలో చాలామంది తల్లులు అనేక అపోహాల వల్ల ముఖ్యంగా బిడ్డ సిజేరియన్ వల్ల పుట్టడం జరిగిందని లేదా బిడ్డ పుట్టిన తర్వాత జ్వరం వచ్చిందని లేదా తల్లి చాలా బలహీనంగా ఉందని, బిడ్డకు పాలు జరుగడం లేదన్నారు. మొత్తం 100 బాలింతలను తీసుకుంటే 65 మంది మాత్రమే బిడ్డకు పాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. తల్లిపాల యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరేష్, శిశు సంక్షేమ అధికారిని వాణిశ్రీ, సూపర్‌వైజర్‌లు పవిత్ర, ఆండాలు, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ మధు, ఎఫ్ ఆర్ ఓ కొండయ్య పాల్గొన్నారు.

## ప్రజల జీవన ప్రమాణాలు పెంచటమే అభివృద్ధి




ప్రజాపక్షం/సిద్దిపేట : కరోనా ప్రజల జీవితాల్లో అనేక మార్పులు తెచ్చిందని.. రోజు వారి దినచర్యలో మార్పు ఉండాలని, ఆరోగ్యం పట్ల క్రమశిక్షణ ఉండాలని కరోనా ప్రపంచానికి చాటిచెప్పిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. అభివృద్ధి అంటే నాలుగు కాలేజీలు, నాలుగు రోడ్లు ,నాలుగు స్టేడియాలు కట్టడం కాదని ప్రజల జీవన ప్రమాణాలు పెంచటమే అన్నారు. శనివారం సిద్దిపేట విపంచి కళానిలయంలో జరిగిన యోగా పోటీ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్య సిద్దిపేట, అభివృద్ధి సిద్దిపేట, ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి ప్రజలు ఆరగ్యంగా ఉండటం అభివృద్ధిలో భాగమన్నారు. పెద్దలు ఆరోగ్యమే మహా భాగ్యమని చెప్పారన్నారు. లక్షలు ఖర్చుపెట్టి ఆసుపత్రుల్లో నయం చేసుకునే కన్నా స్వీయ క్రమశిక్షణతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పిల్లలు ఫిజికల్ గేమ్స్ ఆడటం మానేసి, ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం మొదలు పెట్టారన్నారు. ఈరోజుల్లో తల్లులు కూడ పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇవ్వటం వల్ల పిల్లలకు అన్నం తినిపించటం సులభమైందన్నారు. యోగ మనలో మానసిక వత్తిడినీ దూరం చేస్తుందన్నారు. యోగ చేయటం వల్ల మన ఆరోగ్యాన్ని, మన శరీరాన్ని బాగ ఉంచుకోవచ్చు అన్నారు. పిల్లలకు చదువుతో పాటు ఆరోగ్యం ఏంతో ముఖ్యమని.. ఆటలు బాగ ఆడించాలన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మంజుల రాజనర్స్,వైస్ ఛైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు నాయకం లక్ష్మణ్, అరవింద్‌రెడ్డి, నాయకులు చిప్ప ప్రభాకర్,పాల సాయిరాం, తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడేందుకు సీడ్ బాల్ ఎంతో ఉపయోగకరం

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:అడవులు రోజురోజుకు అంతరించిపోతుండడంతో అడవుల పెంపుదలతో పాటు ప్రకృతిని కాపాడేందుకు సీడ్ బాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పద్మాకర్ రావు అన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు తులసి వేణుగోపాల్ విద్యార్థుల చేత వేప, కానుగ, చింత, నేరేడు, కంకుడు విత్తనాలతో సీడ్స్ బాల్స్ తయారు చేయించారు. అనంతరం శనివారం ఫారెస్టు అధికారుల ఆధ్వర్యంలో స్థానిక కొండ ప్రాంతంలోని అటవీ భూమిలో విద్యార్థుల చేత సీడ్ బాల్ విత్తనాలను వెదజల్లించారు. ఈ సందర్భంగా ఫారెస్టు అధికారులు విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతను చెట్ల వలన కలిగే ఉపయోగాలను వివరించారు. సీడ్ బాల్స్ తయారు చేయించిన పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌ను ఫారెస్టు అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్‌ఆఫీసర్ చైతన్యశ్రీ, బీట్ అధికారి మధుసూదన్, విజయ లక్ష్మి, ఉపాధ్యాయులు నరేష్, జంగిలి అశోక్, స్వామి, రాజేంద్ర ప్రసాద్, భూలక్ష్మి, సుమతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/పెద్దపల్లి : పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు.శనివారం మంథని ప్రాంతంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి ఆర్.ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు రేషన్ కార్డుల జారీ చేయాలని ప్రతిపక్షంలో అనేక సందర్భాలలో ధర్నాలు చేసినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులకు నూతన రేషన్ కార్డులతో పాటు 50 నుంచి 60 రూపాయల విలువ చేసే సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. రేషన్ ద్వారా దొడ్డు బియ్యం సరఫరా చేయడం ద్వారా రీసైక్లింగ్ గురై అక్రమార్కులు మాత్రమే బాగు పడ్డారని, నేడు సన్న బియ్యం సరఫరా పేద ప్రజలకు ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రతి కుటుంబానికి సగటున నెలకు 1200 రూపాయల విలువ గల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ కార్యక్రమం సక్రమంగా చేయాలని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం కోసం పెద్ద ఎత్తున ఆదర్శ పాఠశాలలను మన హయాంలో ఏర్పాటు చేశామని మంత్రి గుర్తు చేశారు. వేములవాడ రాజన్న, కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి, సమక్క సారలమ్మ జాతర వెళ్లడానికి, రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణం చేసేందుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం సౌకర్యం కల్పించిందని అన్నారు. ఆర్టీసీ బస్సులు ఉచితంగా ప్రయాణించే మహిళలకు ఇప్పటి వరకు 200 కోట్ల పైగా జీరో టికెట్లు జారీ చేసి 6680 కోట్ల రూపాయలు మహిళల తరపున ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు ఇల్లు చేరేలా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని, ప్రతి సంవత్సరం నూతనంగా ఇండ్లు మంజూరు చేస్తామని ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఇండ్ల స్థలాలు లేని నిరు పేదలకు ప్రభుత్వ భూములను కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు కట్టించే సంకల్పం చేస్తున్నామని అన్నారు. అడవి సోమన పల్లిలో 200 కోట్లు ఖర్చు చేసి కార్పొరేట్ స్థాయికి దీటుగా ఉండేలా ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణం చేస్తున్నామని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు పెంచామని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గత 20 నెలల కాలంలో ప్రభుత్వం అన్ని రంగాలలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించిన ప్రాధాన్యత పై సంబరాలు చేసుకుంటూ భవిష్యత్తులో మహిళల అభ్యున్నతికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి మహిళా శక్తి సంబరాలు జరుపుకుంటున్నామని అన్నారు. జిల్లాలో నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డుల ద్వారా 25 వేల పైగా ప్రజలకు లబ్ధి పొందనున్నారని తెలిపారు. మంథని ఎంపీడీవో కార్యాలయం వద్ద మంథని పట్టణంలో 20 కోట్ల 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించే 410 ఇందిరమ్మ ఇండ్ల పైలాన్, 7 గ్రామాలలో కోటి 40 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ భవనాలకు, ఎక్లాస్పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 కోట్ల 70 లక్షలతో నూతనంగా నిర్మించబోతున్న బాయ్స్ హాస్టల్ భవనానికి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, ఆర్.డి.ఓ. సురేష్,తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలి

కలెక్టర్ హైమావతి

ప్రజాపక్షం/ సిద్దిపేట : రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంగా బాధ్యతగా ప్రతి ఒక్కరు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. శనివారం ఐడిఓసి సమావేశమందిరంలో ఉద్యాన, వ్యవసాయ, టిజి అయిల్‌ఫెడ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఇప్పటికే ఫార్మాసి రిజిస్ట్రీ పై స్పష్టమైన ఆదేశాలు జారీచేసామని, దానికి అనుగుణంగాఅధికారులు పనిచేయాలని ఇక ప్రతివారం ప్రగతిపై అధికారులతో సమీక్షిస్తానన్నారు. ఫర్టిలైజర్ షాపులో ప్రతి గ్రామం తేదీల వారిగా వచ్చిన స్టాక్ వివరాలు,ప్రతి రైతు వారిగా యూరియా పంపిణీ వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ఎటలు ఖనీల్లో క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. లక్ష్య సాధనలో అవసరమైతే తగిన సహకారం అందించేలా కృషిచేస్తానని తెలిపారు. అయిల్ ఫామ్ సాగు కొరకు రైతులక అవగాహన కల్పించి డిడిలు కట్టించాలని సూచించారు. ఈసమావేశంలో ఉద్యానవన శాఖాధికారి సువర్ణ, వ్యవసాయ అధికారి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# వందేళ్ల చరిత్ర సిపిఐది



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి

ప్రజాపక్షం/కరీంనగర్: భారత కమ్యూనిస్టు పార్టీకి వందేళ్ల చరిత్ర ఉందని, దేశంలో, రాష్ట్రంలో బిజేపి పార్టీని నిలువరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి వెంకటస్వామి అన్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభల వాల్ పోస్టర్ ను సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ సిపిఐ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ప్రతి మూడు సంవత్సరాలకోసారి గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర మహాసభలు పూర్తి చేసుకొని జాతీయ మహాసభలు నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ నాలుగవ మహాసభలు ఈ నెల 19 నుండి 22 వరకు వరకు మేడ్చల్ జిల్లా కేంద్రంలో జరగనున్నాయని, ఈ మహాసభలకు అత్యంత ప్రాధాన్యత కలిగి ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి సీఎం అయి ఏడాదిన్నర గడిచిపోయిందని, ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు కొన్ని అమలు చేయడంలో వైఫల్యం కొనసాగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు, పేదలకు ఇండ్ల స్థలాలు, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదని అన్నారు. దేశ వ్యాప్తంగా ఇండియా కూటమిలో కాంగ్రెస్ తో సిపిఐ కలిసి ఉందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఐ గ్రామ, మండల, జిల్లా మహాసభలలో చేసిన తీర్మాణాలను రాష్ట్ర మహాసభలలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నామని వెంకటస్వామి తెలిపారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సమ్మయ్య, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, సమ్మయ్య, యెగేందర్, రాజు, బోనగిరి మహేందర్, బీర్ల పద్మ, అంజలి పాల్గొన్నారు.


# ఎరువుల దుకాణాలు తనిఖీ



ప్రజాపక్షం/జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణాలను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎరువుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎరువుల దుకాణం ముందు సూచిక బోర్డు తప్పనిసరి గా ఉంచాలని, సూచిక బోర్డుపై ఎరువులు మందులు మరియు విత్తనాలు ధరల పట్టికలో ధరలు రాయాలని, రైతులకు సరైన ధరలకు అమ్మాలని సూచించారు. అదేవిధంగా రైతులకు ఎరువులు విత్తనాలు నాణ్యతమైనవి అందించాలని, కాలం చెల్లిన మందులను రైతులకు అమ్మకూడదని, స్ప్రే మందులు సరైన ధరలకు అమ్మాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులతో ఒక ఎకరానికి ఎంత ఎరువులు వేస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతమైన మందులు ఇస్తున్నారా, అడిగి తెలుసుకున్నారు. దుకాణాదారు యజమానులకు రైతులకు నాణ్యతలేని ఎరువులు మందులు విత్తనాలు అమ్మినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కాళేశ్వరం మోటార్లు షురూ

రేపు ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు నీటిని ఎత్తిపోసేందుకు అధికారుల ప్లాన్




కాళేశ్వరం ప్రాజెక్ట్ లింకు 2 లోని నంది,గాయత్రి పంప్ హౌస్ లో బాహుబలి మోటార్ల పంపింగ్ కు సిద్ధం ప్రజాపక్షం/ముత్తారం/మంథని : కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారంలోని,నంది పంప్ హౌస్ లోని మోటార్ల ద్వారా నీటిని, నంది రిజర్వాయర్ లోకి నీటినీ ఎత్తి పోసేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని సమాచారం.? అక్కడి నుంచి మరో రెండు సొరంగ మార్గాల ద్వార, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీ పూర్ లోని గాయత్రీ పంప్ హౌస్ కు,అక్కడి నుంచి మిడ్ మానేరు జలాశయానికి గోదావరి జలాలను తరలిస్తారని అధికారులు స్పష్టం చేశారు. అయితే రేపు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి ,లక్ష్మణ్ గౌడ్, శ్రీధర్ బాబు పెద్దపల్లి జిల్లాలో పర్యటించనున్నారు.

# సొంతింటి కల నిజం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

పట్టణ అభివృద్ధికి రూ.150 కోట్లు

పట్టణంలో 144 మంది పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడకు ప్రత్యేక శ్రద్ధ ఇస్తున్నాం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ పట్టణంలోని ఏస్ఆర్ ఆర్ గార్డెన్స్ లో శనివారం జరిగిన కార్యక్రమంలో 144 మంది అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. బస్ డిపో పక్కన ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల స్థలంలో ఈ ఇంటి పట్టాలు లబ్దిదారులకు అందించారు. గత ప్రభుత్వ హయంలో నిర్మించి ఖాళీగా ఉన్న ఇండ్లను ఇప్పుడు పేదలకి ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యంలో పేదల కలలు నిజం అవుతున్నాయి. కాంగ్రెస్ అంటే పేదల ప్రభుత్వం. గత 10 ఏళ్లలో పేదలకే ఇళ్లు ఇవ్వని పాలకులు, ఇప్పుడు విమర్శలు చేయడం శోచనీయం అన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, వెంటనే 144 ఇళ్ల నిర్మాణానికి మిగిలిన 5.63 కోట్లను విడుదల చేసి పనులు పూర్తి చేస్తోంది అన్నారు. వేములవాడ అభివృద్ధిపై మాట్లాడుతూ, రాజన్న ఆలయానికి 150 కోట్లు, అన్నదాన సత్రానికి 35 కోట్లు, భీమన్న ఆలయాలకు 3 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. మూలవాగుపై మూడవ వంతెన నిర్మాణానికి డబ్బులు మంజూరయ్యాయని తెలిపారు. వేములవాడ పట్టణంలో 2వేల మందికి ఇంకా ఇళ్లు అవసరమయ్యే పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అందరికీ ఇండ్లు కల్పించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళల కోసం ఉచిత బస్సు సేవలు, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, రాకేష్, గృహ నిర్మాణ శాఖ అధికారులు, అన్వేష్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, న్యాత నవీన్, మాజి కౌన్సిలర్లు తూము మధు, గణేష్, ఇంద్రమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్‌లో ఘనంగా ఫారెస్ట్‌డే వేడుకలు



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కరీంనగర్‌లోని మంకమ్మతోటలో గల అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్ పాఠశాలలో 'ఫారెస్ట్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విధ్యార్థులకు సృజనాత్మకంగా బోధించడం ద్వారా పలు విషయాలను నేర్చుకోవడానికి ఉత్సాహం ప్రదర్శించడంతో పాటు విషయాల పట్ల సమగ్ర అవగాహన వస్తుందన్నారు. ప్రభావిత అంశాలలో ఒకటైన అడవుల గురించి విధ్యార్థులకు స్పష్టంగా తెలియజేయడంతో పాటు అడవిలో కలిగే లాభాల గురించి విధ్యార్థులకు చక్కగా తెలియజేయాలన్నారు. అడవుల యొక్క ప్రభావాన్ని ఏ విధంగా ఉంటుందో పలు కార్యక్రమాల ద్వారా విధ్యార్థులకు స్పష్టంగా తెలియజేసి ఆసక్తిని పెంచాలని కోరారు. పలు రకాల ఫలాలను, వనరులను కల్పించేది అడవులేనని, అడవులతో నీటి సంరక్షణ జరుగుతుందని, ముఖ్యంగా అత్యంత ప్రమాదకరమైన వాయు కాలుష్యం నుంచి రక్షిస్తుందని తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పరిశ్రమల యొక్క స్థాపనతో అడవుల శాతం తరుగుతున్నదని, ఇది చాలా విచారకరమైన విషయమని తెలుపుతూ ప్రతి ఒక్కరూ అడవులను సంరక్షించడానికి పాటు పడాలని, ప్రభుత్వానికి చేయూతగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు విద్యార్థులు పలు జంతువుల, వృక్షాల ఆకారాలతో దుస్తులు ధరించి సందడి చేశారు. పాఠశాల ప్రాంతాన్ని వివిధ వృక్షాల రూపంలో అందంగా అలంకరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజెపిలో వ్యక్తిగత నిర్ణయాలుండవ్

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



ప్రజాపక్షం/ కరీంనగర్: భారతీయ జనతా పార్టీలోవ్యక్తిగత నిర్ణయాలు ఉండబోవని, ఎవరికి ఏబాధ్యత అప్పగించాలనేది పార్టీ నాయకత్వమే నిర్ణయిస్తుందనికేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. మాకు ఈ పదవి కావాలి..? ఆ పదవి కావాలంటూ సొంత నిర్ణయాలను ఎన్నడు రుద్దబోమని, ఎందుకంటే బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ. నాయకత్వం ఏది చెబితే అది శిరసావహించి పని చేస్తామని, పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలను కార్యకర్తలుగా, నాయకులుగా,మా బాధ్యతని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో శనివారం కిసాన్ సమ్మాన్ నిధి, సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఓ పత్రికలో తన మంత్రి పదవి నుండి విముక్తి చేయాలని వస్తున్న వార్తలపై మీడియా అడిగిన ప్రశ్నకు పై విధంగా బదులిచ్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో వ్యక్తి నిర్ణయాలుండవని, ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలనేది పార్టీ ఆలోచిస్తుందని అన్నారు. పదవుల కోసం మేం ఎన్నడూ పాకులాడబోమన్నారు. పార్టీ వద్దకు పోయి ఆ పదవి కావాలని సొంత నిర్ణయాలను పార్టీ నాయకత్వంపై రుద్దబోమన్నారు. బీజేపీ పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీ ఆదేశాలను శిరసావహిస్తమని, పార్టీ ఏది చెబితే అది చేస్తామని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను చూసి బీజేపీ కూడా అట్లనేఅని బావిస్తున్నారేమో అట్లాకాదని, బీజేపీలో సమిష్టి నిర్ణయాలుంటాయని,వాటిని అమలు చేసే బాధ్యత మాపై ఉంటిందన్నారు.

## రేషన్ కార్డులు సద్వినియోగం

ప్రజాపక్షం/తిర్యాణి : నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ కోరారు. మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలోశనివారం రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఆయన మాట్లాడుతూ మండలానికి మొత్తం 898 మందికి రేషన్ కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో 508 మందికి నూతనంగా మంజూరు కాగా మరో 390 పేర్లును, మార్పులు చేశామన్నారు. ఈ కార్డుల ద్వారా అర్హులైన వారందరికి సన్నబియ్యం అందజేయడం జరుగుతుందన్నారు. వీటిని దుర్వినియోగం చేయరాదన్నారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్లయితే చర్యలు తప్పవని సూచించారు. ఈ రేషన్ కార్డుల వల్ల గుర్తింపు ఏర్పడుతుందని అలాగే వివిధ పథకాల కోసం కూడా దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కాగా మండలంలోని రేషన్ డీలర్లు లబ్ధిదారులకు నిర్ణీత గడువులోగా రేషన్ సరుకులను అందజేసేలా చూడాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావివ్వరాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ లోకేష్ కుమార్, ఇంచార్జి డిఎస్ఒ జాదవ్, తహసీల్దార్ శ్రీనివాస్, డిటి వంశీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలకేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదేశానుసారం సీఎం సహాయనిధి చెక్కులు శనివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా అర్హులైన లబ్ధిదారులకు చెక్కుల రూపంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు, యువకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## ఆర్మూర్‌లో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర విజయవంతం



ప్రజాపక్షం / ఆర్మూర్ : కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర ఆర్మూర్‌లో ప్రారంభమైంది. శనివారం సాయంత్రం ఆరుగంటలకు ఆమె ఆర్మూర్ చేరుకున్నారు. ముందుగా ఆలూరు బైపాస్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. పాదయాత్ర ఆలూరు బైపాస్ నుంచి ప్రారంభమైంది. దారిపొడవునా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరిస్తూ.. సమస్యలు వింటూ ముందుకు సాగారు పాదయాత్ర పెద్ద బజార్, గోల్ బంగ్లా, అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తా మీదుగా పెర్కిట్ చౌరస్తా వరకు సాగింది. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మదన్ మోహన్ రావు, లక్ష్మి కాంతారావు, కార్పొరేషన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాసుల బాలరాజు, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ మార చంద్రమోహన్, ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సుల దరఖాస్తు పరిశీలన



ప్రజాపక్షం/బోధన్: రుద్రూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. ఈ సందర్భంగా సదస్సుల్లో వచ్చిన భూ భారతి దరఖాస్తులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రెవెన్యూ సదస్సు దరఖాస్తుల ప్రొసీడింగ్‌లను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోపు వాటి క్లియరెన్స్ ను నిర్ధారించాలని సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు.

## జావెలిన్ త్రో కు నూత్‌పల్లి విద్యార్థి

ప్రజాపక్షం / నందిపేట్ : డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి శివరాజ్ రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రోకు ఎంపికయ్యారు. హన్మకొండలో ఈనెల 3న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా నుంచి పాల్గొననున్నారు. జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నందిపేట్ మండలం నుంచి జిల్లా స్థాయి అథ్లెటిక్ లో లాంగ్ జంప్ విభాగంలో బంగారు పతకం సాధించి అనాస, శ్రీదేప్ వెండి పతకం సాధించారు.

## 5న మెదక్‌లో ఉపాధ్యాయుల ధర్నా




ప్రజాపక్షం/పాపన్నపేట: ఉపాధ్యాయ, పాఠశాల విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 5న మెదక్ లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్పిసి నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు కుర్తివాడలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్, టిపిటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం 5571 పిఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి.. పదోన్నతులు ద్వారా నింపాలన్నారు. సర్వీస్ రూల్ రూపొందించి రెగ్యులర్ ఎంఈఓ లను నియమించాలని, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న డిఏ లను, పీఆర్సీ ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిఓ 317 కారణంగా స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, వారిని సొంత జిల్లాలకు పంపాలని, జెడ్పి జిపిఎఫ్, టీఎస్ జిఎల్ఐ, సరెండర్ లీవ్స్ మరియు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయలకు విరమణ రోజునే రావలసిన అన్ని బకాయిలు చెల్లించాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల, భూషణం, జిల్లా కార్యదర్శి నాచారం శేఖర్, జిల్లా నాయకులు కె.వి.ఆర్ నాయుడు, మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం

### మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



ప్రజాపక్షం/రామాయంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారంమండలంలోని దంతెపల్లి లో పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులు అందరూ ఇంటి నిర్మాణాలు చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపాలని సూచించారు. ఇసుక, మొరం,ఎక్కడినుండి తీసుకువస్తున్నారు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మేస్త్రీలతో పంచాయతి కార్యదర్శులు సమావేశాన్ని ఏర్పరిచి త్వరగా నిర్మాణాలు చేపట్టేలా చూడాలన్నారు. దశల వారిగా పూర్తి అవుతున్న నిర్మానాలకు సంబందించిన ఫోటోలను ఎప్పటికప్పుడు అన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, లబ్ధిదారులకు త్వరగా నగదు జమ అయ్యేలా చూడాలన్నారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత ఫ్రైడే.. డ్రైడేపై కార్యక్రమంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండాచర్యలు తీసుకుంటూ దోమ లు పుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాథమిక పాఠశాలను,అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు.చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు పంపేందుకు ప్రజలకు ఇబ్బందులుతలెత్తకుండా చూడాలన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తూ, ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలను నిర్వహించాలని టీచర్లను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో షాజిలోద్దిన్‌తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దర్పల్లి, ఇందల్వాయిలలో కలెక్టర్ తనిఖీలు



ప్రజాపక్షం/నిజామాబాద్: ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ధర్పల్లి మం డలం హోన్నాజీపేట్‌లోని జడ్పీ హెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, ఎరువుల గోడౌన్లను, ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సహకార సంఘం ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేశారు. పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది హాజరును పేసర్ రికగ్నైజేషన్ విధానం ద్వారా చేపడుతున్నారా అని ఆరా తీశారు. విద్యార్థుల ప్రవేశాలు, హాజరవుతున్న వారి సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలను పరిశీలించి ఇంకనూ ఏమైనా వసతులు అవసరమున్నాయా అని ప్రధానోపాధ్యాయులు అడిగారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఎరువుల గిడ్డంగులలో అందుబాటులోని నిల్వలు, స్టాక్ రిజిస్ట్రర్లలోని వివరాలకనుగుణంగా ఉన్నాయా అని పరిశీలించారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వెంటాదివెంట ఇండెంట్ పెట్టి ఎరువుల నిల్వలను తెప్పించుకోవాలని ఆదేశించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమానలు నిర్వహించాలని టీచర్ రజితను ఆదేశించారు. కాగా ఎల్లారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణం చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరుపాలని సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులున్నారు.

## జనహిత పాదయాత్ర ఏర్పాట్ల పరిశీలన

ప్రజాపక్షం/ఖానాపూర్ : జనహిత పాదయాత్రలో భాగంగా ఆదివారం జరగబోయే పాదయాత్రకు సంబంధించినఖానాపూర్ మండల రూట్ మ్యాప్‌ను,రాష్ట్ర కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఖానాపూర్ మండలంలో ఈనెల 3న పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఖానాపూర్ మండలంలో పాదయాత్రకు వస్తున్న సందర్భంగా,ఎమ్మెల్యే కార్యకర్తలతో కలిసి బాదన్ కుర్తి,మస్కాపూర్,ఖానాపూర్ పట్టణంలో రూట్ మ్యాప్‌ను పరిశీలించి,పాదయాత్ర విషయమై రోడ్ మ్యాప్ గురించి సిఐ అజయ్ కుమార్ తో చర్చించి, సూచనలు చేశారు. అనతరం కార్యకర్తలకు రేపు జరగబోయే పాద్రయాత్రకు పెద్ద మొత్తంలో జనం మధ్యలో చూడాలని ఈ పాదయాత్ర విజయవంతం చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీఅ చైర్మన్ పడిగల భూషణ్,వైస్ చైర్మన్ మజీద్,ఆత్మ చైర్మన్‌లు అంకం రాజేందర్,రాజురా సత్యం,మండల అద్యక్షుడు దొనికిని దయానంద్,కావలి సంతోష్,షాబీర్ పాషా,జంగిలి శంకర్, శేషాద్రి గంగాధర్,గంగన్న ఉన్నారు.

# ఎండోమెంట్ పరిధిలోకి కోదండ రామాలయం

### ప్రభుత్వ ఆధీనంలోకి వద్దంటూ బిఆర్ఎస్ ధర్నా, బిజెపి నేతల నిరసన హుండీ, ధర్మసత్రానికి సీల్



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ పట్టణంలో 49 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ కోదండ రామాలయం దేవాలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ(ఎండోమెంట్)అధీనంలోకి తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఉదయం ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామాలయం స్వాధీనం చేసుకోవడానికి వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, బీజేపీ, ఇతర నాయకులు తీవ్ర అభ్యంతరం చెప్పి ప్రతిఘటించడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని అధికారులు ఎండోమెంట్ కమిషనర్, కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌కు నివేదించారు.శనివారం శ్రీ కోదండ రామాలయానికి టౌన్ సిఐమహేష్ ఆధ్వర్యంలో పోలీసులతో బందోబస్తు, పహారా ఏర్పాటు చేశారు. ఎండోమెంట్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్ స్పెక్టర్ లక్ష్మణ్ సమక్షంలో ఆలయంలోకి సిబ్బంది వెళ్లి హుండీలకు, ఫంక్షన్ హాల్‌కు తాళాలు వేసి సీల్ చేసి ఆలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి స్వాధీనం చేసుకున్నారు. బిఆర్ఎస్, బిజెపి నాయకులు రామాలయంను ఎండోమెంట్ పరిధిలోకి వద్దంటూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలతో కలిసి రామాలయం ముందు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ శ్రేణులతో కలిసి రామాలయంలో ప్రత్యేక పూజలు దేవుని గుడి జోలికి ఎవ్వరూ వచ్చిన అడ్డుపడతామని హెచ్చరించారు. భక్తుల మనోభావాలుదెబ్బ తీసేలా శ్రీ కొదండ రామాలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయడం దుర్మార్గమైనచర్యఅని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి మండిపడ్డారు. ఇదిలా ఉండగా శ్రీ కోదండ రామాలయం గుడి విషయంలో ఏ రాజకీయ పార్టీ కూడా రాజకీయం చేయవద్దని, దేవాలయాన్ని ఎండోమెంట్ లో విలీనం చేయాలనే ఆలోచన అధికారులు పక్కన పెట్టాలని, గుడి కోసం ఎంతవరకు వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నానని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు.ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గుడిలలో దూప, దీపం పెట్టె వాళ్లు కరువయ్యారని మండిపడ్డారు. కుంటి సాకులు చెప్పి రామాలయాన్ని ఎండోమెంట్ ఆధీనంలోకి తీసుకోవడంఏమిటనిప్రశ్నించారు. ఆలయ కమిటీ వాళ్ళు తప్పు చేస్తే కూర్చుని మాట్లాడాలి. తప్పు చేస్తే శిక్ష వేయాలని, కానీ రాద్ధాంతం చేయడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్, రేవంత్‌రెడ్డిపై ప్రజల్లో సన్నగిల్లిన విశ్వాసం

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మళ్లీ మోసం చేయడానికేనా ఈ పాదయాత్రలు?

ప్రజాపక్షం/భీమ్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయకుండా,మరోసారి మోసం చేయడానికి పాదయాత్రల పేరుతో ప్రజల ముందుకు వస్తున్నారంటు మాజీమంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు.నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలో రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షీ నటరాజన్,పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లు పాదయాత్రలు చేయడం శోచనీయం అన్నారు.రెండేళ్ళ కాలంలోనే సీఎం రేవంత్‌రెడ్డి,కామగ్రెస్ సర్కారుపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని అన్నారు.సాతనిక సంస్థల ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని చూసి ఓట్లు వేయరని తెలిసి కొత్తగా ఎవరికి పరిచయంలేని మీనాక్షీ నటరాజన్‌ను ముందుపెట్టి పాదయాత్రలు చేయడం చౌకబారుతనానికి నిదర్శం అన్నారు. ఎన్నికల్లో ఎలాగైన గెలవాలన్న లక్ష్యంతో రాహుల్‌గాంధీతో వరంగల్ డిక్లరేషన్ పేరుతో రైతులకు 2లక్షల రుణమాఫీ,సన్నాలకు 500ల బోనస్,రైతులకు 15వేల రైతు బరోసా,పసుపుకు 12వేల మద్దతు ధరఅంటు అలివికాని హామీలిచ్చి రైతులను నమ్మించి మోసం చేసిందన్నారు. రైతులకు కోట్ల రూపాయలు బకాయిపడ్డ కాంగ్రెస్‌కు రైతులు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. మీనాక్షీ నటరాజన్ చేస్తున్న పాదయాత్రలో రైతులకు నమ్మించి మోసం చేసిన పథకాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలంటు యూవతను మోసం చేసిందన్నారు.ఇప్పటివరకు కేవలం 5083 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని అన్నారు.నిరుద్యోగ భృతి 4వేలు ఇస్తామంటు యూవతను మోసం చేసిందన్నారు.ఉద్యోగం ఇవ్వని వారికి పది లక్షలు ఇస్తామని చెప్పి ఎంత మందికి ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో బిసి డిక్లరేషన్..కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో హామీలు.. బీసీల కోరకు 5సంవత్సరాలలో లక్షకోట్లు ఖర్చు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన 20 నెలల్లో ఎన్నివేల కోట్లు ఖర్చు చేసిందన్నారు.స్థానిక సంస్థల్లో,విద్యారంగంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఆరు నెలల్లో కల్పిస్తామని చెప్పి బిల్లును అసెంబ్లీలో ఒకసారి,ఆర్డినెన్స్ పేరుతో మరోసారి కాలయాపన చేస్తు చివరికి కేంద్రంపై తోసి తప్పించుకుందన్నారు. చేవెళ్ళ డిక్లరేషన్..మల్లిఖార్జున ఖర్గేతో హామీలు..ఎస్సీ,ఎస్టీలకు 12లక్షల ఆర్థిక సహయం చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్కరికైన ఇచ్చారా అని ప్రశ్నిం చారు. మహిళలకు ఇస్తామన్న 2500ల పెన్షన్, 4వేల ఆసరా, తులం బంగారం, ఉపాధి కూలీలకు 12వేలు,ఆటో డ్రైవర్లకు 12వేలు అని 420 హామీలిచ్చి ఒక్కటికూడా అమలు చేయలేదన్నారు.ప్రజల పక్షాన మీరు ఇచ్చిన హామీలను అమలు చేసేలా మీ హైకమాండ్‌ను ఒప్పించిన తరువాతనే మీ పాదయాత్ర కొనసాగించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా ముందస్తు అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు.ప్రజా పాలన అంటే ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీ పాలను తలపించేలా ఉందన్నారు. జిల్లా పార్టీ కార్యలయంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఇంటిచుట్టు పోలీసులను ఎందుకు మొహరించారని అన్నారు.పోలీసులు నియోజకవర్గంలో అరెస్టులు చేసిన బిఆర్ఎస్ నాయకులను,కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## నిర్వాసితుల సమస్యలు పట్టవా?

### సిపిఐ జిల్లా నేత శివలింగు కృష్ణ



ప్రజాపక్షం/గజ్వేల్: సర్వం కోల్పోయిన మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సిపిఐ జిల్లా నేత శివలింగ కృష్ణ శనివారం డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎన్నో హామీలు గుప్పించి గ్రామాలు ఖాళీ చేయించినట్లు గుర్తు చేశారు. అప్పటి హామీలు అమలు చేయకుండా బాధితులను నట్టేట ముంచగా, నిర్వాసితుల పక్షాన పోరాడిన సీఎం రేవంత్ రెడ్డి ముంపు గ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా నిర్వాసితులకు పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని, కొందరు అర్హులకు ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వలేదని, గ్రామాలకు స్మశానవాటికలు కేటాయించలేదని తెలిపారు. అయితే స్పందించిన డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే నిర్వాసిత గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, నిధుల దుర్వినియోగం తదితర సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. అయితే వారి సమస్యల పరిష్కారంలో తన వంతు పూర్తి సహకారం, భాగస్వామ్యం ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.




## సమష్టి కృషి వల్లే పెంబి బ్లాక్‌కు ‘కాంస్యం’

ప్రజాపక్షం/నిర్మల్ : నీతి అయోగ్ ప్రతిపాదిత ఆస్పిరేషన్ బ్లాకులలో కీలకంగా నిలిచినా నిర్మల్ జిల్లా పెంబి బ్లాక్‌కు కాంస్య పతకం లభించింది. శనివారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఈ అవార్డును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్వీకరించారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు,సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్,అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు.నీతి అయోగ్ ఎంపిక చేసిన 500 ఆస్పిరేషన్ బ్లాకులలో పెండి బ్లాక్ నాల్గవ స్థానంలో నిలిచింది, ఆరోగ్య, పోషణ, వ్యవసాయం, విద్య, మౌలిక సదుపాయాలు తదితర ఆరు సూచికలలో మెరుగైన పనితీరును ప్రదర్శించినందుకే ఈ పురస్కారం లభించిందని అధికారులు తెలిపారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ పెండి బ్లాక్‌కు జాతీయ స్థాయిలో నాల్గవ ర్యాంకు రావడం గర్వకరణం.ఇది సమిష్టి కృషికి నిదర్శనం,ఆస్పిరేషన్ నుంచి ఇన్స్పిరేషన్‌గా మారిన పెంబి మనందరికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. గర్భిణీల నమోదు, డయాబెటిస్ స్క్రీనింగ్, సప్లిమెంటరీ పోషకాహారం అందజేతలో వందశాతం పనితీరు,భూ హెల్త్ కార్డుల జారీలో 70 శాతంపెంబి బ్లాక్ సాధించిందని కలెక్టర్ వివరించారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జిపై గుంతలు పూడ్చివేత

ప్రజాపక్షం ఎఫెక్ట్



ప్రజాపక్షం/ సిర్పూర్ (టి) : పనులు పూర్తిగా కాకమునుపే ప్రారంభం... ప్రమాదాలకు ఆహ్వానం అనే శీర్షికతో ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. సిర్పూర్ టౌన్ నుండి కాగజ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి పై అసంపూర్తిగా ఉన్న పనులపై ప్రజాపక్షంలో వెలువడిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఆర్అండ్‌బి శాఖ ఏఈ క్రాంతికుమార్ శుక్రవారం రోజున రంగంలోకి దిగారు. ప్రమాదాలకు దారితీసే మట్టి గుంతలను పూడ్చించి, పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు. ప్రజల నుండి వచ్చిన గళాన్ని ప్రభుత్వ యంత్రాంగం పరిగణలోకి తీసుకుని స్పందించిన తీరు అభినందనీయం. ఇదే విధంగా ఇతర ప్రాంతాల్లోనూఅభివృద్ధి పనుల్లోనిర్లక్ష్యాన్నినివారించాలని స్థానికులు కోరుతున్నారు.

# ర్యాగింగ్‌పై ఫిర్యాదు వస్తే కఠిన శిక్షలు

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి వాణి



ప్రజాపక్షం/బాసర : ఆర్జీయుకేటి బాసరలో జిల్లా న్యాయ సేవా సంస్థ నిర్మల్ సమన్వయంతో ర్యాగింగ్ నివారణ,మాదకద్రవ్యాల విపత్తు నివారణపై న్యాయ అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రదాన అతిథులుగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వాణి,సీనియర్ సివిల్ జడ్జి రాధిక,వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్,భైంసా ప్రొఫెసర్ మురళీధర్శన్,ఏఎస్పీ భైంసా అవినాష్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌లకు స్వాగతం పలికారు. విశ్వవిద్యాలయం డ్రగ్స్,ర్యాగింగ్‌కు పూర్తి వ్యతిరేకంగా ఉంటుంది.క్యాంపస్‌ను ర్యాగింగ్, మాదకద్రవ్య రహితంగా ఉంచడమే మా లక్ష్యం అని చెప్పారు.సమాజంలో డ్రగ్స్ బారినపడి ఎంతోమంది తమ జీవితాలను నాశనం చేసుకున్నారు.జీవితంతో ఆడుకోవద్దు అనే సూత్రాన్ని పాటించాలని పిలుపునిచ్చారు.ముఖ్యఅతిథి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ ర్యాగింగ్ అంటే ఏమిటి? దాని ప్రభావాలు ఎలా ఉంటాయి? అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాగింగ్ డ్రగ్స్ వలన జరిగే దుష్పరిణామాలు,ప్రభావాలను విశ్లేషించారు. ర్యాగింగ్‌పై ఫిర్యా దు వచ్చినట్లయితే కఠినంగా శిక్షలు విధించబడతాయని స్పష్టం చేశారు. డ్రగ్స్ చరిత్రను వివరిస్తూ,1832–44లో చైనా,బ్రిటన్ మధ్య జరిగిన డ్రగ్ యుద్ధాలను ప్రస్తావిస్తూ,డ్రగ్ యుద్ధాలను ప్రస్తామిస్తూ,డ్రగ్స్ తీసుకోవడం,అమ్మడం,పంపిణి చేయడం ఎంత ప్రమాదకరమో వివరించారు.ప్రత్యేక అతిథి సీనియర్ సివిల్ జడ్జి రాధిక మాట్లాడుతూ న్యాయ వ్యవస్థను పేదలకు మరింత సమర్థంగా అందించేందుకు న్యాయ సేవా సంస్థ నిరంతరం కృషి చేస్తోంది. ఎస్సీ,ఎస్టిలు,మహిళలక న్యాయ పరంగా ఎక్కువగా ఉపయోగపడుతున్నాం అన్నారు. జిల్లాలో 400 మంది లీగల్ పరా వాలంటీర్లు పనిచేస్తున్నారని,ముఖ్యంగా సీనియర్ సిటిజన్ ఫోరంను పరా వాలంటీర్లుగా ఎంపిక చేశామని వివరించారు.ర్యాగింగ్ విషయంలో మాట్లాడుతూ,1996 లో తమిళనాడులో ఎంబిబిఎస్ విద్యార్థి ఒకరిని సీనియర్‌లు ర్యాగ్ చేయడం వల్ల మృతి చెందిన ఘటన అనంతరం,1997 లో తమిళనాడు ప్రభుత్వం ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ర్యాగింగ్ చిన్న ఘటన నుంచి పెద్ద ప్రమాదంగా మారే అవకాశముండదంతో,ఒక్క సారి కూడా ఉపేక్షించకూడదని,ర్యాగింగ్‌కి సంబంధించి ఫిర్యాదులు తప్పనిసరిగా కమిటీకి ఇవ్వాలని,దర్యాప్తు నివేదికను సంస్థాధిపతికి సమర్పించాలని చెప్పారు.కార్యక్రమం చివరిలో ఓపెన్ ఫోరం నిర్వహించబడింది.ఇందులో విద్యార్థులు తమ సందేహాలను వ్యక్తీకరించారు.ప్రదర్శనలుగా సివాప్సిస్‌లు, వీడియోలు, డాక్యుమెంట్లు విద్యార్థులకు చూపించబడ్డాయి. బాలికల వసతి గృహాన్ని పరిశీలించి వసతుల కల్పన,సంక్షేమం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.తర్వాత విద్యార్థుల భోజన శాలను పరిశీలించి,వారితో కలిసి భోజనం చేశారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులు న్యాయ వ్యవస్థ ర్యాగింగ్, డ్రగ్స్‌పై స్పష్టమైన అవగాహన పొందారు. కార్యక్రమంలో నిర్మల్ కోర్ట్ సూపరెంటెంట్ పురుషోత్తం రావు,ముధోల్ సీఐ మల్లేష్,బాసర ఎస్ఐ శ్రీనివాస్,డీన్లు నాగరాజు,డాక్టర్ విట్టల్,డాక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడ

డబ్ల్యూసిఎల్ ఎఫెక్ట్..

## ఇక అక్కడ 'పాకిస్థాన్' పేరుపై బ్యాన్!

ప్రపంచ ఛాంపియన్‌షిప్ లెజెండ్స్‌లో టీమ్‌ఇండియా ఛాంపియన్స్ దెబ్బకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఇక క్రికెట్ ఆడకూడదని అభిమానుల నుంచి వచ్చిన విజ్ఞప్తితో భారత మాజీ క్రికెటర్లు బహిష్కరించిన సంగతి తెలిసిందే. దీంతో పాకిస్థాన్ పేరును ప్రైవేటు లీగుల్లో వాడేందుకు అనుమతిని రద్దు చేస్తూ పీసీబీ నిర్ణయం తీసుకుంది. ఒకవేళ వినియోగించుకోవాలని అనుకుంటే మాత్రం బోర్డు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలంటూ పాక్ క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.

'గత గురువారం జరిగిన బోర్డు సమావేశంలో చాలా విషయాలపై చర్చించాం. అందులో డబ్ల్యూసీఎల్ టోర్నీ కూడా ఉంది. పాక్‌తో భారత్ ఛాంపియన్స్ ఆడేందుకు నిరాకరించింది. ఇకనుంచి భవిష్యత్తులో ఇలాంటి టోర్నీల్లో పాకిస్థాన్ పేరుతో ఆడాలంటే అనుమతి తీసుకోవాల్సిందే. లేకపోతే ఆడేందుకు వీల్లేదు. ఒకవేళ ఏ లీగ్‌లోనైనా ఉపయోగిస్తే లీగల్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. పీసీబీకి మాత్రమే 'పాకిస్థాన్' పేరును వాడేందుకు హక్కు ఉంది' అని పీసీబీ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే డబ్ల్యూసీఎల్ ఫైనల్‌కు పాకిస్థాన్ ఛాంపియన్స్ చేరుకున్న సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికాతో ఆడేందుకు ఆ జట్టుకు పిసిబి అనుమతి ఇచ్చింది.



ఒకే జట్టులో షమీ, సూర్యవంశీ..

## కెప్టెన్‌గా ఇషాన్!

భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ దేశవాళీలో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. మోకాలి గాయం తర్వాత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన ఈ స్పీడ్‌స్టర్ దులీప్ ట్రోఫీలో వికెట్ల వేటతో టీమిండియా తలుపు తట్టాలనే కసితో ఉన్నాడు. ఇషాన్ కిషన్ సారథ్యంలో ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగనున్నాడు షమీ. ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన శతకంతో రికార్డు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్‌లు కూడా స్క్వాడ్‌లో ఉన్నారు. ఐపిఎల్‌తో ఫామ్ అందుకున్న ఇషాన్‌కే ఈస్ట్ జోన్ పగ్గాలు అప్పగించడంతో.. సీనియర్ ప్లేయర్ అభిమన్యు ఈశ్వరన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. స్క్వాడ్‌లోని షమీకి 34 ఏళ్లు కాగా.. వైభవ్‌కు 14 సంవత్సరాలు మాత్రమే. ఇరవై ఏళ్ల వయోభేదం ఉన్న ఈ ఇద్దరూ ఒకే జట్టుకు ఆడుతుండడం విశేషం. అయితే.. రంజీ ట్రోఫీలో నిరుడు బెంగాల్ తరఫున అత్యధిక రన్స్ బాదిన సుదీప్ చటర్జీని సెలెక్టర్లు పక్కన పెట్టేశారు.

### ఈస్ట్ జోన్ స్క్వాడ్ :

ఇషాన్ కిషన్(కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్(వైస్ కెప్టెన్), సందీప్ పట్నాయక్, విరాట్ సింగ్ డెనిశ్ దాస్ శరందీప్ సింగ్ కుమార్ కుష్రగ, రియాన్ పరాగ్, ఉత్కర్ష్ సింగ్, మనీషి, సూరజ్ సింధు జైస్వాల్, ముకేశ్ కుమార్, ఆకాశ్ దీప్, షమీ.

### స్టాండ్ బై ప్లేయర్లు :

ముఖ్తర్ హుసేన్, ఆశీర్వాద్ స్వేన్, వైభవ్ సూర్యవంశీ, సాత్విక్ సమాల్, సుదీప్ కుమార్ ఘరమి, రాహుల్ సింగ్.

దేశవాళీ సీజన్ 2025–26 దులీప్ ట్రోఫీతో ప్రారంభం కానుంది. చాలా సీజన్ల తర్వాత ఆరు జోన్లతో నిర్వహిస్తున్న ఈ ట్రోఫీ ఆగస్టు 28న షురూ అవుతుంది. జాతీయ జట్టులో చోటు ఆశిస్తున్న ఇషాన్ కిషన్, షమీలకు ఈ టోర్నీ కీలకం. ఐపిఎల్ 18వ సీజన్‌లో ఇద్దరూ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడారు. కిషన్ మెరుపు సెంచరీతో అదరగొట్టినా.. ఆ తర్వాత తేలిపోయాడు. లీగ్ మ్యాచ్‌ల ఆఖర్లో మళ్లీ ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాట్ ఝులిపించాడంతే. షమీ విషయానికొస్తే.. ఆరు వికెట్లతో తీవ్రంగా నిరాశపరిచాడు. సో.. డొమెస్టిక్ క్రికెట్‌లో ఫామ్ చాటుకొని.. టీమిండియా జెర్సీ వేసుకోవాలని ఇద్దరూ భావిస్తున్నారు. ఇద్దరికీ 'ఆల్ ది బెస్ట్' చెబుదామా.

## ఆరో శతకంతో రెచ్చిపోయిన యశస్వీ


భారత ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (100 నాటౌట్) శతకంతో రెచ్చిపోయాడు. ఓవల్ మైదానంలో బౌండరీలతో ఊచకోత కోసిన ఈ యంగ్‌స్టర్ లంచ్ తర్వాత.. మూడంకెల స్కోర్ అందుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడికిది ఆరో సెంచరీ కాగా అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో రెండోది. అట్కిన్సన్ ఓవర్లో డబుల్, ఆపై సింగిల్ తీసి సెంచరీ సాధించాడీ హిట్టర్. కేవలం 127 బంతుల్లోనే 11 ఫోర్లు, 2 సిక్సర్లతో వంద కొట్టేశాడు. అనంతరం గ్లాలోకి పంచ్‌లు విసురుతూ.. డ్రెస్సింగ్ రూమ్‌వైపు నేను ఉన్నాను అనే సంకేతం చూపిస్తూ సంబురాలు చేసుకున్నాడీ ఓపెనర్.




మూడో రోజు యశస్వీ(104 నాటౌట్), ఆకాశ్ దీప్(66)ల జోరుతో భారీ స్కోర్ దిశగా సాగుతోంది టీమిండియా. మూడో వికెట్‌కు 107 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని ఓవర్టన్ విడదీసి ఇంగ్లాండ్‌కు ఊరటనిచ్చాడు. ఆ తర్వాత శుభ్‌మన్ గిల్ (11) సౌకర్యంగానే కనిపించాడు. కానీ, భోజన విరామం తర్వాత తొలి ఓవర్లోనే గిల్‌ను అట్కిన్సన్ ఎల్బీగా ఔట్ చేసి టీమిండియాకు షాకిచ్చాడు. దాంతో189 వద్ద నాలుగో వికెట్ పడింది. క్రీజులోకి వచ్చిన కరుణ్ నాయర్(12 నాటౌట్) డిఫెన్స్‌తో అదరగొడుతున్నాడు. యశస్వీకి తోడుగా అతడు 34 రన్స్ జోడించాడు. ప్రస్తుతం 224 రన్స్ కొట్టిన గిల్ సేన ఆధిక్యాన్ని రెండొందలకు పెంచుకుంది.

ఫోకస్



## కుప్పకూలిన 'వాల్‌స్ట్రీట్'



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ దేశాలనేకాదు... అగ్ర రాజ్యాన్ని కూడా ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం కనిపిస్తున్నది. ట్రంప్ తాజా సుంకాలతో పాటుగా కార్మిక మార్కెట్ డేటాతో ఈనెల మొదటి రోజే (శుక్రవారం) స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లోని న్యూయార్క్ స్టాక్ ఎక్ఛేంజ్ భారీ నష్టాలను నమోదు చేసింది. ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాల దాడి, అమెరికా కార్మిక రంగంలో బలహీన సంకేతాలు స్టాక్ మార్కెట్ పతనానికి కారణమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆందోళనకు గురయ్యారు. పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకున్నారు. నెలల తరబడి న్యూయార్క్ మార్కెట్లు స్థిరంగా ఉన్న సమయంలో, ట్రంప్ చేపట్టిన మార్పులు, తీసుకుంటున్న నిర్ణయాలు గ్లోబల్ వాణిజ్యంపై మరోసారి గందరగోళ పరిస్థితులను సృష్టించాయి. ముఖ్యంగా, చైనా, మెక్సికో, ఇండియా వంటి కీలక వాణిజ్య భాగస్వామిక దేశాలపై అమెరికా భారీగా సుంకాలను విధించడం ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నది. ట్రంప్ తాజా సుంకాల వార్త మార్కెట్‌లో శరవేగంగా వ్యాపించింది. అదే సమయంలో అమెరికా కార్మిక శాఖ విడుదల చేసిన ఉద్యోగాల డేటా పెట్టుబడిదారులను నిరాశపరిచింది. జూన్, జూలై నెలల్లో ఉద్యోగాల సృష్టిలో స్పష్టమైన మందగమనాన్ని ఈ నివేదిక వెల్లడి చేయడమే ఇందుకు కారణం. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగ రంగంలో డిమాండ్ తగ్గుతున్నదనే సంకేతాలను ఇస్తోంది. నిరుద్యోగిత రేటు స్వల్పంగా పెరగడం కూడా పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేసింది. ఈ క్రమంలోనే స్టాక్ మార్కెట్ ఇండెక్స్ శుక్రవారం 1.6 శాతం పడిపోయింది. ఏప్రిల్ తర్వాత ఇదే అతి పెద్ద నష్టంగా పేర్కొంటున్నారు. మొత్తం మీద వారాంతంలో ఈ సూచీ 2.4 శాతం మేర తగ్గింది.

## మార్కెట్లపై ట్రంప్ టారిఫ్ ప్రభావం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించిన కొత్త టారిఫ్ జాబితా కారణంగా ప్రపంచ మార్కెట్ తీవ్రమైన ఆటుపోట్లకు గురైంది. భారత్‌కు కూడా దీని ప్రభావం తప్పలేదు. 'రెడ్ ఫ్రైడే'గా పేర్కొనదగిన ఈ వారం లావాదేవీలకు చివరి రోజైన ఆగస్టు ఒకటో తేదీన భారత స్టాక్ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. ఆరంభంలో కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, క్రమంగా అమ్మకాల ఒత్తిళ్లు ఎదుర్కొన్నాయి. బాంబే స్టాక్ ఎక్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్ 585.67 పాయింట్లు పతనమై, 80,599.91 పాయింట్ల వద్ద స్థిరపడగా, జాతీయ స్టాక్ ఏక్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ 203 పాయింట్ల నష్టంతో 24,565 పాయింట్లుగా ముగిసింది. మొత్తం 69 దేశాలపై 10 నుంచి 41 శాతం వరకూ టారిఫ్‌లను పెంచే ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేసిన విషయం తెలిసిందే. గతంలో విధించిన 15 శాతం అదనపు సుంకాలు ఈనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకిరాగా, అదే రోజు జారీ చేసిన ఉత్తర్వుల్లో 25 శాతం సుంకాలు విధించారు. ఆ నిర్ణయం ఈనెల 7వ తేదీ నుంచి అమలుకానుంది. అప్పటిలోగా అమెరికాతో భారత్ వాణిజ్య చర్చలు జరపడం, సుంకాలపై సానుకూల ఒప్పందం కుదరడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తున్నది. ఈ పరిణామం సహజంగానే భారత స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణుల అభిప్రాయం. సోమవారం (ఆగస్టు 4) నుంచి స్టాక్ మార్కెట్ లావాదేవీలు తిరిగి ప్రారంభమైన మొదటి సెషన్‌లోనే మార్కెట్ల తీరుతెన్నులు ఏ విధంగా ఉంటాయనే విషయంపై ఒక అభిప్రాయం ఏర్పడవచ్చు. అయితే, ట్రంప్ నిర్ణయాల ప్రభావంతో ఆరంభం నుంచే మార్కెట్లపై అమ్మకాల ఒత్తిడి మొదలవుతుందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## పుంజుకున్న 'బులియన్'

స్వల్ప కాలం స్తబ్ధంగా ఉన్న బులియన్ మార్కెట్ ఈవారం ఒక్కసారిగా పుంజుకుంది. బంగారం, వెండి ధరలు పరుగులు తీశాయి. శనివారం 100 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ. 15,300 పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బంగారం ధరలు కూడా పెరిగిపోతున్నాయి. కొంత కాలం క్రితం ఒక్కసారిగా ఆకాశాన్నితాకిన బంగారం ధరలు, ఈ ఏడాది మొదటి త్రైమాసికం నాటికి ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. స్టాక్ మార్కెట్లు నిత్యం ఆటుపోట్లను చవిచూస్తూ, గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో, పెట్టుబడిదారులు బంగారం, వెండిపై మొగ్గు చూపుతున్నారు. ద్రవ్యోల్బణం, యుద్ధాల భయాలు, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ గందరగోళంతోపాటు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధిస్తున్న భారీ సుంకాలు సమస్యను పెంచుతున్నాయి. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 24 క్యారట్ల గ్రాము బంగారం ధర 153 రూపాయలు పెరిగి, రూ.10,135 వద్ద ట్రేడ్ అవుతున్నది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,290గానూ, 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.7,601గానూ ఉంది. గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర, హైదరాబాద్, చెన్నై, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.10,135కాగా, ఢిల్లీలో రూ. 10,150గా కొనసాగింది.



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొనసాగిస్తున్న వాణిజ్య యుద్ధ ప్రభావం డాలర్‌పైన కూడా కనిపిస్తున్నది. ఫోరెక్స్ మార్కెట్‌లో డాలర్ విలువ కూడా భారీ నష్టాలను ఎదుర్కొంటున్నది. అమెరికా

## ఫోరెక్స్‌పైనా ప్రభావం

ఆర్థిక భవిష్యత్తుపై మదుపరులలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, సమీప భవిష్యత్తులోనూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చనని పరిశీలకుల అంచనా. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య సంఘర్షణలు తిరిగి తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక వృద్ధిలో మందగమనం సంకేతాలు కలిసి ఫోరెక్స్ మార్కెట్ సెంటిమెంట్‌ను కూడా దెబ్బతీశాయి. పెట్టుబడిదారులు తదుపరి ఫెడరల్ రిజర్వ్ సమావేశాన్ని, ట్రంప్ పరిపాలన నుండి రాబోయే మరిన్ని తక్షణ చర్యలను నిశితంగా గమనిస్తున్నారన్నది తాజా పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# నిబద్ధత కలిగిన నేత బరిగెల వెంకయ్య

వెంకయ్య స్మారక స్థూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్ రావు



**ప్రజాపక్షం/చండూరు :** పార్టీ సిద్ధాంతాలకోసం నిబద్ధతలో శుదిశ్వాస వరకు పోరాడిన నిరాడంబర జీవి, నిబద్ధత కలిగిన అమరజీవి బరిగెల వెంకయ్య అని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ సీనియర్ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురం గ్రామంలో బరిగెల వెంకయ్య 2వ వర్ధంతి సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆయన స్మారక స్థూపాన్ని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పార్టీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కొండాపురం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన నాయకుడు బరిగెల వెంకయ్య అని అన్నారు. గ్రామంలో భూస్వాముల కు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా ఉన్న నికార్సయిన కమ్యూనిస్టు అన్నారు. గ్రామంలో ఇండ్లు లేని వారికి ఇండ్లు , భూమి లేని వారికి భూమి ఇప్పించిన నాయకుడు బరిగెల వెంకయ్య అని అన్నారు. రైతు సేవా సహకార సంఘం ఉపాధ్యక్షుడుగా రైతుల సమస్యలపై పోరాడిన నేతగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం నిరంతరం పోరాటం చేసిన బరిగెల వెంకయ్య లేని లోటు ఈ ప్రాంతానికి తీరని లోటన్నారు. కమ్యూనిస్టు పార్టీ చేసిన ప్రతి పోరాటంలో ముందుండేవారని గుర్తు చేశారు. బరిగెల వెంకయ్య భౌతికంగా మన మధ్య లేకపోయిన వారి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. రాబోయే సానిక సంస్థల ఎన్నికల్లో చండూరు మండలంలో ఎర్రజెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. కొండాపురం సిపిఐ శాఖ కార్యదర్శి గడ్డం నవీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు, మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేశ్ , దోటి వెంకన్న, కర్నాటి వెంకటేశం, ఇరిగి సంజీవ, బండమీది వెంకన్న, సిహెచ్ ఊషయ్య, గడ్డం పరమేష్, పల్లె శంకరయ్య, శివర్ల లింగస్వామి, ఇరిగి గోపయ్య, బోయపల్లి అంజయ్య, గడ్డం యాదయ్య, బరిగెల శ్రవన్ కుమార్ , వెంకటదాస్, మోహన్ దాస్ ,వెంకయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల పక్షపాతి కమ్యూనిస్టు పార్టీ


యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** పేద ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీ ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన జిల్లా కార్యదర్శికి, జిల్లా కార్యవర్గ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బునాదిగాని కాలువ పనులను వెంటనే పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ ఉనికి చాటుకోవాలన్నారు. కార్యక్రమానికి ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డికి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, కుసుమని హరిచంద్ర, ఎండి ఇమ్రాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసి కంటి లక్ష్మీ నరసయ్య, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, సహకార దర్శి ఎండి నయుం, మండల నాయకులు యాస బుచ్చిరెడ్డి, జల్లి రాములు, సుల్తాన్ పురుషోత్తం, జక్క దయాకర్ రెడ్డి, సోలిపురం లింగారెడ్డి, కసరబోయిన సత్తయ్య, గుర్రం రాజమణి బొబ్బల లాల్ రెడ్డి, కల్వల నరసయ్య, పంజాల వెంకటేశం, మజ్జిగ నరసయ్య, సోమనబోయి నరసింహ, మారుపాక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## చీపురుగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్ డిమాండ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులకు సరైన ఆహారాన్ని అందించకుండా తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్న చీపురుగూడెం హెచ్‌ఎం, వార్డెన్‌ను తక్షణమే విధుల్లో నుండి తొలగించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏటిడబ్ల్యూఓ కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ దమ్మపేట మండలంలోని చీపురుగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థులు ఆకలికి అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గిరిజన విద్యకు పెద్దపీఠ వేస్తూ వసతులు, ఆహారాన్ని సమకూరుస్తుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రభుత్వ లక్ష్యాని నీరు గారుస్తున్నారని మండిపడ్డారు.విద్యార్థులకు ఆహార పదార్థాలు జీసిసి నుండి వస్తుంటే వాటిని అమ్ముకుంటూ గిరిజన విద్యార్థుల పొట్టకొడుతున్నారన్నారు. వార్డెన్,హెచ్‌ఎం కుమ్మక్కై మెనూ ప్రకారం ఆహారాన్ని అందించడం లేదని, గుడ్డు మొదలుకుని అరటి పండు, బిస్కెట్లు అందివ్వకుండా విద్యార్థులను నోరు కొడుతున్నారన్నారు. విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై ఐటిడిఏ పిఒ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లాసమితి సభ్యులు రాజ్ కమల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గుడాలు

- ☞ ఆదివాసీల ఉసురు తీసిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్
- ☞ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రాంమూర్తి నాయక్




**ప్రజాపక్షం/గూడూరు:** గత రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసి గుడాలను అభివృద్ధి పేరుతో గ్రామపంచాయతీలుగా చేసి ఆదివాసీలను సర్పంచులుగా నియమించినప్పటికీ ఆదివాసి గుడెంలు అభివృద్ధికీ మాత్రం ఆమడ దూరంగానే మిగిలిపోయాయని గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రాంమూర్తినాయక్ అన్నారు. శనివారం గూడూరు మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా రెండవ మహాసభ జిల్లా అధ్యక్షుడు లావుడ్య రాము నాయక్ అధ్యక్షతన శనివారం జరిగింది. గూడూరు మండల కేంద్రంలో భారీగా ర్యాలీ నిర్వహించి అనంతరం సభను నిర్వహించడం జరిగింది. ఈసభకు ముఖ్యఅతిథులుగా హాజరై గిరిజర సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రాంమూర్తి నాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో గిరిజనులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోన్నారని పరిపాలన సౌలభ్యం కోసం తండాలను గ్రామపంచాయతీలుగా చేసినప్పటికీ అభివృద్ధిలో మాత్రం ఏమాత్రం బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. గిరిజనులు పోడు చేసుకున్న భూములను హక్కు పత్రాలు ఇస్తానని హామీ ఇచ్చి హక్కు పత్రాలు ఇవ్వకపోగా వారి హక్కులను కాలరాసే విధంగా అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ పోలీసులను పెట్టి గిరిజనులను తీవ్ర హింసలకు గురి చేసి వారి ఉసురుతీశాడని ఆరోపించాడు. అయితే 10 సంవత్సరాల పరిపాలనలో గిరిజనులకు మేలు జరగలేదని నిత్యం గిరిజనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నాయని అన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంసైతం గిరిజనుల సమస్యలపై ఏమాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని గిరిజనులకు రావలసిన పథకాలను ఇవ్వడంలేదని ఆరోపించారు. ఎలాగైతే కాంగ్రెస్ ప్రభుత్వం 40/శాతం బిసి రిజర్వేషన్ బిల్లుకు ప్రయత్నం చేస్తుందో గిరిజనులకు 10/శాతం రిజర్వేషన్ అమలు చేసి చట్టసభలో అవకాశం ఇవ్వలని ఆయన డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో గిరిజన జనాభా దాదాపు 40 లక్షలు ఉన్నాయని గిరిజనులు అనేక తెగలు ఆదివాసి గిరిజనులు లంబాడి, ఎరుకలు కోయలు వేరువేరు జీవనస్థితిలో జీవస్తున్నారని అయితే వారంతా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసి బతుకులు దుర్భరమైన స్థితిలో ఉన్నాయన్నారు.గిరిజనులకు దక్కాల్సిన పథకాలు దక్కడం లేదని జల్ జంగిల్ జమీన్ నీరు అడవి భూమి రాజ్యంగం కల్పించిన సర్వహక్కలను పాలక ప్రభుత్వలు కాలరాస్తున్నాయని తెలంగాణ రాష్ట్రం ఏర్పాడితే గిరిజనుల తలరాతలు మారుతాయని కలలు కన్నామని కానీ కలలు కలలాగనే మిగిలిపోయాయని రాజ్యంగంలో గిరిజనులకు ఆదివాసులకు దక్కవలసిన వాటా రాజకీయంగా ఆర్థికంగా సామాజిక రంగాల్లో రిజర్వేషన్లు రావడంలేదని అన్నారు. ఆదివాసి గిరిజనులకు కేటాయించిన బడ్జెట్ వాళ్ళు అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేవెళ్ల డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### సంపద కోసమే ఆదివాసీల హత్యలు

కేంద్ర ప్రభుత్వం గత కోన్ని రోజులుగా చతీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో గిరిజన ప్రజలను మావోయిస్టు పేర్లతో ఎన్‌కౌంటర్ చేసి చంపేస్తున్నారని సుమారు ఈ మధ్యకాలంలో గిరిజన యువత భారీగా మృత్యువాత గురయ్యారని మహబూబాబాద్ సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారధి అన్నారు. కర్రెగుటల్లో ఉన్న సంపద కోసం బడా బాబులకు దానిని కట్టబట్టేందుకు అమాయక గిరిజనులను పోట్టన పెట్టుకున్నారని అటవీ ప్రాంతంలో నివసించకుండా చేస్తున్నారని ఆయన అన్నారు. మానుకోట జిల్లాలో బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తానని చెప్పి కేంద్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తుందని ఆరోపించారు.ఈపరిశ్రమ ద్వారా గిరిజనులకు ఆదివాసిలకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు.

# కార్మికుల హక్కులు కాపాడేది ఎఐటియుసి మాత్రమే

ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న, లేకున్నా కార్మికుల పక్షాన నిలుస్తూ వారి హక్కులను కాపాడేది ఒక ఎఐటియుసి యూనియన్ మాత్రమేనని ఆయూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం ఏరియాలోని సిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. జూలై నెలలో ఆర్‌ఎల్‌సి దగ్గర జరిగిన అగ్రిమెంట్‌లో డిస్మిస్ అయిన జిఎంకు ఇటీలకు తిరిగి ఉద్యోగం ఇవ్వడానికి అగ్రిమెంట్ చేయించడం జరిగిందన్నారు. డైరెక్టర్ స్థాయిలో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో మెడికల్ అన్ఫిట్ అయినా మైనింగ్ సూపర్‌వైజర్లను సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వడానికి ఒప్పుకుందని పేర్కొన్నారు. కాకపోతే మొన్న జరిగిన మెడికల్ బోర్డులో మైనింగ్ సూపర్‌వైజర్లను అన్ఫిట్ అయినప్పటికి వారికి జనరల్ అసిస్టెంట్లు ఇచ్చారని, వారికి కూడా సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వడానికి కంపెనీ ఒప్పుకుందని తెలిపారు. 2018 నుండి మెడికల్ అన్ఫిటై సర్ఫేస్‌లో జనరల్ అసిస్టెంట్‌గా చేస్తున్న వారికి కూడా సూటబుల్ జాబ్ ఇవ్వడానికి కంపెనీ ఒప్పుకున్నట్లు, వాటికి సంబంధించిన సర్కులర్లు త్వరలో వస్తాయని అన్నారు. సింగరేణికి రావాల్సిన రూ. 40 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం పైన ఇక్కడి ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తెచ్చి వెంటనే చెల్లించేలా చొరవ చూపాలని కోరారు. పెర్క్స్ అలవెన్సుల మీద ట్యాక్స్ చెల్లించే విధంగా, సొంత ఇంటి పథకం అమలు తదతర అంశాల పైన స్ట్రక్చర్ మీటింగ్‌లో య ఆజమాన్యం ఒప్పుకున్నట్లు, వాటి అమలుకు చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే శ్రీరాంపూర్‌లో ఎవరైతే కంపెనీ క్వార్టర్లలో నివసిస్తున్నారో వద్దనుకుంటే కంపెనీ వాపస్ తీసుకుంటుందని, వారికి క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ కూడా ఇస్తుందని పేర్కొన్నారు. దానికి సంబంధించిన సర్క్యులర్ త్వరలో రాబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరి ఎస్కె బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరి మోత్కూరి కొమరయ్య ,జిఎం చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, ఫిట్ సెక్రటరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరి సాయిరాజ్, మీడియా ఇన్చార్జి రాజ్ కుమార్, నాయకులు రమేష్, లచ్చయ్య, నారాయణ, ఓదేలు, మావో ఎలక్ట్రీషన్ ప్రభాకర్, రవి పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## సత్వర న్యాయంలో భాగంగా కేసులు త్వరగా పరిష్కరించాలి

ప్రజాపక్షం / జనగామ : సత్వర న్యాయంలో భాగంగా కేసులను త్వరగా పరిష్కరించేందుకు న్యాయవాదులు సహకరించాలని హై కోర్టు జడ్జి, జనగామ పోర్టు ఫోలియో జడ్జి జూకంటి అనిల్‌కుమార్ అన్నారు. శనివారం జనగామ జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటిన్, జిరాక్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిపరంగా ఎదురయ్యే సవాళ్లని ఎదుర్కొనే క్రమంలో కలిగే ఒత్తిడిని కోర్టు ఆవరణలో వదలిపెట్టి ఇంటికి ప్రశాంతమైన మనసుతో వెళ్లాలని న్యాయవాదులను సూచించారు. బార్‌బెంచ్ సమన్వయంతో పనిచేస్తే కేసులు త్వరగా పరిష్కారం అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రతిమ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్, సుచరిత, జూనియర్ సివిల్ జడ్జి శశి, బార్ అసోషియేషన్ అధ్యక్షులు దండబోయిన హరిప్రసాద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ప్రసాదరావు, జూన్‌రెడ్డి శ్రీరాం, పానుగంటి శ్రీనివాస్, డిజిన్స్ న్యాయవాదులు మంచాల రవీందర్, కోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదుల పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలి :ఎమ్మెల్యే కడియం



ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్: ప్యాకేజీ 6 ద్వారా నాలుగు నియోజకవర్గాల్లో 78వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా 3వ దశ 6వ ప్యాకేజీలో సవరించిన పనులను ఆమోదించి పనులను వెంటనే చేపట్టాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రితో ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ.. దేవాదుల 3వ దశ 6వ ప్యాకేజీ ద్వారా చేపట్టే పనులతో స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, పాలకుర్తి, తుంగతుర్తి నియోజకవర్గాల్లో దాదాపు 78 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందన్నారు. కాని వివిధ కారణాల వల్ల పనుల్లో జాప్యం జరగడంతో ఈ ప్రాంతాలకు సాగు నీరు అందడంలేదన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టులోని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే ప్రాజెక్టుగా దేవాదుల ప్రాజెక్టును గుర్తించి 6వ ప్యాకేజీ పనులను తక్షణమే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పుగల్ రిజర్వాయర్ నుంచి ప్రారంభమయ్యే ఈ పనుల దంస చెరువు, జఫర్‌గఢ్ పెద్ద చెరువును నింపడంతోపాటు జఫర్‌గఢ్ మండలంలో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. జఫర్‌గఢ్‌తోపాటు పాలకుర్తి నియోజకవర్గంలో సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. వీటితోపాటు నెల్లుట్ల చెక్‌డ్యాం, లోతు వాగుపైన ఆనకట్ట, ధర్మసాగర్ సౌత్ మెయిన్ కెనాల్‌లో పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో కుంటుపడిన పరకాల అభివృద్ధి


పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ప్రజాపక్షం/పరకాల : గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పరకాల పట్టణ అభివృద్ధి కుంటుపడిందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పరకాల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. 19వ వార్డు పరిధిలోని పాత సిఎంఎస్ గోదాం వద్ద, 14 వ వార్డు పరిధిలోని పాత మసీద్ వాడ, గండ్ర వాడలో జరుగుతున్న డ్రైనేజీ పనులను అధికారులతో కలిసి పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల పట్టణం ముంపుకు గురి కాకుండా ప్రణాళికాబద్ధంగా అంచెలవారీగా నగరాన్ని తలపించేలా సుందరీకరణ చేసి అభివృద్ధి చేస్తానని అందుకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని, ఒక ప్రణాళిక ప్రకారం మున్సిపాలిటీలో శానిటేషన్ వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి వ్యవస్థ ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.వర్షాలకు వచ్చే వరదకు అనుకూలంగా ప్రధానంగా నూతన డ్రైనేజీ పనులను ప్రారంభించామన్నారు.సుమారు 24 కోట్లతో పరకాల పట్టణ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, అభివృద్ధి పనులతో పట్టణ ప్రజలకు తాత్కాలికంగా ఇబ్బందులు కలగొచ్చు గాని, భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అమృత పథకం కింద మంచినీటి వ్యవస్థ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరకాల పట్టణం వరద ముంపు నుంచి కాపాడేందుకు తీసుకోవల్సిన చర్యలతో నివేదిక రూపొందించామన్నారు.విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

## దశాబ్ద కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ ప్రభుత్వం

బొద్దుగొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి కృష్ణ



ప్రజాపక్షం/గూడూరు:పది సంవత్సరాల పాలనలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండోవ సంవత్సరంలోనే మన బొద్దుగొండ గ్రామంలో 250 మందికి నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగిందని బొద్దుగొండ కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బండి కృష్ణ అన్నారు.శనివారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని బొద్దుగొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ ఖాదర్‌హుస్సేన్ వెంకన్న శ్రీకాంత్ రాములు వినయ్ బద్రి వీరస్వామి రమేష్ బిక్షం దినేష్ వెంకటేష్ కలిసి లబ్దిదారులకు ఈసం అవ్వ రాజిత పాటు కోతి మండికి రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణం చూశారని చెప్పారు. మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ సహకారంతో బొద్దుగొండ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు.మన ఎమ్మెల్యే దృష్టికి సమస్యలను తీసుకుపోయి గ్రామాన్ని అభివృద్ధిలో ముందుంచుతామని అన్నారు.స్థానిక సంస్థ ఎన్నికల్లో బొద్దుగొండ గ్రామాన్ని మండలంలో ముందంజంలో ఉంటుందని అన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు: కలెక్టర్

ప్రజాపక్షం/జనగామ టౌన్: ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం పట్టణంలోని సుదర్శన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ ఆకస్మిక తనిఖీ చేసి స్టాక్ వివరాలను, ఇప్పటివరకు జరిగిన అమ్మకం వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ మాట్లాడుతూ యూరియా విషయంలో రైతులకు ఇబ్బంది కలిగించవద్దని, జిల్లాలో సాగుకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. రైతులకు ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



ప్రజాపక్షం/ హనుమకొండ : హాస్టల్స్ విద్యార్థులకు నాణ్యమైన, మెనూ ప్రకారం భోజనం అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శనివారం హనుమకొండ గాంధీనగర్ టీవీటవర్ సమీపంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహం (బి), హనుమకొండ బాలసముద్రంలోని బాలికల కళాశాల వసతి గృహం (ఏ)ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాలకు సంబంధించిన వివిధ రకాల రిజిస్టర్లను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య, వారి హాజరు శాతం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ లలో ఉన్న కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులను పరిశీలించారు. విద్యార్థులకు ఏయే రోజులలో ఆహార పదార్థాలను అందించాలని తెలియజేసే మెనూ చార్ట్‌ను కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహ కార్యాలయాలు, కిచెన్, స్టోర్ రూమ్ లను పరిశీలించిన కలెక్టర్ డైనింగ్ హాలులో విద్యార్థుల కోసం వండిన భోజన పదార్థాలను కలెక్టర్ తనిఖీ చేశారు. వసతి గృహాలకు సంబంధించిన వివరాలను సంబంధిత హాస్టల్ వార్డెన్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, తాజా కూరగాయలనే వంటలలో వినియోగించాలన్నారు. హాస్టల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరును అందించాలన్నారు. మెడికల్ క్యాంపులు నిర్వహించినప్పుడు విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను నమోదు చేయాలన్నారు. హాస్టల్స్‌లో రోజు అటెండెన్స్ తో పాటు వివిధ రికార్డుల నిర్వహణ తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ సం దర్భంగా ఎస్‌సి వెల్ఫేర్ డిడి నిర్మల, ఎఎస్ డ బ్ల్యుఒ కృష్ణ, వార్డెన్లు రవికుమార్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కష్టజీవుల కోసమే కమ్యూనిస్టు పార్టీ



ప్రజాపక్షం/ములుగు: కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందే కష్టజీవుల కోసమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజద్ పాషాలు అన్నారు. శనివారం ములుగు మార్కెట్ యార్డులో హమాలీ కార్మికుల సమావేశం ఏర్పాటు చేసి మహాసభ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజద్ పాషలు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందే కష్టజీవుల కోసం అన్నారు. అందులో భాగంగా ఈ నెల 5వ తేదీన ములుగు జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మహాసభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఎంఎల్‌ఏ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపెల్లి శ్రీనివాసరావులు హాజరవుతున్నందున అన్ని రంగాల కార్మికులు, కర్షకులు, విద్యార్థులు స్కీం వర్కర్స్, కాంట్రాక్ట్ శానిటేషన్ సెక్యూరిటీ పేషెంట్ కేర్ సిబ్బంది, స్కావెంజర్లు భవన నిర్మాణ కార్మికులు ఉద్యోగులు మహిళలు ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మొలుగూరి రాంబాబు, యాటల పైడి, రమేష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె నోటీసు



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, ఎఐటిటియుసి హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 6,7 తేదీలలో జిల్లా కేంద్రాలలో నిరాహార దీక్షలు, సెప్టెంబర్ 1నుండి నిరవధిక సమ్మెకు సమ్మె నోటీసును జిల్లా విద్యా శాఖ అధికారికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కురాజు గౌడ్, రాష్ట్ర నాయకులు ధర్మల రాంమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలను వెంటనే మంజూరు చేయాలని, అల్పాహారం సంబంధిత పెండింగ్ బిల్లులను తక్షణం క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. అదనంగా, కార్మికులు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వెంటనే 10,000 రూపాయల వేతనం చెల్లించాలని, నిత్యావసర వస్తువులైన గ్యాస్, కోడిగుడ్లు, బియ్యం వంటివి ప్రభుత్వమే సరఫరా చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు 12 నెలల వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, బడ్జెట్‌ను విడుదల చేసి కార్మికుల ఖాతాలలో జమ చేయాలని, పని భద్రత కల్పించాలని, ప్రభుత్వ గుర్తింపు కార్డులు, డ్రెస్ కోడ్ ఆర్డర్‌లు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

## 'ఓసి' క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి డిమాండ్



ప్రజాక్షం/మహబూబాబాద్: అడ్వకేట్స్ జేఏసీ లెక్చరర్స్ ఫోరం చివరి రోజు రిలే నిరాహార దీక్ష ను ప్రారంభించి ప్రసంగిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఓసి క్లబ్ ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గత 3 మూడు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు చివరి రోజు సిపిఐ జిల్లా కార్యదర్శి ప్రారంభించి అనంతరం బి విజయ సారథి మాట్లాడుతూ ఓసి క్లబ్ ప్రభుత్వం సాధించుకునేంత వరకు సిపిఐ పోరాటం ఆగదన్నారు ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి పెంచేందుకే ఆగస్టు 4న సిపిఐ చలో కలెక్టరేట్ ముట్టడిని చేస్తున్నామని తెలిపారు ఈ కలెక్టరేట్ ముట్టడికి వందలాదిగా సిపిఐ శ్రేణులు ఈ ప్రాం త ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు మానుకోట ఎమ్మెల్యే మురళి నాయక్ ఎంపీ బలరాం నాయక్ చొరవచూపి ప్రభుత్వంతో మాట్లాడి క్లబ్ ను స్వాదినం చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు జిల్లా కలెక్టర్ దృష్టికి గతంలో తీసుకువెళ్లామని ఇప్పటికైనా కలెక్టర్ గారు అధికారులు ఓసి క్లబ్ ను స్వాధీనం చేసుకోవాలని తెలిపారు స్వాధీనం చేసుకొని బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని ఈ ప్రాంతంలో ప్రజలు కోరుకుంటున్నారన్నారు ఎడ్యుకేషనల్ హబ్ కళాక్షేత్రం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఇలాంటి యువతి యువకులకు ఉపయోగపడే రీతిన క్రీడాకారులకు ఉపయోగపడే రీతిన స్వాధీనం చేసుకొని నిర్మించాలని తెలిపారు ఈ సందర్భంగా రిలే దీక్షలకు మద్దతు తెలిపిన కన్జ్యూమర్ ఫోరం నాయకుడు మైస శ్రీనివాస్ అడ్వకేట్స్ జేఏసీ నాయకుడు మామిడాల సత్యనారాయణ లెక్చరర్స్ ఫోరం నాయకుడు నీలం వెంకటేశ్వర్లు మా ట్లాడుతూ సిపిఐ చేసే పోరాటాలు ప్రజల కోసమే అన్నారు ఈ ప్రాంతంలో ప్రజల కోసం కొట్లాడేది సిపిఐ నే అన్నారు సిపిఐ చలో కలెక్టరేట్ ముట్టడికి తమ మద్దతు తెలిపి పాల్గొంటామని తెలిపారు బి. అజయ్ సారథి రెడ్డి నేతృత్వంలో ఈ ప్రాంతంలో ఉద్యమాలు ఉధృతంగా చేస్తున్నరన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి టి పి టి ఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు కన్జ్యూమర్స్ ఫోరం నాయకుడు మైస శ్రీనివాస్ లెక్చరర్స్ ఫోరం నాయకుడు నీలం వెంకటేశ్వర్లు అడ్వకేట్ సంఘం నాయకుడు మామిడాల సత్యనారాయణ పెరుగు కుమార్ రేశ పల్లి నవీన్ చింతకుంట్ల వెంకన్న మామిళ్ల సాంబలక్ష్మి వీరవెల్లి రవి నర్రా శ్రావణ్ మంద శంకర్ పురం భాగ్య లక్ష్మి బేతమల్ల శ్రీనివాస్ తండా శ్రీనాథ్ భీమరాజు వెంకన్న మంద శ్రీను ఎం డి రఫీ ఏ్రోజు పద్మ మిర్యాల మల్లికార్జున్ సుభద్ర రాజు గాదం శ్యాంప్రసాద్ యాదవ్ డి రమేష్ పుల్లకండం రమేష్‌భాష మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడిపై రైతులకు అవగాహన

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/ వరంగల్ : పంట మార్పిడిపై రైతులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన ఏరువాక రైతు బడి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వ్యవసాయ శాఖ డైరెక్టర్ అనురాధ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాసరావులు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీఎం నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుండి వర్చువల్ గా నిర్వహించిన పిఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏరువాక రైతు బడి అనే కార్యక్రమాన్ని ప్రయోగాత్మక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రైతును రాజు చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, దీనిని రైతులందరూ వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి, అధిక దిగుబడి సాధించాలని కలెక్టర్ రైతులకు సూచించారు. జిల్లాలో సన్న బియ్యం పంటతో పాటు కూరగాయలు, పందిరి సాగు మొక్కలు, కంది, పెసర, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు కూడా అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ విధి విధానాలను వ్యవసాయ క్షేత్రస్థాయి అధికారులు, వ్యవసాయ శాస్త్రజ్ఞులతో పంటలపై అవగాహన కల్పిస్తూ ప్రోత్సాహం కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లా వ్యవసాయ శాఖ డైరెక్టర్ అనురాధ మాట్లాడుతూ పంటల ఆరోగ్య దీపిక కార్డులను తయారు చేసి ఎరువుల వివరాలను పొందుపరిచే విధంగా తయారుచేసి రైతుల అవగాహన కల్పించడంలో రైతులు హర్షం వ్యక్తం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ రైతుల కొరకు జిల్లా కలెక్టర్ పంట ఆరోగ్య దీపిక కార్డులు అందించడం పట్ల కరతాల ధ్వనులతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అనురాధ, హార్టికల్చర్ అధికారి శ్రీనివాసరావు, మండల స్పెషల్ ఆఫీసర్ మరియు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, సైంటిస్టులు రైతులు పాల్గొన్నారు. అనంతరం ఎనుమాములలోని అక్షయపాత్ర బోజన తయారి యూ నిట్ ను సందర్శించి బోజన తయారి విధానాన్ని పరిశీలించారు. హైజినిక్ క్వాలిటీ భోజనం తయారు చేసే విధానాన్ని కలెక్టర్ నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు.

## దేవాదుల ప్రాజెక్టు భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి

మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ జాయింట్ సెక్రటరీ పడంలాల్ నెగి



ప్రజాపక్షం /జనగామ :దేవాదులకు సంబందించిన భూ సేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని మినిస్ట్రీ ఆఫ్ సవిల్ ఏవియేషన్ జాయింట్ సెక్రటరీ పడంలాల్ నెగి అన్నారు. ఢిల్లీ నుండి వచ్చిన పడం లాల్ నెగి శనివారం దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతిపై కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో 2.56లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో దేవాదుల ప్రాజెక్టు పనులు ప్రారంభించగా 85 శాతం పూర్తి అయ్యాయని వివరొంచారు. త్వరగా వాటిని పూర్తి చేస్తామన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ జాయింట్ సెక్రటరీ పడంలాల్ నెగి మాట్లాడుతూ మూడు విడతల్లో చేపట్టిన ఏడు ప్యాకేజీలకు సంబందించిన పనులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికీ అప్పుడు పర్యవేక్షిస్తూ పూర్తి చేయాలన్నారు. భూ సేకరణ పూర్తి చేయడం ద్వారానే ప్రాజెక్టు పనులు పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. మొదటగా భూ సేకరణ పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిడబ్ల్యూసి డైరెక్టర్ శ్రీనివాస్, కేంద్ర జలవనరుల సైంటిస్టు గౌతం, ఇరిగేషన్ ఎస్‌ఈ సుధీర్, ఈఈ ప్రవీణ్, వినయ్ బాబు, మంగ్లీలాల్, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల 'డే కేర్ సెంటర్' ప్రారంభం



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్ నాయిని రాజేందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి వృద్ధులతో సంభాషించిన ఆయన, తరువాత తలసీమియా పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. తొలుత ఎమ్మెల్యేకు రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు ఘన స్వాగతం పలికారు. పూలమొక్క అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ మాట్లాడుతూ, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచితంగా డాక్టర్ల సేవలు, చెస్, క్యారమ్ వంటి ఆటల సౌకర్యం అందిస్తామన్నారు. వృద్ధులు సమయం విలువైనదిగా గడిపే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 37 డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో హనుమకొండలో రాష్ట్రంలో మొట్టమొదటిగా ఈ సెంటర్ ప్రారంభమవడం గర్వకారణమని తెలిపారు. రెడ్ క్రాస్ రక్తదానం, ఇతర సేవలకు రాష్ట్రంలో తొలి స్థానంలో నిలుస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ పాలకవర్గాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డా క్టర్ పి. విజయచందర్ రెడ్డి (చైర్మన్), బొమ్మినేని పాపిరెడ్డి (కోశాధికారి), ఈ.వి శ్రీనివాస్ రావు (రాష్ట్ర పాలకవర్గ సభ్యులు), జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డాక్టర్ ఎం. శేషుమాధవ్, బిళ్ల రమణ రెడ్డి, మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి జె. జయంతి, డిఆర్‌డిఓ పీడియం శ్రీను, హనుమకొండ డిఎం అండ్ హెచ్‌ఒ ఎ. అప్పయ్య, కేయూ ఈసీ సభ్యులు కె. అనితా రెడ్డి, వృద్ధులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం :యశస్వినిరెడ్డి



ప్రజాపక్షం/రాయపర్తి: రైతులకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం రాయపర్తిలో ఆపరేషన్, మెయింటెనెన్స్ నిధుల నుంచి సుమారు రూ. 8 లక్షలతో డిబిఎం 55 కెనాల్ పూడికతీత పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, రైతును రాజు చేయడమే లక్ష్యమన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతుకలు రూ. 2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా ప్రతీ ఎకరాకు సాగునీరు అందుతుందన్నారు. డిబిఎం కెనాల్ మరమ్మతుతో సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ కిరణ్‌కుమార్, తహసీల్దారు శ్రీనివాస్, ఎఇలు బాలరాజు, అమర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండలాధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, కృష్ణమాచార్యులు, ఆకుల సురేందర్‌రావు, మాచర్ల ప్రభాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, ఎండి నయీం, మందాటి సుదర్శన్‌రెడ్డి, ఎండి అఫ్రోజ్, మచ్చ రమేశ్, గుగులోతు యాకూబ్, పిరని ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ రోడ్డును పరిశీలించిన మున్సిపల్ కమిషనర్




ప్రజాపక్షం/మహబూబాబాద్ : మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 36వ వార్డు లోగల చెవుల ప్రభాకర్ సర్వీస్ సెంటర్ వద్ద గతంలో పెండింగ్లో ఉన్న సీసీ డ్రైనేజీ పనులు, రోడ్డు పనులను నేడు మున్సిపల్ కమిషనర్ రాజేష్వర్ రావు, డిఇ ఉపేందర్, ఎఇలతో కలిసి సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బి అజయ్ సారధి రెడ్డి మున్సిపల్ అధికారులను రోడ్డు సమస్యలు వెంటనే పూర్తి చేయాలని ముఖ్యంగా ఈ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉన్నదని వర్షం పడిన నేపథ్యంలో ఇక్కడ మీరు ఎక్కువగా నిలిచి ఉంటుందని ఈ సమస్యను కూడా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజేశ్వరరావు గారు త్వరలోనే రోడ్డు డ్రైనేజీ సమస్యలను పూర్తి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సందీప్ శ్రీనివాస్ ,వర్క్ ఇన్స్పెక్టర్ కాగితపు శ్రీను, పెరుగు కుమార్, దేశ పల్లి, నవీన్ చింతకుంట్ల వెంకన్న, గాదం శ్యాం ప్రసాద్ యాదవ్, మంద శంకర్, డి రమేష్, వంగూరి నాగేంద్రబాబు, గుండ్రోజు రమేష్ పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నీట మునిగిన పంట పొలాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో తాము నష్టపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బేతుపల్లి గ్రామ రైతులు. పంట కాలవల్లో షిల్టు తీయకపోవడంతో నీరు పొంగి ప్రవహించి మెరకనున్న తమ పొలాలు నెలలో రెండు సార్లు మునిగిపోయాయని, పరిస్థితి ఇలానే ఉంటే పంట మురిగి పోయే అవకాశం ఉందని దీనంతటికి కారణం నీటిపారుదల శాఖాధికారుల నిర్లక్ష్యమేనని మండిపడుతున్నారు. బేతుపల్లి కుడి కాలువకు అధికారులు శనివారం నీటిని విడుదల చేయగా, నీరు ప్రవహించటానికి సరైన దిశ లేకపోవటంతో సాగునీరంతా పంట పొలాలను ముంచెత్తింది.ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలో షిల్ట్ తీసి సాగు నీరు సక్రమంగా పంట పొలాలకు అందేల చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పంట పొలాలు నీటి మునిగిన విషయంపై వివరణ కోరేందుకు ఐబి డిఇని చరవాణిలో సంప్రదించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

## నేడు ఖమ్మంలో భట్టి, పొంగులేటి పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి బయలుదేరి ఉదయం ముదిగొండ మండలం కమలాపురం గ్రామం చేరుకుంటారు. అధికారులు, అనాధికారులతో సమావేశమవుతారు. రూ. 10 కోట్లతో నిర్మించే గోడౌన్ నిర్మాణానికి భట్టివిక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి బయలు దేరి పెద్దమండవ గ్రామంలో రూ. 58.50 లక్షలతో నిర్మించే సిసి రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి వల్లభి గ్రామంలో రూ. 41.50 లక్షలతో నిర్మించే సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకుంటారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని శ్రీనివాస నగర్, వి. వెంకటాయపాలెం, వేంసూరు మండలం అడసర్లపాడు, సత్తుపల్లి తదితర గ్రా మాల్లో జరిగే ప్రైవేటు కార్యక్రమాలకు హాజరవుతారు. ఉదయం టిసివి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే ఉద్యోగుల సమ్మేళనానికి హాజరవుతారు. సాయంత్రం తిరుమలాయపాలెం గ్రామ ంలో తిరుమలాయపాలెం నుంచి పిండిప్రోలు వెళ్లే దారికి శంకుస్థాపన చేయనున్నారు. ఎదుళ్లచెరువు వెళ్లే రోడ్డుకు శంకుస్థాపన చేసిన అనంతరం కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నారు. కొక్కిరేణి ( మంలో తిరుమలాయపాలెం, పోచారం మధ్య కల్వర్టుకు శంకుస్థాపన చేయనున్నారు.

## బాలల సదనం పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బాలల సదనంలో ఉన్న పి ల్లలందరికీ జిల్లా క లెక్టర్ అ నుదీప్ దురిశెట్టి ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. శ నివారం బా లల సదనాన్ని స ందర్శించిన ఆయన వాలీబాల్, షటిల్ కోర్టులను పరిశీలించారు. ఈ సందర్భ ంగా పలు సూచనలు చేశారు. బాలల సదనంలో ఉన్న పి ల్లలు జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పిల్లల దత్తత కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ దత్తత ఇవ్వాలని ఆయన సూచించారు. ఓ చిన్నారి పుట్టిన రోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, సిడబ్ల్యుసి చైర్మన్ , జిల్లా సం క్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, సిడిపిఒ విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం ఎర్రుపాలెం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ములుగుమాడు రి సర్వే ప్రక్రి య రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల స్థితిగతులు, భూ భారతి పోర్టల్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులపై నోటీసులు జారీ చేసి చట్టం నిబంధనల ప్రకారం పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం మండల తహసీల్దార్ ఉషాశారద, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## షాదీఖానా పూర్తి చేయండి : ఇన్సాఫ్‌నేత ఎస్‌కె సైదా



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో సీక్వెల్ వద్ద ప్రారంభించిన షాదీ ఖానాను సత్వరం పూర్తి చేయాలని ఇన్సాఫ్ నాయకులు ఎస్‌కె సైదా డిమాండ్ చేశారు. షాదీఖానా నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. ముస్లిం యువతకు రాజీవ్ వికాస్ పథకంలో 50 శాతం మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ఆ హామీని నిలబెట్టుకోలేదని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లలో పేద ముస్లింలకు ప్రాధాన్యతనివ్వాలని కబరస్తాన్‌లకు నిధులు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్‌కె యాకూబ్, జాని, అజ్జు, అక్బర్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో బిసి హాస్టల్..!



**ప్రజాపక్షం/పెనుబల్లి:** గత రెండు ఏళ్ళుగా వీ యం బంజర లోని బిసి హాస్టల్ నిర్వాహణలో లే దు. హాస్టల్ భవనం పేరుకు మాత్రమే ఉంది. హాస్టల్ లో 40 మంది వి ద్యార్థులు ఉన్నారు. కొ న్నాళ్ళ పాటు ఆ విద్యార్థులను పక్కనే ఉన్న యస్ సి హాస్టల్ లో సర్దుబాటు చేశారు. రెండు హాస్టల్ కు ఒకే వార్డెన్ ఉన్నారు. ఇటీవల బిసి హాస్టల్ కు వార్డెన్ ను నియమించారు. అప్పటి నుండి విద్యార్థులకు వంట, భోజనం యస్ సి హాస్టల్ లో ఏర్పాటు చేస్తున్నారు. స్టడీ హావర్ పక్క హాస్టల్ లో జరుగుతుంది. రాత్రి బస మాత్రం పక్కనే ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో గడుపుతున్నారు. బాత్రూంలు ఉమ్మడిగా వినియోగిస్తున్నారు. యస్ సి హాస్టల్ లో 130 మంది విద్యార్థులు ఉన్నారు. బిసి హాస్టల్ భవనం శిదిలావస్థలో ఉండటం తో విద్యార్థులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు కల్పించుకుని. పక్క భవనం నిర్మించాలని కోరుతున్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు యూనిఫాం పంపిణీ

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సింగరేణి కొత్తగూడెం కార్పొరేటర్ పరిధిలో సివిల్ డిపార్ట్మెంట్ హౌస్ కీపింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు యూనిఫామ్ దుస్తులను కాంట్రాక్టర్, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నాయకులు పంపిణీ చేశారు. శనివారం పాత ప్రాజెక్టు ప్లానింగ్ ఆఫీస్ వద్ద సివిల్ డిపార్ట్మెంట్ పరిధిలో హౌస్ కీపింగ్ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సివిల్ కాంట్రాక్టర్ శ్రీనివాస్ ఎఐటియుసికాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కొత్తగూడెం రీజియన్ నాయకులు యర్రగాని కృష్ణయ్య, ప్రవీణ్ చేతుల మీదుగా కాంట్రాక్ట్ కార్మికులకు యూనిఫామ్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ. పర్మినెంట్ కార్మికులతో పాటుగా సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మరియు పర్మినెంట్ కార్మికులకు వ్యత్యాసం లేకుండా యూనిఫామ్స్ ఇచ్చినప్పటికీ సౌకర్యాలను కూడా అదే విధంగా కల్పించాలని కోరారు.సూపర్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో ఆకలి కేకలు

పట్టించుకోని అధికార యంత్రాంగం

ఆకలి అంటే టిసి ఇస్తానంటున్న వార్డెన్

చీపురుగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు

ఎఐఎస్ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి సరైన పర్యవేక్షణ లేకపోవడం అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మానవత్వాన్ని మరిచి మేము పెట్టిందే తినాలి కాదు కూడదు అంటే టిసి ఇచ్చి పంపిస్తానంటూ బెదిరిస్తున్నారు. విద్యార్థులు అర్ధాకలితో అలమటించడంతో పాటు దోమల బెడద, వసతులు లేక అనారోగ్యం పాలవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం చీపురుగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల బాధలు వర్ణణాతీతం. ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులకు సరైన తిండి పెట్టకుండా హింసిస్తున్నారు. మెనూ ప్రకారం ఒక్క రోజు కూడా విద్యార్థులకు ఆహారం అందించ లేదని ఇక సాంబారుతోనే కడుపునింపుకోవాల్సిన పరిస్థితివచ్చిందని అది కూడా సరిగ్గా ఉండడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 10 గంటలైనా విద్యార్థులకు టిఫిన్ పెట్టకపోవడంతో చదువు మాని విద్యార్థులు కంచాలు పట్టుకుని ఆశ్రమ పాఠశాలలో తిరుగుతున్నారు. ప్రధానోపాధ్యాయురాలు వంట



సిబ్బందికి ఆహార పదార్థాలు అందించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అన్నం నోట్లో పెట్టుకునే పరిస్థితి లేదని విద్యార్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పాఠశాల ప్రారంభంనుంచి ఇంత వరకు కోడిగుడ్డు పెట్టలేదని ఆరోపించారు. మౌలిక వసతులకు సంబంధించి విద్యార్థులు నిద్రించే గదుల్లో ఫ్యాన్లు లేక దోమలు కుట్టి జ్వరాల భారీన పడుతున్నారు. జ్వరాల బారీన పడ్డ విద్యార్థులకుసైతం వైద్య సాయం అందించడం లేదన్నారు. ఆహారం గురించి, మౌలిక వసతుల గురించి ప్రశ్నిస్తే టిసి ఇచ్చి పంపిస్తానంటూ ప్రధానోపాధ్యాయురాలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా విద్యార్థి సంఘాలు ఆశ్రమ పాఠశాలలను సందర్శించాయి. ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేకనే ప్రధానోపాధ్యాయురాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థుల కడుపు మాడుస్తుందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆరోపించింది. చీపురుగూడెం ఆశ్రమ పాఠశాలపై పూర్తి విచారణ జరిపించాలని ఐటిడిఏ పివో స్పందించి ప్రధానోపాధ్యాయురాలిపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్‌నాయకులుబత్తుల సాయి డిమాండ్ చేశారు.

## సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/అశ్వారావు–పేట :** అశ్వారావుపేట పట్టణంలోని ఖమ్మం నుండి దేవరపల్లి హైవే రోడ్డులో రూ.10కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులకు శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఇరువైపులా 8.7 5మీటర్ల వెడల్పు విస్తరణ బిటి రోడ్డుతో పాటు సెంట్రల్ లైటింగ్ డ్రైనేజి డివైడర్లు పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుఉతూ పట్టణాన్ని సందరీకరణ చేసే దానిలో భాగంగా రూ.10కోట్ల నిధులను మంజూరు చేయిచడం జరిగిందని, నూతనంగా ఏర్పడ్డ నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట మున్సిపాల్టీకి అన్ని హంగులతో కూడిన అభివృద్ధిని చేపడుతామని అన్నారు. ఆ దిశగా ఇప్పటికే డ్రైనేజి పనులు పూర్తి చేసుకుని బిటి రోడ్డు ప్రారంభించినట్లు తెలిపారు.కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, లింగిశెట్టి వెంకటేశ్వర్లు, సుంకవల్లి వీరభద్రరావు, అప్పలరాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## కదిలిన ప్రభుత్వ యంత్రాంగం




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** తిరుమలాయపాలెం మండలంలో డెంగీ ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపక్షం దినపత్రికలో శనివారం ప్రచురితమైన విజృంభిస్తున్న విషజ్వరాలు అనే కథనానికి ప్రభుత్వ యంత్రాంగం క దిలివచ్చింది. మండల పరిధిలోని అజ్మీ ర్ తండా గ్రామ పంచాయతీని ఆమె ఆకస్మికంగా శనివార ం తని ఖీ చేశారు. గ్రామంలో డెంగీకేసులు నమోదుపై వివరాలు అడిగి తె లుసుకున్నారు. అనంత రం గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని పరిశీలించి వైద్యులతో మా ట్లాడి ప్రజలకు మెరుగైన వైద్య స దుపాయాలు అందించాలని తెలిపారు. ముందుగా జర్వపీడితులను గుర్తించి రక్తనమూనాలు సేకరించి పరీక్షించిన అనంతరం వైద్య సేవ లు అందించాలని ఆమె తెలిపారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయ ంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉం టూ సమయాపాలన పాటించి ఉదయం నుంచి సాయంత్రంవరకు ఖచ్చితంగా పం యతీ కార్యాలయంలో ఉండాలని ఆమె తెలిపారు. మండ ల వ్యాప్తం గా అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు డెంగీ కేసులు నమోదవుతున్న తరుణంలో ప్రతిఒక్కరూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకుని గ్రామంలోని సైడ్ కాల్వలు, సిసి రోడ్లు, మంచినీటి సరఫరా ట్యా ంకులు, గేటు వాల్వ్‌లు పైపులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఇంటి ప న్నులు సకాలంలో వసూలు చేసి గ్రామ పంచాయతీ నందు జమ చేయాలని అన్నారు. ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్మెంట్‌లతో సిద్ధం చేయాలని ఆమె తెలిపారు. ప్రజాపక్షంలో ప్ర చురించిన వి జృంభిస్తున్న విషజ్వరాలు కథనానికి స్పందించిన మ ంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్ తిరుమలాయపాలెం మండలంలోని ప రిస్థితులపై ఆరా తీసి తగిన చర్యలు తీసుకోవాల ని అధికారులకు సూచించినట్లు తెలిసింది. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి టి. ంబాబు, ఎంపిడిఒ ఎస్‌కెసిలార్‌సాహెబ్, ఎంపి ఒ సూర్యనారాయణ, పంచాయతీ కా ర్యదర్శు లు,పంచాయతీ సిబ్బ ందితదితరులుపాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వమే నిర్వహించాలి

నిమ్మటూరి డిమాండ్




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు ఎఐటియుసి ఖమ్మం జిల్లా బిల్డింగ్ అండర్ కన్స్టక్షన్ వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ. శనివారం మండలం పరిధిలోని బి గంగారం, రామానగరం గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రామకృష్ణ హాజరై మాట్లాడుతూ 1996 కార్మిక చట్టాల ద్వారా సాధించుకున్న సంక్షేమ చట్టాన్ని ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని, తక్షణమే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే నిర్ణయాన్ని మానుకోవాలని కోరారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను కార్మికులకు ఖర్చు పెట్టాలని, వృధా ఖర్చులను తగ్గించి కార్మికుల సంక్షేమం కొరకు క్లెయిమ్స్ రేట్ పెంచాలని కోరారు. ప్రమాద బీమాను రూ. పది లక్షలకు పెంచాలని, సహజ మరణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, కార్మికుని కూతురు వివాహానికి రూ.లక్ష రూపాయలు, ప్రసూతి సహాయం రూ.లక్ష రూపాయల పెంచాలని, అలాగే 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు కనీస పింఛను రూ. 5వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల పిల్లల చదువు నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎఐటియుసి బిల్డింగ్ కన్స్టక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు, ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కెరహిమతు ల్లా, తాపీ వర్కర్స్ యూనియన్ నా యకులు , రామనగరం తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బసవతారకంలో జర్నలిస్టులకు వైద్య సేవలు

నామాకు టియుడబ్ల్యుజె (ఐజెయు) వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో జర్నలిస్టుల హెల్త్‌కార్డు చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు జర్నలిస్టులకు వీలైనంత మేర ఉచిత వైద్యం అందేలా చూడాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) ఆధ్వర్యంలో మాజీ ఎంపి బసవతారకం క్యాన్సర్ హాస్పటల్ ట్రస్టి నామా నాగేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ సంబంధిత వ్యాధుల బారిన జర్నలిస్టు కుటుంబాలు పడుతున్న నేపథ్యంలో వైద్య ఖర్చులు భరించడం ఇబ్బందికరంగా మారిందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించేలా చూడాలని జర్నలిస్టుల హెల్త్‌కార్డు చెల్లుబాటయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన నామ ఈ విషయమై క్యాన్సర్ ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడి జర్నలిస్టులకు బసవతారకం ఆసుపత్రి ద్వారా వీలైనంత మేర జర్నలిస్టు కుటుంబాలకు ఉచితంగా వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాటేటి వేణుగోపాల్, కౌన్సిల్ సభ్యుడు సామినేని మురారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు , యూనియన్ నేతలు, సొసైటీ అధ్యక్షుడుకనకం సైదులు, వివిధ పత్రికల బ్యూరోలు, యూనియన్ నేతలు ,నగర అధ్యక్షుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నామ పురుషోత్తం,నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## 13న క్విట్ ఇండియా పిలుపు



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఇటీవల కాలంలో అమెరికాదేశం 100దేశాల మీద విధించిన సుంకాలకు వ్యతిరేకంగా ఆగస్టు 13న ఎస్‌కెఎం ఆధ్వర్యంలో క్విట్ ఇండియా పిలుపు ఇస్తున్నట్లు అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పాలేరులో బీపీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాల మీద అమెరికా దేశం ముఖ్యంగా భారతదేశం మీద 25శాతం సుంకం విధించిందని, దీని వలన మన దేశం లక్షల కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతుందన్నారు. అందుకే ఆగస్టు 5 నుండి 13వ వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా దేశ అంతర్జాతీయ సుంకాలకు వ్యతిరేకంగా కలిసి వచ్చే శక్తులతో కలుపుకొని పోరాటం ఆగస్టు 13న జరిగే ట్విట్ ఇండియా డేను జయప్రదం చేయాలని తెలిపారు. అనంతరం ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు బిక్షపతి మాట్లాడుతూ రైతులకు వర్తించే పథకాలు అన్నిటిని కౌలు రైతులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో ఎఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గవిని ఐలయ్య, దేవిండ్ కుమార్, బజ్జూరి వెంకటరామిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యు డుబండారు ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిరసన ర్యాలీ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిరసన తెలపడాన్ని హక్కుగా భావించాలని పాలస్తీనా సంఘీభావ కమిటీ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. పాలస్తీనాలో పసిపిల్లలు, మహిళలు, సామాన్య పౌరులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆగస్టు ఏడున జరిగే నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ ఆగస్టు ఏడున ఉదయం పెవిలియన్ మైదానం నుంచి జెడ్‌పిసెంటర్ వరకు నిరసన ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని ఈ ర్యాలీలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయిల్ పాలస్తీనాలోని ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుందని చిన్నారులు, మహిళలు ఆకలితో మరణిస్తున్నారని ర్యాలీ నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే 18,500 మంది పిల్లలు మరణించినట్లు అనధికార లెక్కలు తెలుపుతున్నాయని ఇటువంటి అమానవీయ దాడులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేయడంతో పాటు పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించడం బాధ్యతగా భావించాలని వారు విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో సందేశాలతో కూడిన బ్యానర్లు, ప్లేకార్డులతో పాల్గొనాలని కోరారు. మీడియా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు కమర్తపు మురళి, మాస్‌లైన్ నాయకులు ఆవుల అశోక్, ఎన్డి నాయకులు కె. లక్ష్మినారాయణ, సిపిఎ నాయకులు, వివిధ సంఘాల నేతలు సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న మావోయిస్టు వారోత్సవాలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** మావోయిస్టు వారోత్సవాలు నేటితో ముగియనున్నాయి. జూలై 28 నుండి ఆగస్టు 03వ తేది వరకు అమరులను స్మరించుకుంటూ మావోయిస్టు పార్టీ వారోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో 24 పేజీల బుక్‌లెట్‌ను కేంద్ర కమిటీ పేరుతో మావోయిస్టు పార్టీ విడుదల చేసిన విషయం విధితమే. మావోయిస్టు ఉద్యమంలో మునుపెన్నడూ లేని విధంగా కేంద్రకమిటీ నుండి మొదలుకుని రాష్ట్ర, జిల్లా కమిటి నేతలతో పాటు, గ్రామ కమిటీలలో ఉన్న మావోయిస్టులు పెద్దఎత్తున ఎన్‌కౌంటర్లలో మృతి చెందారు. ఆపరేషన్ కగార్ పేరిట కేంద్రప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోని అడవులను జల్లెడ పడుతూ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఈ క్రమంలో మావోయి స్టు పార్టీకి వారోత్సవాల నిర్వహణ కత్తిమీద సాములా అయినప్పటికీ గ్రామగ్రామాన అమరులను స్మరించుకోవాలంటూ విడుదల చేసిన బుక్‌లెక్‌లెట్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా హై టెన్షన్ నెలకొంది.

**హై అలెర్ట్ :** మావోయిస్టు వారోత్సవాలు కొనసాగుతున్న వేళ సరిహద్దుల్లో హై టెన్షన్ నెలకొంది. తెలంగాణ,ఛత్తీస్‌గఢ్,ఆంధ్రప్రదేశ్,ఒడిస్సా, మహారాష్ట్రాల సరిహద్దులు పోలీసుల ఆధీనంలో ఉన్నాయి. 3వ తేదితో వారోత్సవాలు ముగుస్తున్నప్పటికీ ప్రతీకారంతో రగిలిపోతు న్న మావోయిస్టు పార్టీ విరుచుకుపడే ప్రమాదం ఉందని భావిస్తున్న బలగాలు కనురెప్పపాటున కూడా ఇబ్బంది జరగరాదనే తలంపుతో ముందుకు సాగుతున్నారు. అడవుల్లోని ప్రధాన రహదార్లపైకి వచ్చే కచ్చా దార్లలో కూడా నిఘా పెంచారు. వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేస్తూ అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. అటవీ రహదార్లలో రాత్రివేళ తిరిగే బస్సులను 3వ తేది వరకు నిలుపుదల చేశారు. భద్రాచలం నుండి చింతూరు వైపు వెళ్లే బస్సులను కూనవరం మీదుగా మళ్లించారు. ఏజెన్సీతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసులు గట్టి నిఘా పెట్టి విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.

**నిఘా :** లాడ్జీలు, సత్రాలపై పోలీసులు పెద్ద ఎత్తున దృష్టి సారించారు. ఎవరికిపడితే వారికి గదులు అద్దెకు ఇవ్వొద్దంటూ ఇప్పటికే సూచనలు చేశారు. అనుమానిత వ్య క్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలంటూ చెబుతున్నారు. అటవీ గ్రామాల్లో సైతం మావోయిస్టుల జాడ కోసం పోలీసులు ఆరాతీస్తున్నారని, బూజుపట్టిన సిద్ధాంతాలతో ఉన్న మావోయిస్టు పా ర్టీకి ఎవ్వరూ సహకరించరాదంటూ పోలీసులు చెబుతున్నారు. మీమీ కుటుంబాల్లో అడవిబాట పట్టిన వారు ఎవరైనా ఉంటే జనజీవన స్రవంతిలో కవలమని చెప్పాలని, లొంగిపోయిన వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం తరుపున పునరావాసాన్ని కల్పిస్తామని పోలీసులు చెబుతున్నారు. యువత చెడు తోవ పట్టవద్దని, చదువుకుని జీవితాలును సుఖమయం చేసుకోవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ సూచిస్తున్నారు.మావోయిస్టు వారోత్సవాలు నేటితో ముగుస్తున్న వేళ ఎలాంటి చెదురుమదురు సంఘటనలు కూడా చోటు చేసుకోక పోవడంతో పోలీసులు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్నారు.

## కష్టపడిన వారికి తగిన ప్రాధాన్యం

కాంగ్రెస్ సమావేశంలో గంటా వినయ్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం నిరంతరం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ నిర్వాహకుడు గంటా వినయ్ నాయుడు తెలిపారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం గంటా వినయ్ నాయుడు, రాష్ట్ర సమన్వయకర్త మహ్మద్ జావిద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కొత్త తరాన్ని నాయకులుగా తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో సభలు, సమావేశాలు నిర్వహించి కొత్త వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. రాజీవ్ గాం ధీ యువతకు ప్రాధాన్యత నిచ్చారని 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని ఈ సందర్భంగా రాజీవ్ సేవలను గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగండ్ల దీపక్ చౌదరి, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా,పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రీల్



## అభిమానుల కళ్ళల్లో .. ఆనందం కోసమే కింగ్డమ్

**మీడియా 'చిట్‌చాట్'లో విజయ్ దేవరకొండ**

తెలుగు తెరపై వచ్చే భారీ బడ్జెట్ సినిమాలు ఇప్పుడు అన్ని పాన్ ఇండియా సినిమాలే. స్టార్ హీరోలు ఎవరు చేసిన పాన్ ఇండియా లెవల్లో రిలీజ్ చేస్తున్నారు. కథలను కూడా అదే స్థాయిలో ఎంపిక చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల విడుదలైన మరో తెలుగు పాన్ ఇండియా చిత్రం 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్డమ్' చిత్రం విడుదలై సక్సెస్ ఫుల్గా నడుస్తోంది. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ మీడియాతో చిట్ చాట్ చేశారు.

*** 'కింగ్డమ్' సినిమాకి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ఏమనిపిస్తుంది?**
చాలా చాలా సంతోషంగా ఉంది. కేవలం తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల్లో మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలలో, ఓవర్సీస్‌లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మలయాళంలో ఈ స్థాయి స్పందన ఊహించలేదు. మలయాళ వెర్షన్ విడుదల చేయడంలో అక్కడి ప్రేక్షకుల ఇంతటి ప్రేమ చూపించడం చాలా ఆనందంగా ఉంది.

*** ఈ విజయంపై మీ స్పందన ఏంటి?**
కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలబ్రేట్ చేసుకోవాలని ఆలోచన ఉండేది. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. పెళ్లి చూపులు హిట్ అయినప్పుడు ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ సినిమా విడుదలకు ముందు ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. 'కింగ్డమ్' విడుదలకు ముందు మాక్కూడా అలాంటి ఒత్తిడి ఉంది. ఎప్పుడైతే మొదటి షో పూర్తయ్యి, పాజిటివ్ వచ్చిందో అప్పుడు చాలా సంతోషం కలిగింది.

*** దర్శకుడు గౌతమ్ తిన్ననూరి గురించి ఏంచెప్తారు?**
గౌతమ్ కుటుంబం బంధాలను, ఎమోషన్స్‌ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామా అనే ఐడియా గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. జెర్సీ లాంటి ఎమోషనల్ జర్నీలో కూడా మనకు హై ఇచ్చే మూమెంట్స్ ఉంటాయి. కింగ్డమ్ కోసం ఆసక్తికర కథను రాశారు. ఓటింగ్ చేసే సన్నివేశం గురించి గౌతమ్ కథ చెప్పినప్పుడు ఓటింగ్ చేసే సన్నివేశాల గురించి చెప్పారు. కానీ, ఆ ప్రాసెస్ ఎలా ఉంటుందో చెప్పలేదు. ఆ తర్వాత ఇలా గన్స్, కత్తుల వంటి ఆయుధాలతో ఓటింగ్ ఉంటుంది చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఆ కొత్తదనమే ప్రేక్షకుల మెప్పు పొందడానికి కారణమైంది అనిపిస్తుంది.


*** 'కింగ్డమ్' కోసం మీరు ఎలాంటి హోం వర్క్ చేశారు?**
ఈ కథ విన్న తర్వాత అసలు ఆ కాలంలో ఎలా మాట్లాడేవారు, ఎలాంటి దుస్తులు వేసుకునేవారు వంటి విషయాలు తెలుసుకోవడం మొదలుపెట్టాను. రిఫరెన్స్ కోసం పలు వెబ్ సిరీస్‌లు చూశాను. అలాగే లుక్ పరంగానూ మరింత దృఢంగా కనిపించే ప్రయత్నం చేశాను. ఒక నటుడిగా ఎప్పుడూ ఫిట్ గా ఉండటానికి ఇష్టపడతాను.
అయితే ఇందులో అన్నయ్యని తిరిగి తీసుకురావడం కోసం ఆ సామ్రాజ్యంలోకి అడుగుపెట్టే సమయంలో బల్క్ గా కనిపించాలనే ఉద్దేశంతో దాదాపు ఆరు నెలలు ప్రత్యేక కసరత్తులు చేశాను.

*** ఈ సినిమాకి మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటి?**
ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమాపై కురిపిస్తున్న ప్రేమనే నా దృష్టిలో బెస్ట్ కాంప్లిమెంట్. వాళ్ళకి సినిమా నచ్చడం ఎక్కువ సంతృప్తిని ఇస్తుంది. చాలా రోజుల తరువాత అభిమానుల కళ్ళల్లో ఆనందాన్ని చూశాను. మొదటి షో పూర్తవ్వగానే చాలామంది ఫోన్లు చేసి 'మనం హిట్ కొట్టినం' అని చెప్తుంటే మాటల్లో చెప్పలేనంత ఆనందం కలిగింది.

*** సినీ పరిశ్రమ నుంచి ఎలాంటి ప్రశంసలు వచ్చాయి?**
సినిమా చూసి సుకుమార్ గారు ఫోన్ చేశారు. సినిమా తనకు ఎంతగానో నచ్చిందని చెప్పారు. నాకు సుకుమార్ గారంటే ఎంతో ఇష్టం. ఆయన నుంచి ప్రశంస రావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. అర్జున్ రెడ్డి సమయం నుంచే నేను, సుకుమార్ గారు కలిసి సినిమా చేయాలి అనుకుంటున్నాం. ఆయనకు కూడా నేనంటే ఇష్టం. భవిష్యత్‌లో మా కలయికలో సినిమా వస్తుందని ఆశిస్తున్నాను. ప్రస్తుతం అయితే నా దృష్టి అంతా నా చేతిలో ఉన్న సినిమాలపైనే ఉంది.

*** కింగ్డమ్ విజయం మీ తదుపరి సినిమాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపబోతుంది?**
ఏ సినిమా చేసినా ప్రేక్షకులకు ఓ మంచి సినిమా ఇవ్వాలనే లక్ష్యంతోనే చేస్తాను. తదుపరి సినిమాని రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో చేస్తున్నాను. నా సినీ జీవితంలో మొదటిసారి రాయలసీమ నేపథ్యంలో చేస్తున్న చిత్రమిది. నాకు సీమ యాస అంటే చాలా ఇష్టం. అనంతరం రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. ఆంధ్రా నేపథ్యంలో సరికొత్త కథతో ఆ చిత్రం ఉంటుంది. రాహుల్, రవి ఇద్దరూ ఎంతో ప్రతిభగల దర్శకులు. ఇద్దరూ అద్భుతమైన కథలను సిద్ధం చేశారు.

*** 'కింగ్డమ్ పార్ట్ 2' ఎలా ఉండబోతుంది? ఎప్పుడు ఉంటుంది?**
ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. కానీ, ఇందులో దేశభక్తికి సంబంధించిన అంశముంది. అలాగే, ఒక తెగకు చెందిన నాయకుడి గురించి ఉంటుంది. ఇలా ఇన్ని అంశాలను ఒకే భాగంలో చెప్పడం సాధ్యంకాదు. అందుకే రెండు భాగాలుగా చెప్పాలని నిర్ణయించుకున్నాము. తన అన్నయ్య శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని మొదటి భాగంలో చూశాం. రెండవ భాగానికి సంబంధించి గౌతమ్ దగ్గర గొప్ప గొప్ప ఆలోచనలు ఉన్నాయి. మొదటి భాగంతో పోలిస్తే రెండవ భాగంగా ఇంకా అద్భుతంగా ఉండబోతుంది.



## 'సెలవిక కన్నమ్మా' అంటున్న 'మదరాసి'



తమిళ నటుడు శివకార్తికేయన్ హీరోగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ ఇద్దరూ తొలిసారి కలిసి చేస్తున్న సినిమా మదరాసి. శ్రీ లక్ష్మీ మూవీస్ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. టాలెంటెడ్ నటి రుక్మిణీ వసంత ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదలైన టైటిల్ గ్లిమ్స్ భారీ రెస్పాన్స్‌తో వస్తోంది. ఈ చిత్రానికి రాకింగ్ స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ కంపోజ్ చేశాడు. సెలవిక కన్నమ్మా అనే పాటను విడుదల చేశారు. దీంతో ఈ సినిమా ప్రమోషన్ మొదలు పెట్టారు. టీజర్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండగా, ఈ పాట మాత్రం వెరీ డిఫరెంట్‌గా వుంది. లవ్ ఫెయిల్యూర్ సాంగ్ అయినప్పటికీ, డ్యాన్స్‌తో ప్రజెంట్ చేయడం ఆకట్టుకుంది. శ్రీనివాస మౌళి ఈ పాటలకు సాహిత్యం అందించారు. ఈ చిత్రంలో విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీ సుదీప్ ఎలమోన్ అందిస్తున్నారు. మదరాసి సినిమాను సెప్టెంబర్ 5న థియేటర్లలో విడుదల చేయనున్నారు.

## 'ఓజీ' తొలిగీతం విడుదల



'ఓజీ' పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న 'ఓజీ' చిత్రం నుంచి మొదటి గీతం 'ఫైర్ స్టార్మ్' విడుదలైంది. ఈ గీతం నిజంగానే ఓ అగ్ని తుఫానులా ఉంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న 'ఓజీ' చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ భీకరమైన గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక మోహన్, అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాకుడిగా రవి కె.చంద్రన్, ఎడిటర్ గా నవీన్ నూలి వ్యవహరిస్తున్నారు. తమన్ స్వరపరిచిన 'ఫైర్ స్టార్మ్' గీతం రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తోంది. ప్రముఖ నటుడు శింబు ఈ పాటకు తన శక్తివంతమైన గాత్రాన్ని అందించారు. ఉద్వేగం, ఉత్సాహంతో నిండిన ఆయన స్వరం.. ఈ పాటను మరోస్థాయికి తీసుకొనివెళ్ళింది. ఓజీ' చిత్రం సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

## 'మిత్ర మండలి' నుంచి రెండో పాట విడుదల



ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన నిర్మాణ సంస్థ బి.వి.వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప్, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, 'కత్తందుకో జానకి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా 'స్వేచ్ఛ స్టాండు' అనే పాటను విడుదల చేశారు. 'మిత్ర మండలి' నుంచి మొదటి గీతంగా విడుదలైన 'కత్తందుకో జానకి' అందరూ సరదాగా పాడుకునేలా ఉండి, సోషల్ మీడియాలో ఒక ఊపు ఊపింది. ఇప్పుడు రెండవ గీతంగా వచ్చిన 'స్వేచ్ఛ స్టాండు' కూడా అంతే సరదాగా ఉంది.

## కెవిఎన్ ప్రొడక్షన్‌లో బాబీ చిత్రం

చిరంజీవితో వాల్తేరు వీరయ్య, బాలకృష్ణతో డాకు మహారాజ్ సినిమాలను రూపొందించిన దర్శకుడు బాబీ కొల్లి. ఇప్పుడు బాబీ తన తదుపరి చిత్రం కెవిఎన్ ప్రొడక్షన్స్ సంస్థలో చేయబోతున్నారు. ఇండియాలోనే ప్రతిష్టాత్మకమైన చిత్ర నిర్మాణ సంస్థగా పేరు గాంచిన కెవిఎన్ సంస్థతో బాబీ పాన్ ఇండియా సినిమా చేయనున్నారు. దీనికి సంబదించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బాబీ జన్మదినం సందర్భంగా ఈ ప్రకనటను విడుదల చేశారు. పెద్ద హీరోలకు మంచి కథలు రాస్తారని పేరు తెచ్చుకున్న బాబీ తానూ తీయబోయే తాజా చిత్రం కోసం కూడా ఓ పెద్ద హీరోను అప్రోచ్ అవుతున్నారు. టాక్సిక్, ఖైదీ 2 లాంటి భారీ ప్రాజెక్టులు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన నటి నటులు, సాంకేతిక వివరాలు త్వరలో ప్రకటిస్తారు.



## కుటుంబంతో చూసే చిత్రమిది – ప్రవీణ్

వినోదంతో పాటు ఎమోషన్‌ను మేళవించి.. ప్రేక్షకులను రెండున్నర గంటలు ఎంటర్‌టైన్ చేయడమే ధ్యేయంగా రూపొందిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్' ఈ సినిమా చూసిన వాళ్లకు ఓ మంచి విందు భోజనం ఆరగించిన ఫీల్ కలగబోతుందని చెబుతోంది చిత్ర టీమ్. తన నటనతో, డైలాగ్ డెలివరితో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్, ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న విడుదలకు సిద్ధమౌతుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రంలోని పాటలకు, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈవేడుకకు హీరో సుధీర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. ప్రవీణ్ నాకు వన్‌ఆఫ్ ఫేవరేట్ యాక్టర్. నన్ను ఏ దర్శకుడు అడిగినా నేను ప్రవీణ్ పేరు చెబుతాను. ఏ సినిమా అయినా ఎలా సక్సెస్ చేయాలో తపన పడుతుంటాడు. ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నాడు అని అన్నారు.




## ఫేక్ అటెండెన్స్

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీ కార్యదర్శులు 'ఫేక్ అటెండెన్స్'నమోదు చేసినట్టు గుర్తించారు. ఇంత భారీ సంఖ్యలో ఫేక్ హాజరులు నమోదవ్వడం పట్ల ఉన్నతాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఒక పంచాయతీ కార్యదర్శిని తక్షణమే సర్వీస్ నుంచి తొలగించగా, మరో 15 మంది రెగ్యులర్ సర్వీస్‌కు చెందిన కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అనుమానం ఉన్న మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించొద్దని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. కేవలం కార్యదర్శుల అటెండెన్స్‌ను పర్యవేక్షించాల్సిన ఎంపిఒల నిర్లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నది. విధుల్లో శ్రద్ధ లేకుండా వ్యవహరించిన 47 మంది ఎంపిఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. త్వరలోనే వీరిపైన కూడా శాఖపరమైన చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. తప్పు రుజువైతే, ఎంతటి అధికారైనా ఉపేక్షించదనే ప్రభుత్వం సంకేతాలు జారీ చేసింది. అయితే ఆదిలాబాద్, జగిత్యాల, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో ఒక కార్యదర్శిని సస్పెండ్ చేశారు. రంగారెడ్డిలో ఇద్దరు, వనపర్తిలో ఏడుగురు కార్య దర్శులను సస్పెండ్ చేశారు.

**ఫేక్ అటెండెన్స్‌లో.. సిద్దిపేటలో 70 మంది**
రాష్ట్ర వ్యాప్తంగా 553 మంది పంచాయతీ కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్ నమోదు చేశారు. ఇందులో అత్యధికంగా సిద్దిపేటలోనే 70 మంది, నల్లగొండ 69, వికారాబాద్‌లో 63 మంది ఉన్నారు. జిల్లాల వారిగా( ఆదిలాబాద్26, భద్రాద్రి కొత్తగూడెం 42, జగిత్యాల22, జోగులాంబ గద్వాల 2, కామారెడ్డి43. ఖమ్మం21,మహబూబ్‌నగర్ 11,మంచిర్యాల 21, మెదక్ 20, నాగర్‌కర్నూల్ 9,నారాయణపేట2, నిర్మల్5, పెద్దపల్లి6, రాజన్న సిరిసిల్లా 32, రంగారెడ్డి11, సంగారెడ్డి 2, సూర్యాపేట48, వనపర్తి8, వరంగల్10, యాదాద్రి భువనగిరి 10 ఉన్నారు.

**ఎంపిఒలకు షోకాజు నోటీసులు...**
పంచాయతీ కార్యదర్శుల ఫేక్ అటెండెన్స్‌ను పర్యవేక్షించకుండా నిర్లక్ష్యం వహించిన 47మంది ఎంపిఒలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులను జారీ చేసింది. ఆదిలాబాద్1,భద్రాద్రికొత్తగూడెం17, ఖమ్మం1, నల్లగొండలో 15, నారాయణపేట1, సిద్ధిపేట1, వికారాబాద్5, యాదాద్రిభువనగిరి6 ఉన్నారు.

## అబద్ధాలకోరులే

(మొదటి పేజీ తరువాయి)

మార్పులు రావాలని ఆయన సూచించారు.

**కాళేశ్వరం అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలకు సంబంధించి నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందిన నేపథ్యంలో బాధ్యులైన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకోబోయే చర్యలు కక్ష సాధింపుగా వ్యవహరించొద్దన్నారు. ఆ నివేదికలోని అన్ని అంశాలను ప్రజలకు వివరించాలని, పారదర్శకంగా చర్యలు ఉండాలని నారాయణ ప్రభుత్వానికి సూచించారు. పొలిటికల్ ఇంజనీర్ల నిర్వాహకం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి ఏర్పడిందని తెలిపారు. మాయల ఫకీర్ ప్రాణాలు ఎక్కడో చిలకలో దాగి ఉన్నట్టుగా, ప్రస్తుతం కమిషన్ నివేదికలో మాజీ సిఎం కెసిఆర్ బాగోతం దాగి ఉందని నారాయణ తెలిపారు.

**పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ ఏమి చేస్తోంది**
పార్టీల ఫిరాయించిన ఎంఎల్‌ఎలపైన మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినంత మాత్రాన జరిగేది ఏమి లేదని నారాయణ అన్నారు. స్పీకర్‌కు ఉన్న విశేష అధికారుల నేపథ్యంలో ఆయన తీర్పును ఎవ్వరూ కాదనే పరిస్థితి ఉండబోదని అన్నారు. ఎంఎల్ఎలు, ఎంపిల పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ అసలు ఏం చేస్తోందని నారాయణ ప్రశ్నించారు. ఎంఎల్ఎలు, ఎంపిలు ఎన్నికైనట్లు సర్టిఫికెట్లును అందజేసి, వారిని చట్టసభలకు పంపించేదే ఎన్నికల కమిషన్ అని, వారి వద్ద అన్ని వివరాలను ఉంటాయని, అలాంటిప్పుడు ఎవరైన పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే ఎన్నికల కమిషన్ తక్షణమే సుమోటోగా స్వీకరించి అనర్హులుగా ప్రకటించాలని నారాయణ డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి ఏమైనా అడ్డంకులు అనుకుంటే, వాటిని సవరించాలని సూచించారు.

**ఫీజు రియాంబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లులు చెల్లించాలి**
విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్ బిల్లులను నాలుగేళ్లుగా పెండింగ్‌లో పెట్టడమనేది నేరపూరితమైన తప్పుగా నారాయణ అభివర్ణించారు. తక్షణమే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు విద్యార్థుల రియాంబర్స్‌మెంట్ ఫీజులను చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్ల నుంచి ఫీజు రియాంబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెప్టెంబర్ 22 నుంచి చండీఘర్‌లో సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభల్లో బిజెపి వ్యతిరేఖ ఫ్రంట్ బలోపేతం చేయడంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను ఉధృతం చేసే దీశగా కార్యచరణను రూపొందించనున్నట్లు నారాయణ వెల్లడించారు.

## ఏకీకృత అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్ 112




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్, అగ్నిమాపక, మెడికల్, మహిళలు, పిల్లల భద్రత, రోడ్డు ప్రమాదాలు, విపత్తుల సమయంలో 112కు డయల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చు. గతంలో ఇలాంటి తక్షణ సహాయ సేవలు పొందేందుకు వేర్వేరు అత్యవసర నంబర్లు పోలీస్ 100, ఫైర్ 101, అంబులెన్స్ 108, మహిళల కోసం 1090 ఉండేవి. ఇప్పుడు వీటన్నింటికి బదులుగా 112 నంబర్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చారు. 112 డయల్ అనేది భారతదేశంతో పాటు అనేక ఇతర దేశాల్లో అమలులో ఉన్న ఏకీకృత అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్. బాధితులు 112కు ఫోన్ చేస్తే, వారి స్థానాన్ని జిపిఎస్ ద్వారా ట్రాక్ చేసి, సంబంధిత విభాగానికి సమాచారం పంపిస్తారు. అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుంటారు. స్మార్ట్‌ఫోన్‌లో పవర్ బటన్‌ను మూడు సార్లు త్వరగా నొక్కితే లేదా ఫీచర్ ఫోన్‌లో 5 లేదా 9 కీని ఎక్కువసేపు నొక్కితే కూడా 112కి ప్యానిక్ కాల్ వెళ్తుంది. ఈ నంబర్ ద్వారా 24 గంటలు అత్యవసర సహాయం లభిస్తుంది. ఈ నెంబర్‌పై బాధితులు ఏ భాషలో తమ బాధలను చెబుతారే ఆ భాష్కు చెందిన అధికారుల ద్వారా సహాయం అందుతుంది. డయల్ 112లో అన్ని భాషలకు చెందిన అధికారులు ఉంటారు. 112కి వచ్చిన కాల్‌లు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరతాయి. అక్కడి కాల్ సెంటర్ సిబ్బంది కాల్‌ను స్వీకరించి, బాధితుల అత్యవసర పరిస్థితిని తెలుసుకుని, జిపిఎస్ ద్వారా లొకేషన్‌ను ట్రాక్ చేస్తారు. తెలంగాణలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి)లో డయల్ 112 ఉంది. యూరోపియన్ యూనియన్ సహా అనేక దేశాల్లో కూడా 112 అత్యవసర నంబర్‌గా ఉపయోగిస్తారు. జిఎస్ఎం మొబైల్ ఫోన్లలో 112 నంబర్ ఎప్పుడైనా పనిచేస్తుంది, ఫోన్ లాక్‌లో ఉన్నా, కొన్ని సందర్భాల్లో సిమ్ లేకపోయినా కూడా. పోలీస్, అగ్నిమాపక, మెడికల్, మహిళలు, పిల్లలు, విపత్తుల సహాయం కోసం ఒకే నంబర్‌కు డయల్ చేయడం వల్ల ప్రజలకు గందరగోళం లేకుండా, వేగంగా సహాయం అందుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఇకపై 112 నంబర్‌కు డయల్ చేస్తే అన్ని రకాల అత్యవసర సేవలు ఒకే చోట నుండి అందుబాటులోకి వస్తాయి. ఇది దేశ వ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో పూర్తిగా అమల్లో ఉంది.

## భవిష్యత్ ఉద్యమాల రూపకల్పన

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య గత మహాసభ నుండి నేటి వరకు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పిలుపులతోపాటు స్థానికంగా ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ, కార్మికులు, యువత, విద్యార్థి, సమస్యలపై పార్టీ ప్రజా సంఘాలు పట్టిన పోరాటాలను వివరిస్తూ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. భవిష్యత్తులో గతంలో జరిగిన చిన్న చిన్న లోపాలను సరి చేసుకుని భవిష్యత్తులో జిల్లా ప్రజలకు చైతన్యవంతులు చేసి, జిల్లాలోని అన్ని ప్రాంతాలకు పార్టీని విస్తరించడంతోపాటు స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, కె.రామస్వామి, కావలి నరసింహ, ఓరుగంటి యాదయ్య, బుద్ధుల జంగయ్య, రామకృష్ణ, ఎం.శ్రీను, నీలమ్మ, ఎం రియాజ్, బాతరాజు నరసింహ, ఆర్.యాదగిరి, విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యారా క్రాంతి,శివకుమార్, పవన్, సిపిఐ మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, ప్రజానాట్యమండలి కళాకారులు,తదితరులు పాల్గొన్నారు. మహాసభకు ముందు మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

## మూడవసారి సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా పాలమాకుల జంగయ్య



సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా పాలమాకుల జంగయ్య మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో జరిగిన సిపిఐ జిల్లా 17వ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. 65 మందిని పూర్తి స్థాయి కౌన్సిల్ సభ్య లు, 6 మందిని ఆహ్వానితులలుగా, మరో 6 మందిని క్యాండిడేట్స్ సభ్యులతోపాటు 21 జిల్లా కార్యవర్గ సభ్యులు కలిసి జిల్లా కార్యదర్శిగా మూడవసారి పాలమాకుల జంగయ్యను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.

## యావజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే, రేవణ్ణను శుక్రవారం దోషిగా తేల్చగా తాజాగా శిక్షను ప్రకటించారు. అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. శుక్రవారం తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరం కూడా వెక్కివెక్కి ఏడ్చాడు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో జెడిఎస్ పార్టీ అప్పటి ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు చెందినవిగా భావిస్తున్న అశ్లీల వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ కేసులో ఎంపి ప్రజ్వల్‌తో పాటు ఆయన తండ్రి రేవణ్ణపై కూడా లైంగిక వేధింపులు, దాడులకు సంబంధించిన అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ప్రజ్వల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ 2024 ఏప్రిల్ 28న ఓ మహిళ హోళెనరసిపుర ఠాణాలో ఫిర్యాదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై రెండు సార్లు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా, అనంతరం కర్ణాటక ప్రభుత్వం కూడా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈలోగా ప్రజ్వల్ రేవణ్ణ దేశం వదిలి జర్మనీకి పారిపోయారు. తరువాత జరిగిన పరిణామాలతో చివరికి ఆయన బెంగళూరుకు రాగానే పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. దీనిపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసి 2వేల పేజీల ఛార్జిషీట్‌తో పాటు విచారణలో భాగంగా 123 ఆధారాలను సేకరించింది. ఈ కేసులో 14 నెలలుగా జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న ప్రజ్వల్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఇప్పుడు శిక్ష ఖరారు చేసింది.

## షరతులతో బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

ఆ ఇద్దరు సన్యాసినులు ముగ్గురు గిరిజన బాలికలను మతమార్పిడీ చేయించేందుకు ప్రయత్నించారని బజరంగ్ దళ్, హిందూవాహిని సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో గత నెల 25న పోలీసులు ఆ ఇద్దరు సన్యాసినులను అరెస్ట్ చేశారు. బెయిల్ కోసం సన్యాసినిలు ముందు దుర్గ్‌లోని సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. అయితే వారి బెయిల్ పిటిషన్‌లను సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. మానవ అక్రమ రవాణా కేసులలో నిందితులకు బెయిల్ మంజూరు చేసే అధికారం భారత న్యాయ సంహిత నిబంధనల ప్రకారం సెషన్స్ కోర్టుకు లేదని, కాబట్టి బెయిల్ కోసం ఎన్ఐఎ స్పెషల్ కోర్టును ఆశ్రయించాలని సెషన్స్ కోర్టు జడ్జి సూచించారు. దాంతో కేరళ సన్యాసినిలు ఎన్ఐఎ స్పెషల్ కోర్టును ఆశ్రయించి బెయిల్ పొందారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com